తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కడప

: fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-10-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 242 పేజీలు: 10+4 వెల: 6.50





బుధవారం న్యూఢిల్లీలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకల్లో పాల్గొన్న ప్రధాని మోదీని ఘనంగా సత్కరిస్తున్న దృశ్యం

# గోదావరి జలాలు

>> ఎకరాల స్థిరీకరణ సాధ్యమవుతుంది. రాయలసీమతో పాటు, ప్రకాశం, నెల్లూరు, కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోని కరవు ప్రాంతాల్లో ఆయకట్టుకూ నీళ్లు అందించే ఆస్కారం ఉంది. ప్రస్తుతం కొత్త ప్రతిపాదనపై కసరత్తు సాగుతోంది. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపుల తర్వాత గోదావరి వరద జలాల మళ్లింపు పథకం తుది రూపు దిద్దుకోనుంది. సెగ్మెంట్ 1లో పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీకి నీళ్లు మళ్లించనున్నారు. జులై 1 నుంచి అక్టోబరు 15 లోపు రోజుకు 2 టీఎంసీలు చొప్పున నీటిని మళ్లించే అవకాశం ఉంటుంది. 83 రోజులు సముద్రంలో లక్ష క్యూసెక్కులపైన నీళ్లు కలిసిపోతున్నాయి. రోజుకు 2 టీఎంసీలు చొప్పున 100 రోజులపాటు మళ్లించేందుకు సమస్య ఉండదు. ప్రస్తుత నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులతో పాటు, కొత్తగా ప్రతిపాదిస్తున్న ప్రాజెక్టుల అవసరాలు తీరిన తర్వాతే ఈ వరద జలాలు మళ్లిస్తారు. దీని కోసం ప్రత్యేకంగా పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు వరద కాలువను నిర్మిస్తారు. తాడిపూడి కాలువను దీనికి ఉపయోగించుకుంటారు. సెగ్మెంట్ 1కు దాదాపు 13 వేల కోట్లు ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా వేస్తున్నారు. సెగ్మెంట్ 2 లో ప్రకాశం బ్యారేజీ నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు నీటిని మళ్లిస్తారు. ప్రకాశం బ్యారేజీలో వైకుంఠపురం వద్ద నుంచి రోజుకు 23 వేల క్యూసెక్కులు ఎత్తిపోస్తారు. ఆరు చోట్ల పంపుహౌస్‌లు నిర్మిస్తారు. నీటిని +15.50 మీటర్ల నుంచి +229 మీటర్లకు ఎత్తిపోయాలి. బొల్లాపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మించాలి. దాదాపు 173 టీఎంసీల నీటిని నిల్వ ఉంచేలా ఈ జలాశయ నిర్మాణం ఉంటుంది. భూసేకరణ, పునరావాసం, ఇతరత్రా అన్నీ కలిపి దాదాపు 36 వేల కోట్లు వరకు ఈ విభాగంలో వ్యయమయ్యే అవకాశం ఉందంటున్నారు..సెగ్మెంట్ 3లో బొల్లాపల్లి జలాశయం నుంచి రోజుకు 2 టీఎంసీలు చొప్పున నీటిని మళ్లిస్తారు. కేవలం రెండు దశల్లో నీటిని ఎత్తిపోస్తే సరిపోతుంది. ఈ నీటిలో రోజుకు 1.40 టీఎంసీల నీటిని మూసీ, మున్నేరు ఉపనదుల మధ్య ఎప్పటి నుంచో సాగులోకి రాని భూమిని కొత్తగా సాగులోకి తీసుకువచ్చేందుకు వినియోగిస్తారు. బొల్లాపల్లి నుంచి చిన్ననీటి చెరువులకూ నీళ్లు ఇస్తారు. తాగు, పారిశ్రామిక అవసరాలకూ కేటాయిస్తారు. వెలిగొండ ప్రాజెక్టులో 4.47 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ఈ నీరు ఉపకరిస్తుంది. దీనికోసం బొల్లాపల్లి నుంచి నీటిని నల్లమలసాగర్ జలాశయానికి మళ్లిస్తారు. లేకుంటే వెలిగొండ తూర్పు ప్రధాన కాలువకు మళ్లించి 3 లక్షల ఎకరాల స్థిరీకరణకు ఈ నీటిని వాడతారు. నీటిని సోమశిల ప్రాజెక్టుకు తరలించి సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్టు ఆయకట్టు స్థిరీకరణకు ఉపయోగిస్తారు. నల్లమల సాగర్ వరకు మళ్లించేందుకు సుమారు 9 వేల కోట్లు ఖర్చవుతుంది.

# అమెరికాలో 'షట్ డౌన్'

>> గులకు తాత్కాలికంగా వేతనం లేని సెలవును ఇస్తారు. కాంగ్రెస్ బడ్జెట్ ఆఫీస్ అంచనాల ప్రకారం.. సుమారు 7.50 లక్షల మంది ఫెడరల్ ఉద్యోగులు తాత్కాలికంగా జీతం కోల్పోయే అవకాశాలు ఉన్నాయి. షట్‌డౌన్ వల్ల అనేక కీలక ప్రభుత్వ సేవలు నిలిచిపోనున్నాయి. అందులో ఫెడరల్ ఫుడ్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్స్, ఫుడ్ ఇన్‌స్పెక్షన్లు, ప్రభుత్వ ప్రీస్కూల్స్, స్టూడెంట్ లోన్స్, ఇమ్మిగ్రేషన్ విచారణలు, నేషనల్ పార్కులు వంటివి పూర్తిగా మూసివేయడం లేదా తక్కువ సంఖ్యలో సేవలు అందించడం చేస్తారు. అత్యవసర సేవలతో పాటు సోషల్ సెక్యూరిటీ, మెడికేర్ చెక్కుల పంపిణీ.. నాసా అంతరిక్ష మిషన్లు.. ట్రంప్ ఇమ్మిగ్రేషన్ కార్యకలాపాలు. ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్డీయే)లోని కొన్ని ప్రజా ఆరోగ్య పనులు కొనసాగనున్నాయి. అయితే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ పరిస్థితికి మరింత ఆజ్యం పోశారు. షట్‌డౌన్ జరిగితే తన పాలనలో చాలా మంది ఫెడరల్ ఉద్యోగులను శాశ్వతంగా తొలగిస్తానని వారు ఎక్కువగా డెమొక్రాట్లు అయి ఉంటారని ఆయన చేసిన హెచ్చరికలు ఇప్పుడు అమెరికాలో సంచలనం సృష్టిస్తున్నాయి.

# కేంద్ర ఉద్యోగులకు 3% డిఎ పెంపు

>> వైష్ణవ్ వెల్లడించారు. 7వ వేతన కమిషన్ నిబంధనల ప్రకారం డిఎ పెంపు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు అందరికీ వర్తిస్తుందని తెలిపారు. తాజా డిఎ పెంపు వల్ల కేంద్ర ప్రభుత్వ ఖజానాపై ఏటా అదనంగా రూ.10,083.96 కోట్ల భారం పడుతుందన్నారు. ఈ పెంపు జులై 1 నుంచే అమలులోకి వస్తుందని ఆయన తెలిపారు. దీని వల్ల 49.19 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68.72 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. మోడీ ప్రభుత్వం నిర్ణయంతో దాదాపు కోటి మందికి పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు పండగ వాతావరణం మరింత ఆనందదాయకంగా మారుతుందని చెప్పవచ్చు.

# ప్రజారోగ్యంలో వెయ్యి కోట్లు ఆదా

>> షీటు ధర రూ.170 నుంచి రూ.158.10 (రూ.11,900కు తగ్గింది 33 రకాల మందులపై 12 పన్ను పూర్తిగా తొలగించారు. క్యాన్సర్, ఇతర అరుదైన మందుల ధరలపై జిఎస్టీని పూర్తిగా తొలగించారు. దీనిప్రకారం ఫెజిలాటెడ్ లైపోజోమాల్ (ఒనీవైడ్) ఇంజక్షన్ (వయల్) ధర రూ.4,80,000గా ఉంది. కొత్త ధర రూ.4,28,570 దీనివల్ల బాధితుడికి రూ.51,430 ఆదా అయింది. దారాటూమాబ్ రూ.35,000(డార్జాలెక్స్ ఫాసిప్రో800ఎంజీ) ఇంజక్షన్ (వయల్) ధర గత నెల 21వ తేదీ వరకు రూ.2,30,150గా ఉండేది. దీని ధర ప్రస్తుతం రూ.2,10,450 అయింది ఆదా రూ.28,700 ఇమిగ్లిసిరేజ్ (సెరిజైమ్) ఇంజక్షన్ (వయల్) పై ఉన్న 5శాతం జీఎస్టీని తొలగించినందున రూ.3,70,000 నుంచి రూ.3,52,381కు అందుబాటులోనికి వచ్చింది. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా 2024- 25 ఆర్థిక సంవత్సరంలో రూ.4,077 కోట్లు విలువైన ప్రీ ఆథరైజేషన్లు ఇచ్చారు. ఇందులో రూ.2,308.56 కోట్లు మెడికేషన్, కన్జుమబుల్స్ కింద ఉన్నాయి. ప్రస్తుతం తగ్గిన ధరలవల్ల రూ.203.85 కోట్లు వరకు ఆదా అవుతుందని అంచనా.

**మందులు, సర్జికల్ కొనుగోళ్ల ద్వారా రూ.40 కోట్లు!**

"రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాలు, అభివృద్ధి సంస్థ తరపున 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.679 కోట్లతో మందులు, సర్జికల్ ఐటమ్స్, ఇంప్లాంట్లు, డయాగ్నస్టిక్ కిట్లు, ఇతర వాటిని కొనుగోలుచేశాం. ఇందులో రూ.71 కోట్లు జిఎస్టీ కింద చెల్లిందాం జిఎస్టీ2.0 కారణంగా ఈ రూ.71 కోట్లులో రూ.40 కోట్లు ఇకపై చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇలా పరిశీలిస్తే.. ప్రతి ఏడాది జిఎస్టీ సంస్కరణల వల్ల సగటున రూ.250 కోట్లు వరకు ఆదా అవుతుందని అంచనా వేస్తున్నాం" అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు.

# పర్యాటక శాఖకు గ్లోబల్ టూరిజం అవార్డు

>> ధానిని నిర్మించడం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, భారతదేశ పర్యాటక వృద్ధిలో కీలక పాత్ర పోషించడం, పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించినందుకు ఆంధ్రప్రదేశ్ టూరిజంకు అవార్డు కేటాయించామని గ్లోబల్ న్యూస్ నెట్వర్క్ యాజమాన్యం పేర్కొంది. ప్రధానంగా గండికోటను అత్యంత ఆశాజనకమైన కొత్త పర్యావరణ, సాహస గమ్యస్థానాలలో ఒకటిగా విజయవంతంగా నిలపడం, మౌలిక సదుపాయాల కల్పన, ఆతిథ్య సామర్థ్యం, ఉపాధిని పెంచడానికి పిపిపి విధానంలో గణనీయమైన ప్రైవేట్ రంగ పెట్టుబడులను ఆకర్షించడం, 15 నెలల కాలంలో ప్రఖ్యాత సంస్థలతో 103 ఎంఓయూలను కుదుర్చుకోవడం అవార్డు సాధించడానికి కారణాలు అయ్యాయి. అంతేగాక బీచ్,టెంపుల్, ఎకో టూరిజం ప్రక్రియలతో కూడిన టూరిజం సర్క్యూట్లను అభివృద్ధి చేయడంతో పాటు, యువత భాగస్వామ్యాన్ని, స్థిరమైన పర్యాటక అభివృద్ధిని ప్రోత్సహించడం తదితర కారణాల వల్ల గ్లోబల్ టూరిజం అవార్డుకు ఎంపికైందని ఏపీ పర్యాటకశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, అధికారులు పర్యాటక రంగంపై చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ వల్లే అవార్డులు సాధించగలుగుతున్నామని పర్యాటక శాఖ ఈ సందర్భంగా పేర్కొంది.

# కనక దుర్గమ్మ తెప్పోత్సవం రద్దు

**విజయవాడ,అక్టోబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** విజయదశమి రోజున కృష్ణా నదిలో నిర్వహించే హంస వాహన తెప్పోత్సవం వరద ఉధృతి కారణంగా రద్దు చేశారు.విజయవాడ ఇంద్రకీలాద్రిపై దేవీ శరన్నవరాత్రోవాలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. 10వ రోజు ఇవాళ మహా నవమి పర్వదినాన మహిషాసుర మర్ధిని అవతారంలో అమ్మవారు యాత్రికులకు దర్శనమిస్తున్నారు. దసరా ఉత్సవాల ముగింపులో భాగంగా కృష్ణా నదికి ఎగువ నుంచి భారీగా వరద వస్తున్న నేపథ్యంలో అమ్మవారి తెప్పోత్సవం నిర్వహణ అసాధ్యమని నీటి పారుదల శాఖ ఆలయ కమిటీకి సూచించింది. ప్రస్తుతం కృష్ణా నదిలోకి వరద ప్రవాహం 6.5 లక్షల క్యూసెక్కులకు మించి ఉందని.. ఇది ఇంకా పెరిగి చాన్స్ ఉందని నీటీ పారదుల శాఖ అధికారులు స్పష్టం చేశారు.

# కరెంటు ఛార్జీలు పెంచం

>> తెలంగాణలో ఏడాదికి రూ.8,179 కోట్లు ఇస్తుంటే మన రాష్ట్రంలో ఏడాదికి రూ.32,143 కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు.

**మహిళా సంక్షేమానికి పెద్దపీట**

సూపర్ సిక్స్ పథకాల అమల్లో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం అమలు చేస్తున్నామని, ఇందుకోసం రూ.10,090 కోట్లు ... 63.77 లక్షల మంది విద్యార్థుల తల్లులకు బ్యాంకు ఖాతాలో నగదు జమ చేశామని ఆయనన్నారు. ఆడబిడ్డలకు వంటింటి కష్టాలు తీర్చాలని దీపం పథకాన్ని అమలు చేస్తున్నామని, ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని, పథకం వల్ల ఏడాదిలో కోటికి పైగా కుటుంబాలు ప్రయోజనం పొందాయని ఆయన వివరించారు. స్త్రీ శక్తి పథకాన్ని ఆగస్ట్ 15న ప్రారంభిస్తే 45 రోజుల్లోనే దగ్గర దగ్గరగా మహిళలు 10 కోట్ల ప్రయాణాలు చేయడం ఆనందంగా ఉందని, ఈ పండుగ సీజన్ లో అన్ని దేవాలయాల్లో మహిళా భక్తుల సంఖ్య భారీగా పెరిగిందని, పథకం అమల్లో భాగంగా నెలకు రూ.247 కోట్లు, ఏడాదికి రూ.2,963 కోట్లు స్త్రీ శక్తి కోసం ఖర్చు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

**అక్టోబర్ 4న ఆటో డ్రైవర్ల సేవలో**

డ్రైవర్ల కష్టాలు తనకు తెలుసు కాబట్టే వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు పథకం తెస్తున్నామని సిఎం అన్నారు. ఉచిత బస్సు పథకం వల్ల ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు ఆదాయం తగ్గకుండా ఉండేందుకు ఈ నెల 4న ఆటో డ్రైవర్ సేవలో పథకానికి శ్రీకారం చుడుతున్నామని, ఒక్కో ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.15,000 ఆర్థిక సాయం ఇస్తామని ఆయన పేర్కొన్నారు. దాదాపు 2.90 లక్షల మంది ఆటోడ్రైవర్లు ఈ పథకానికి అర్హులుగా గుర్తించామని, ఈ పథకం అమలుకు ఏడాదికి రూ.435 కోట్లు ఖర్చు చేస్తున్నామని సిఎం చంద్రబాబు వివరించారు. సూపర్ సిక్స్ లో మొదటి హామీ మెగా డిఎస్సీ అని, ఎన్నికల ప్రచారంలో చెప్పినట్టే అధికారంలోకి రాగానే మొదటి సంతకం పెట్టి ఏడాదికే టీచరు పోస్టులు ఇచ్చామని చెబుతూ 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి యువతకు అండగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో అందరి ఆకలి తీర్చేలా 204 అన్న క్యాంటీన్లు పనిచేస్తున్నాయని, యూనివర్సల్ హెల్త్ పాలసీ త్వరలో తీసుకువస్తున్నామని తెలిపారు. జిఎస్టీ తగ్గింపుతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం దాదాపు రూ.8 వేల కోట్లు తగ్గుతుందని అయినా దీన్ని స్వాగతిస్తూ శాసన సభలో తీర్మానం చేశామని చెబుతూ, అందుకు కారణం...పేద, మధ్యతరగతి ప్రజలకు రూ.8 వేల కోట్ల మేర ప్రయోజనం కలుగుతుంది అనేది తమ ఆలోచన అని చంద్రబాబు పేర్కొన్నారు.

**భవిష్యత్‌లో కరెంటు చార్జీలు పెంచబోం..**

ఎన్డీఏ ప్రభుత్వంలో కరెంటు చార్జీలు పెంచబోమని, వీలైతే తగ్గించే చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి తెలిపారు. సమర్థ నిర్వహణతో విద్యుత్ రంగాన్ని గాడిన పెట్టామని ఆయనన్నారు. గత ప్రభుత్వంలో 9 సార్లు కరెంటు రేట్లు పెంచి రూ. 32 వేల కోట్ల భారం ప్రజలపై వేశారని విమర్శించారు.. దేశ చరిత్రలో తొలి సారి ట్రూడౌన్‌తో విద్యుత్ చార్జీల భారం తగ్గిస్తున్నామని, నవంబర్ 13 నుంచి ట్రూ అప్ చార్జీలు యూనిట్ కు 13 పైసలు తగ్గుతాయని ఆయన వివరించారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధి బాధ్యత నాది**

ఉత్తరాంధ్రను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తనదని ముఖ్యమంత్రి అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కావాలనే ఉద్దేశంతోనే భోగాపురం ఎయిర్ పోర్టు ఇక్కడ నిర్మిస్తున్నామని, గత పాలకుల వల్ల భోగాపురం ఎయిర్ పోర్టు ఆలస్యమైందని ఆక్షేపిస్తూ 2026 ఆగస్టు నాటికి భోగాపురం ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని వంశధార, నాగావళి, తోటపల్లి , తారకరామ, తీర్థసాగర్ సహా అనేక ప్రాజెక్టులు తామే ప్రారంభించామని, రాబోయే రెండేళ్లలో ఉత్తరాంధ్రలో రూ. 2 వేల కోట్ల వ్యయంతో ప్రాజెక్టులు పూర్తిచేస్తామని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తిచేసి గోదావరి నుంచి వంశధారకు అనుసంధానం చేసి నీటి ఎద్దడిని నివారిస్తామని తెలిపారు. మర్రివలస నుంచి గజపతి నగరం వరకూ నూతన రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని, అటు విశాఖ నగరానికి టిసిఎస్, కాగ్నిజెంట్, గూగుల్ డేటా సెంటర్ వస్తున్నాయని వెల్లడించారు. సెంట్రల్ యూనివర్శిటీ సమీపంలోనే ట్రైబల్ యూనివర్సిటీ కూడా నిర్మాణమవుతోందని, రూ. కోటీ 47 లక్షలతో ఆర్సీఆర్ మిథల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోందని వివరించారు. విశాఖ, రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవేతో దేశమంతటా రవాణాకు కనెక్టివిటీ మెరుగవుతుందన్ని ముఖ్యమంత్రి తెలిపారు.

**తుగ్లక్ పాలన ముగిసింది..**

గతంలో పాలకులు వస్తున్నారంటే పరదాలు కట్టేవారని, వచ్చినవాళ్లు వెళ్లకుండా గోతులు తవ్వేవారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో ప్రజలు స్వేచ్ఛగా ఉండే పరిస్థితులు లేవని ఆక్షేపిస్తూ 2024లో ప్రజలకు స్వేచ్ఛ ,స్వాతంత్రం వచ్చిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. కొన్ని పార్టీలకు మంచి పనులు చేయడం రాదని, ఇతరులు చేస్తే తట్టుకోలేరని అపహాస్యం చేశారు. అడుగడుగునా అడ్డుకునే కుట్రలు చేస్తారని, తప్పుడు వార్తలు ప్రచురిస్తూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తారని ఆరోపించారు.కానీ అలాంటి వారి ఆటలు సాగవని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే అదే వారికి చివరి రోజవుతుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

**శ్రీవారి ఆశీస్సులతో ముందుకు..**

సాక్షాత్తు ఆ వెంకటేశ్వర స్వామే తనకు ప్రాణభిక్ష పెట్టాడని, ఆ స్వామి ఆశీస్సులతో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తానని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రాణదానం ట్రస్ట్ కింద రూ. 688 కోట్ల నిధులను సమీకరించి తిరుపతిలో ఉండే ఆస్పత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యం అందిస్తామని చెబుతూ దేశవ్యాప్తంగా 5 వేల శ్రీవారి ఆలయాలను నిర్మిస్తున్నామని. అలాగే మసీదులు, చర్చిలు కట్టుకోవడానికి ప్రభుత్వ పరంగా నిధులు మంజూరు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

## వారం - వర్జ్యం

03-10-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, శుక్లపక్షం
ఏకాదశి సా.6.17
శ్రవణ ఉ.9.31
వర్జ్యం : మ.1.30-3.04
దు.ఉ.8.22-9.10, 2) 12.21-మ.1.09
శుభసమయం:ఉ.5.30-6.15,సా.6.30-7.15
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** చర్మసంబంధిత బాధలు కలుగకుండా జాగ్రత్తలు పాటించండి.

**వృషభం:** ఇబ్బందులలో పడిన మీ ఆత్మీయవర్గానికి రహస్యంగా సహాయపడతారు.

**మిథునం:** సోదర వర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న వివాదాలకు తెరపడుతుంది.

**కర్కాటకం :** జీవివాశయాన్ని ఏ విధంగానయినా సరే సాధించాలని దృఢ నిర్ణయానికి వస్తారు.

**సింహం:** అందుకుగాను మీ పరోక్షంలో జరుగుతున్న అన్ని పనులను కూడా గమనిస్తూ కఠినంగా ప్రవరిస్తారు.

**కన్య :** ఉపయోగపడని వ్యక్తులనుకున్న వారే కార్యవిజయాలకు కారణం అవుతారు.

**తుల :** మొండి వ్యవహారాలను కాలానికి వదిలివేస్తారు. వాహన సౌఖ్యం.

**వృశ్చికం:**చికాకు కలిగించే కుటుంబ పరిస్థితులకు దూరంగా పారి పోకుండా బాధ్యతలు నెరవేరుస్తారు.

**ధనుస్సు:** అప్పు చేయక పోవటమే నిజమైన పొదుపని గుర్తిస్తారు.

**మకరం:** పెండింగ్ కేసులు పరిష్కార బాటలో ఉంటాయి.

**కుంభం:** ఎదుటి వారి సంభాషణల లోని నిజానిజాలను గుర్తెరిగి తదనుగుణంగా నడుచుకుంటారు.

**మీనం :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## వారం - వర్జ్యం

02-10-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, శుక్లపక్షం
దశమి రా.7.05
ఉత్తరాషాఢ ఉ.9.10
వర్జ్యం : మ.1.14-మ.2.51
దు.ఉ.9.58-ఉ.10.46 2)మ.2.45-మ.3.33
శుభసమయం: ఉ.7.30-8.30,సా.6.45-7.30
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** ప్రముఖులను కలుసుకొని ముఖ్య విషయాలపై చర్చిస్తారు.

**వృషభం:** ఆస్తి వివాదాలు పరిష్కారమై లబ్ధి పొందుతారు. ఋణాలు తీరుస్తారు.

**మిథునం:**ఎంతటి కార్యాన్ని అయినా దీక్ష, పట్టుదలతో సాధిస్తారు.

**కర్కాటకం :** జీవిత భాగస్వామి సలహాలు స్వీకరిస్తారు. నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

**సింహం:** వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకోండి. వస్తులాభం.

**కన్య :** నూతన వ్యక్తులతో పరిచయాలు మిత్రత్వానికి దారి తీస్తాయి.

**తుల :**సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. ఇంటా బయటా అనుకూలం.

**వృశ్చికం:** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**ధనుస్సు:** సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మకరం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**కుంభం:**రాజకీయ, కళారంగాల వారికి విదేశీ పర్యటనలు వుంటాయి.

**మీనం :** భాగస్వామ్య వ్యాపారాలు మినహా పూర్తి వ్యాపారాలు లాభాల బాటలో ఉంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



లోక్‌సభ మాజీ స్పీకర్ జిఎంసి బాలయోగి జయంతి సందర్భంగా న్యూఢిల్లీలో నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

# సిఎం చంద్రబాబు దసరా శుభాకాంక్షలు

**విజయవాడ,అక్టోబరు1.ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు ప్రజలకు ఎపి సిఎం చంద్రబాబు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.ఎక్స్ సామాజిక మాధ్యమం వేదికగా ఆయన చేసిన పోస్టులో ఇలా వ్యాఖ్యానించారు."సకల చరాచర జీవరాసులను సంరక్షించే శక్తి స్వరూపిణి అయిన కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులు అందరికీ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. శక్తి ఆరాధనకు ప్రాధాన్యతనిచ్చే ఈ నవరాత్రి సందర్భంగా అమ్మవారి దివ్య మంగళ రూపాన్ని తొమ్మిది అవతారాల్లో దర్శించుకున్నాం. రాక్షస సంహారంతో లోకానికి శాంతి సౌభాగ్యాలు తెచ్చిన ఆ తల్లి చల్లని చూపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై ఇదే విధంగా కొనసాగాలి. సంక్షేమం, అభివృద్ధితో ఈ మహాయజ్ఞాన్ని కొనసాగించే నైతిక బలాన్ని అందివ్వాలి. అనునిత్యం పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లు, పేదల సేవలో పెన్షన్లు, మహిళామతల్లులకు ఆసరాగా నిలిచే 'దీపం', ఉచిత బస్సు ప్రయాణ పథకం 'స్త్రీశక్తి', బిడ్డలను విద్యావంతుల్ని చేసే 'తల్లికి వందనం' రైతుకు అండగా నిలిచే 'అన్నదాత సుఖీభవ', పేదల చేయిపట్టి అభివృద్ధి వైపు నడిపే 'పీ4' విధానం, పారిశ్రామిక ప్రగతితో ఈ దసరా పండుగ ఇంటింటా వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ... మరొక్క మారు అందరికీ విజయదశమి శుభాకాంక్షలు.

# బలపడిన వాయుగుండం

>> ప్రభావం చూపవచ్చని వాతావరణ శాఖ భావిస్తోంది. ప్రస్తుతం బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్ప పీడనం వేగంగా బలపడుతోందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ వాయుగుండం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ రేపు తెల్లవారుజామునాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఆ తర్వాత కూడా ఇదే దిశలో ప్రయాణించి, 3 వ తేదీన దక్షిణ ఒడిశా నుండి ఉత్తర కోస్తాంధ్ర మధ్య తీరాన్ని దాటవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈవాయుగుండం ప్రభావంతో గురు, శుక్రవారాల్లో తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో భారీనుంచి అతి భారీవర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెప్పారు. రాగల మూడు రోజుల పాటు తీరం వెంబడి గంటకు 30 కిలోమీటర్లకు పైగా వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని సూచించారు.

**నిలకడగా ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణ వరద ఉధృతి**

ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణ వరద ఉధృతి నిలకడగా ఉంది. ప్రస్తుతం ఆరు లక్షల క్యూసెక్కులకన్నా తక్కువ నీరు ఇక్కడ చేరుతుంది.69 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.నదీ తీరంలోని ఇళ్ళలోకి చేరిన నీరు తగ్గుముఖం పట్టింది. ఆ ప్రాంత ప్రజలు ఇంకా పునరావాస కేంద్రాల్లోనే ఉన్నారు.వారికి అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.

# సిఎం విదేశ పర్యటనకు ముహూర్తం ఖరారు!

**విజయవాడ,అక్టోబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం నారా చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనకు ముహూర్తం ఖరారు అయినట్లు సమాచారం. ఈ సమాచారాన్ని అనుసరించి అక్టోబరు 22 నుంచి 24వ తేదీ వరకు దుబాయ్, అబుదాబి, యూఎఇలలో సిఎం చంద్రబాబు పర్యటించనున్నారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నం వేదికగా పార్టనర్ షిప్ సమ్మిట్ 2025 జరగనుంది. ఈ సమ్మిట్‌కు విదేశీ పెట్టుబడుదారులను ఆహ్వానించేందుకు ఆయా దేశాల్లో సిఎం చంద్రబాబు పర్యటించనున్నారు. రియల్ ఎస్టేట్స్, భవన నిర్మాణం, లాజిస్టిక్స్ తదితర రంగాల్లో పెట్టుబడులను సీఎం చంద్రబాబు ఆహ్వానించనున్నారు. అలాగే రవాణా, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్నోవేషన్స్ రంగాల్లో సైతం పెట్టుబడిదారులకు ఆయన స్వాగతం పలకనున్నారు. ఈ విదేశీ పర్యటనకు సిఎం చంద్రబాబు వెంట మంత్రులు టిజి భరత్, బిసి జనార్దన్ రెడ్డిలతోపాటు పరిశ్రమలు, పెట్టుబడులు, ఎపిఐఐసి విభాగాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు వెళ్లనున్నారు. సిఎం చంద్రబాబు చేస్తున్న ఈ విదేశీ పర్యటనకు జిఎడి పొలిటికల్ సెక్రటరీ ముకేష్‌కుమార్ మీనా బుధవారం అనుమతులుఇస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# దళితులపై దాడులు ఎపి లోనే ఎక్కువ

## దేశవ్యాప్తంగా14 శాతం పెరిగిన వరకట్న కేసులు

## ఎన్‌సిఆర్‌బి-2023 వార్షిక నివేదికలో వెల్లడి

**విజయవాడ,అక్టోబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** దళితులపై జరిగిన నేరాలు,అకృత్యాల్లో ఆంధ్రప్రదేశ్‌ను దక్షిణ భారతదేశంలో ముందంజన నిలిచిందని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) తాజాగా విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఎన్‌సీఆర్‌బీ-2023 వార్షిక నివేదికలో ఈ విషయాన్ని వివరించింది. 2023లో కర్ణాటకలో (1923),తెలంగాణ (1709),తమిళనాడు(1921),కేరళ (1,128) నేరాలు జరగ్గా...ఆ రాష్ట్రాల్ని మించి ఏపీలో (2,027) దళితులపై దారుణ ఘటనలు చోటుచేసుకున్నాయి. వారానికి సగటున ముగ్గురు దళిత మహిళలు అత్యాచారానికి గురయ్యారు. ప్రతి నెలా ముగ్గురు దళితులు హత్యకు గురికాగా,నలుగురు హత్యాయత్నం బారిన పడ్డారు. వారానికి 11 మంది దాడులకు భాధితులయ్యారు. దళితులపై సగటున రోజుకు 5-6 అకృత్యాలు జరిగాయి. మనకంటే పెద్ద రాష్ట్రాలైన కర్ణాటక,తమిళనాడుతో పోలిస్తే ఎపిలోనే దళితులపై ఎక్కువ అఘాయిత్యాలు చోటు చేసుకున్నాయి. జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) 2023కు సంబంధించిన వార్షిక నేర నివేదికను మంగళవారం విడుదల చేసింది. ఆ వివరాలను విశ్లేషిస్తే వైకాపా హయాంలో రాష్ట్రం లోని దళితుల భద్రత ఎంత ప్రశ్నార్థకంగా మారింతో స్పష్టమవుతోంది. దళితులపై నేరాల్లో ఏపీ దేశంలో ఏడో స్థానంలో ఉంది. 2023లో దేశవ్యాప్తంగా దళితులపై 57,789 నేరాలు జరగ్గా...వాటిల్లో 2027 (3.50 శాతం)ఏపీ లోనే జరిగాయి.అంతకుముందు సంవత్సరాల కంటే.. 2023లో దేశవ్యాప్తంగా వరకట్న కేసులు 14 శాతం పెరిగాయని. 2023లో దేశవ్యాప్తంగా 15 వేల వరకట్న కేసులు నమోదయ్యాయి. వరకట్న వేధింపులకు 6,100 మంది మహిళలు బలయ్యారు అని ఎన్‌సిఆర్‌బి నివేదిక తెలిపింది. 2023లో వరకట్న నిషేధ చట్టం కింద 15,489 కేసులు నమోదయ్యాయని ఎన్‌సిఆర్‌బి క్రైమ్ ఇన్ ఇండియా 2023 నివేదిక పేర్కొంది. 2022లో 13,479, 2021లో 13,568 ఈ చట్టం కింద కేసులు నమోదయ్యాయి. 2021 - 2022 కంటే 2023లో 14 శాతం వరకట్న కేసులు పెరిగాయని ఎన్‌సిఆర్‌బి నివేదిక స్పష్టం చేసింది. రాష్ట్రాల వారీగా చూస్తే.. వరకట్నపు కేసుల్లో ఉత్తర ప్రదేశ్‌నే టాప్‌ప్లేస్‌లో ఉంది. ఆ రాష్ట్రంలో వరకట్న నిషేధ చట్టం కింద 7,151 కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత బీహార్ 3,665, కర్ణాటక 2,322ల కేసులతో వరుస స్థానాల్లో నిలిచాయి. పశ్చిమ బెంగాల్, గోవా, అరుణాచల్‌ప్రదేశ్, లడక్, సిక్కిం సహా 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో వరకట్న కేసులు నమోదవ్వకపోవడం గమనార్హం. వరకట్న వేధింపుల వల్ల 2023లో మొత్తం 6,156 మంది మహిళలు మృతి చెందారు. ఈ మరణాల్లో కూడా ఉత్తరప్రదేశ్‌నే మొదటిస్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో వరకట్న మరణాలు 2,122 నమోదయ్యాయి. బీహార్ 1,143. 2023లో దేశవ్యాప్తంగా 833 హత్య కేసుల్లో వరకట్నమే ప్రధానకారణంగా నమోదైనట్లు ఎన్‌సిఆర్‌బి నివేదిక తెలిపింది. ఇక వరకట్న నిషేధ చట్టం కింద 2023లో 83,327 కేసులు కోర్టు ముందు విచారణకు వచ్చాయి. వీటిల్లో 69,434 కేసులు అంతకుముందు సంవత్సరాల కంటే.. వేగవంతంగా కోర్టు విచారణకు వచ్చాయి. ఈ చట్టం కింద 2023లో 27,154 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో 22,316 మంది పురుషులు, 4,838 మహిళలు ఉన్నారని ఎన్‌సిఆర్‌బి నివేదిక వెల్లడించింది.

# నేను 'టారిఫ్'లను ప్రేమిస్తా

## నాకెంతో ఇష్టమైన మాట అదే: ట్రంప్

**వాషింగ్టన్, అక్టోబరు 1:** 'ట్యారిఫ్' అన్న పదం తనకు ఎంతో ఇష్టమైన పదమని, ఈ ట్యారిఫ్‌లతోనే అమెరికాను మళ్లీ సుసంపన్న దేశంగా మారుస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికా ఫస్ట్ వాణిజ్య అజెండాల్లో దిగుమతులపై విధిస్తున్న భారీ సుంకాలతో అమెరికాను మళ్లీ గ్రేట్ అగైన్‌గా మారుస్తామని, లక్షకోట్ల డాలర్ల ఎకానమీని వృద్ధిచేస్తామని ట్రంప్ అన్నారు. ట్యారిఫ్‌లవల్లనే అమెరికా ఖజానాకు ఎంతో న్యాయం జరుగుతున్నదని, దశాబ్దాలపాటు అమెరికా ఇస్తున్న ప్రయోజనాలు ఇతర దేశాలు తరలించుకుపోతున్నాయన్నారు. 'ట్యారిఫ్‌లను ప్రేమిస్తా. ట్యారిఫ్ అనేది ఎంతో అంతమైన పదం' అని చెప్పిన ట్రంప్ అమెరికాను సంపన్నదేశంగా తీర్చిదిద్దేందుకు ఇదే సరైన పదం అన్నారు. సుంకాలద్వారా లక్షలకోట్ల డాలర్లు తీసుకురాగలిగామని ఈ సుంకాలు వాణిజ్య ఒప్పందాలు పూర్తయితే అమెరికా ముందెన్నడూ లేని విధంగా సుసంపన్న దేశంగా మారుతుందన్నారు. రాబడులు అనూహ్యంగాపెరుగుతున్నాయన్నారు. ఇతర దేశాలు ఏళ్లతరబడి మనల్ని పిండుకున్నాయని అయినా కూడా మనం ఇపుడు ఆ దేశాలను సహేతుకంగా చూస్తున్నామన్నారు.

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
WWW.VAARTHA.COM
epaper.vaartha.com
కడప
fb.com/vaartha Digital



## శుభాకాంక్షలు

విజయదశమి పర్వదినం సందర్భంగా మా పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు.

-డా. గిరీష్ కుమార్ సంఘీ
'వార్త' చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్

**సెలవు** పండుగ సందర్భంగా గురువారం 'వార్త కార్యాలయానికి సెలవు. శుక్రవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం 4వ తేదీ శనివారం

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-10-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 242 పేజీలు: 10+4 వెల: 6.50

# కరెంటు ఛార్జీలు పెంచం

## తగ్గించే దిశగా చర్యలు తీసుకొంటున్నాం

### నవంబరు 4న 'ఆటో డ్రైవర్ సేవ పథకం' ఆరంభం

### ప్రపంచస్థాయి కంపెనీలకు కేంద్రంగా విశాఖ

### 2వేల కోట్లతో ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులు

### విజయనగరం జిల్లా దత్తి 'ప్రజావేదిక'లో సిఎం చంద్రబాబు



బుధవారం విజయనగరం జిల్లా దత్తి ప్రజావేదికలో లబ్దిదారులతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**దత్తిరాజేరు (విజయనగరం జిల్లా ) అక్టోబరు 1 ప్రభాతవార్త :** ఒకటో తేదీన పింఛన్ల పంపిణీతో గ్రామాలన్నీ కళకళలాడుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పండుగను రాష్ట్రంలో అమలు చేస్తున్నామని తెలిపారు. పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన విజయ నగరంజిల్లా గజపతి నియోజకవర్గం దత్తి గ్రామంలో పర్యటించారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి స్వయంగా పింఛన్లు అందించారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న పొంతూరు అప్పలరాజుకు, ఆయన తల్లికి పింఛను అందజేశారు. అనంతరం ప్రభుత్వ పథకాల అమలు తీరుపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. ఒకప్పుడు పండుగ చేసుకోవాలన్నా ఇబ్బందిగా ఉండేదని, ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక ప్రజలకు ప్రతి నెలా పండుగ వస్తోందని సిఎం అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత నేటితో కలిపి 16 నెలల్లో రూ.48,019 కోట్లు పింఛన్లపై ఖర్చు చేసిన ఏకైక ప్రభుత్వం కూటమి దేనని ఆయనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 50,765 మందికి రూ.2,745 కోట్లు పింఛన్ల కింద పంపిణీ చేస్తున్నామని, వృద్ధాప్య పింఛనుదారు చనిపోతే అతని భార్యకు వెంటనే వితంతు పింఛన్ మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెలలో కొత్తగా 10,578 మందికి రూ.4.23 కోట్లు వితంతు పింఛన్లు ఇస్తున్నామని, 2 నెలలు పెన్షన్ తీసుకోని 1,34,023 మందికి రూ.108 కోట్లు, 3 నెలలుగా పింఛన్లు తీసుకోని 11,545 మందికి రూ.14 కోట్లు విడుదల చేశామని ముఖ్యమంత్రి తెలిపారు.

గత ప్రభుత్వంలో ఒకటి రెండు నెలలు పింఛను తీసుకోకపోతే కట్ చేసేవాళ్లని, ప్రజా ప్రభుత్వంలో పేదలకు న్యాయం చేయాలనే ఏకైక ధ్యేయంతో రెండు నెలలు పింఛను తీసుకోకపోయినా మూడో నెల ఇస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. ఒక్క విజయనగరం జిల్లాలోనే ప్రతీ నెలా 2,75,82 మందికి రూ.117 కోట్లు పింఛన్లు రూపంలో ఇస్తున్నామని, గజపతినగరం నియోజకవర్గంలో 39,641 మందికి రూ.17 కోట్లు అందిస్తున్నామని, దత్తి గ్రామంలో 706 మందికి నెలకు రూ.29 లక్షలు పింఛన్ల కోసం ఖర్చు చేస్తున్నామని సిఎం చంద్రబాబు వివరించారు. పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రతి నెలా ఒక జిల్లాకు వచ్చి స్వయంగా పింఛను పంపిణీ చేస్తున్నానని, ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రం కూడా పెన్షన్ల కోసం ఏడాదికి ఖర్చు చేస్తుంది కేవలం రూ.5,160 కోట్లుమాత్రమేనని చెబుతూ >>2



# కరవు ప్రాంతాలకు గోదావరి జలాలు

### రూ. 58 వేల కోట్లతో పోలవరం-సోమశిల అనుసంధానం

### మూసీ-మున్నేరు నదుల మధ్య ఆయకట్టుకూ నీరందే అవకాశం

**విజయవాడ,అక్టోబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం - సోమశిల అనుసంధానం చేసే ప్రతిపాదనను లోతుగా అధ్యయనం ఎపి ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం దాదాపు 58 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. దీని ద్వారా మూసీ, మున్నేరు నదుల మధ్య ఆయకట్టుకూ నీళ్లు అందే అవకాశం ఉంటుందని ఎపి జలవనరుల మంత్రిత్వశాఖ అంచనా వేస్తోంది. సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఉన్నతాధికారులు,సాగునీటి ప్రాజెక్టు నిపుణులతో మంతనాలు చర్చలు జరుపుతున్నారు.

గోదావరి వరద జలాలను కరవు ప్రాంతాలకు, రాయలసీమకు మళ్లించే క్రమంలో అనేక ప్రత్యామ్నాయాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పోలవరం బనకచర్ల అనుసంధానంపై అనేక సమావేశాలు, చర్చోప చర్చలు జరిపిన అనంతరం జలవనరులశాఖ తాజాగా ఈ ప్రతిపాదనకు కొత్త రూపు తీసుకువచ్చింది. అంచనా వ్యయం తగ్గించి, టన్నెళ్లు మినహాయించి నల్లమల సాగర్ జలాశయం ఆయకట్టు స్థిరీకరణకు నీళ్లు ఇవ్వడంతోపాటు సోమశిల జలాశయానికి ఈ నీళ్లు చేర్చేలా కొత్త ప్రతిపాదన రూపొందించింది. మూడు సెగ్మెంట్లలో ఈ పనులు చేపట్టేందుకు దాదాపు 58 వేలకోట్ల అంచనా వ్యయంగా లెక్కిస్తున్నారు. ఇందులో +15.50 మీటర్ల నుంచి +250 మీటర్ల వరకూ నీటిని ఎత్తిపోస్తే సరిపోతుంది. అంచనా వ్యయమూ తగ్గుతుంది. ఈప్రతిపాదన వల్ల 7లక్షలఎకరాల కొత్త ఆయకట్టు, 6 లక్షల >>2




# అమెరికాలో 'షట్ డౌన్'

● ఆర్థికవ్యవస్థ ప్రతిష్టంభన ●7.5 లక్షల ఉద్యోగుల జీతాలకు గండి ● అత్యవసర సేవలు మినహా అన్నీ బంద్

**వాషింగ్టన్, అక్టోబరు 1:** అమెరికాలో అధికార రిపబ్లికన్లు, ప్రతిపక్ష డెమొక్రాట్ల మధ్య రాజకీయ రగడతో ఆ దేశ ప్రభుత్వం అధికారికంగా షట్‌డౌన్‌లోకి ప్రవేశించింది. రిపబ్లికన్లు ప్రవేశపెట్టిన తాత్కాలిక నిధుల ప్యాకేజీ తాము ప్రతిపాదించిన డిమాండ్లకు అనుగుణంగా లేదని డెమొక్రాట్లు నిరాకరించడంతో నిధుల గడువు ముగిసిపోయి చివరికి ప్రభుత్వం స్తంభించింది. 2018, 2019 తర్వాత ఆరు సంవత్సరాల్లో ఇది మొదటి షట్‌డౌన్ కావడం గమనార్హం. ఈ షట్‌డౌన్ కారణంగా సుమారు 7.5 లక్షల మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులకు తాత్కాలికంగా జీతాలు ఆగిపోనున్నాయి. మిలిటరీ సహా అత్యవసర సేవలు అందించే ఉద్యోగులు వేతనాలు లేకుండానే పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసరం కాని సేవలు, నేషనల్ పార్కులు, ఫుడ్ ఇన్‌స్పెక్షన్లు వంటి సేవలు నిలిచిపోనున్నాయి. చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులను శాశ్వతంగా తొలగిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ప్రభుత్వ నిధులు ముగిసినా తాత్కాలిక నిధుల ప్యాకేజీకి ఆమోదం లభించక షట్‌డౌన్ ఏర్పడినపుడు చట్ట ప్రకారం ఫెడరల్ ఏజెన్సీలు తమ కార్యకలాపాలను నిలిపివేయాల్సి ఉంటుంది. అలాంటి సమయంలో ప్రభుత్వ సిబ్బందిని అత్యవసర ఉద్యోగులు, అత్యవసరం కాని ఉద్యోగులు అని రెండు వర్గాలుగా విభజిస్తారు. ప్రజల ప్రాణాలను, ఆస్తులను రక్షించే వ్యవస్థల్లో పనిచేసేవారైన సైనిక సిబ్బంది, మెడికల్ సిబ్బంది, సరిహద్దు రక్షణ, పోలీస్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, సోషల్ సెక్యూరిటీ చెక్కుల పంపిణీ వంటి సేవలు కొనసాగుతాయి. అయితే ఈ వ్యవస్థల్లో పనిచేసేవారు షట్‌డౌన్ సమయంలో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుంది.. కానీ షట్‌డౌన్ ముగిసేవరకు వారికి జీతం ఇవ్వరు. ఆతర్వాతే బకాయిలు చెల్లిస్తారు. ఇకఅత్యవసరం కాని ఉద్యో >>2

**జిఎస్టీ తగ్గింపు**

# ప్రజారోగ్యంలో వెయ్యి కోట్లు ఆదా

### ప్రజలకు రూ. 750 కోట్లు, ప్రభుత్వానికి రూ. 250 కోట్లు ఉపశమనం

### మధుమేహం ఇన్సులిన్ రూ. 454 నుంచి 422కు తగ్గుదల: మంత్రి సత్యకుమార్



**విజయవాడ,అక్టోబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** జిఎస్టీ పన్నుల తగ్గింపుతో రాష్ట్ర ఆరోగ్య రంగంలో సుమారు రూ.1,000 కోట్లు వరకు ఆదా కానుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు ప్రాణధార మందులపై తగ్గించిన పన్నుతో ప్రజలు నేరుగా కొనుగోలుచేసే మందులు రూ.716 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వంద్వారా జరిగే కొనుగోళ్లలో రూ.250 కోట్లు వరకు వ్యయం తగ్గుతుందని అంచనా వేస్తున్నట్లు వివరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన కొనుగోళ్ల ఆధారంగా ఇకపై సుమారు రూ.1,000 కోట్లు వరకు ప్రజారోగ్యంపై భారం తగ్గుతుందని అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదలచేశారు 'గత నెల 21వ తేదీ వరకు 12,5 చొప్పున మందులపై జిఎస్టీ ఉండేది 12 కేటగిరిలోనే 99 మందులు ఉన్నాయి. 12 శాతం పన్నును 5 శాతంకు కేంద్రం తగ్గించింది. దీనివల్ల ప్రస్తుత మందులపై 7 వరకు పన్ను తగ్గింది. క్యాన్సర్, ఇతర అరుదైన కేటగిరిలో ఉన్న 33 రకాల మందులపై 12 వరకు ఉన్న పన్నును కేంద్రం పూర్తిగా తొలగించింది. దీనివల్ల ప్రజారోగ్యానికి భారీ ఊరట లభించిందిఖి అని మంత్రి సత్య కుమార్ పేర్కొన్నారు.


**రాష్ట్రంలో 35,000 మందుల దుకాణాలు**

"రాష్ట్రంలో సుమారు 35 వేల వరకు మందుల దుకాణాలు, 5 వేల వరకు టోకు వర్తక సంస్థలు ఉన్నాయి. వీటి ద్వారా 2024 -25 ఆర్థిక సంవత్సరంలో 11,250 కోట్ల విలువైన మందులు, సర్జికల్స్ విక్రయాలు జరిగాయి. దీని ప్రకారం రూ.1,350 కోట్లు వరకు పన్నుల భారం ప్రజలపై పడినట్లు రాష్ట్ర ఔషధ నియంత్రణ పరిపాలనా విభాగం తెలిపింది. ఇకపై ప్రజలు నేరుగా మందుల కొనుగోలు చేయడంపై పడే జిఎస్టీ భారంలో రూ.703 కోట్ల వరకు ఆర్థిక భారం తగ్గింది. ఇవి కాకుండా క్యాన్సర్, ఇతర అరుదైన మందుల కొనుగోళ్లు రాష్ట్రంలో రూ.112 కోట్ల వరకు ఉంటుందని అంచనా వీటిపై 12 పన్ను పూర్తిగా తొలగించినందున సుమారు రూ.13 కోట్ల వరకు బాధితులకు ఉపశమనం లభిస్తుందని అంచనా. సదరు సంస్థలు ఖరారుచేసే ఎంఆర్పీల్లోనే జిఎస్టీ ఇమిడి ఉంది. తాజాగా 12 జిఎస్టీని 5 కు తగ్గించినందున ఎంఆర్పీ ధర 6 నుంచి 7 వరకు తగ్గింది. ఈ కేటగిరిలోనే 99 మందులు ఉన్నాయి" అని మంత్రి సత్యకుమార్ వివరించారు. "పారాసిటమాల్ ఒక షీట్ ధర గత నెల 21వ తేదీ వరకు 12 జిఎస్టీతో కలిపి రూ.28గా ఉంది. తగ్గిన కొత్త ధర రూ.26.04. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉపయోగించే మెటఫార్మిన్ 500 ఎంజీ (గ్లైసిఫేజ్) రూ.41.65 నుంచి రూ.38.73 (రూ.2.92 పైసలు),రక్తపోటు అదుపునకు ఉపయోగించే టెల్మిసార్టన్ 40 ఎంజీ రూ.113.7 నుంచి రూ.105.74 (రూ.7.96 పైసలు) కు తగ్గింది. అగ్యుమెంటిన్ 625ఎంజీ (యాంటీబయాటిక్) రూ.204.86 నుంచి రూ.190.51 (రూ.14.35)కు తగ్గింది. పాంటాప్ 40 లాంటి గ్యాస్ట్రిక్ ట్యాబెలెటు >>2

# పర్యాటక శాఖకు గ్లోబల్ టూరిజం అవార్డు

### ఢిల్లీలో అందుకున్న నిషితా గోయల్

**విజయవాడ,అక్టోబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశంలోని అత్యంత ఆశాజనకమైన పర్యాటక గమ్యస్థానాలలో ఒకటిగా మార్చేందుకు చేసిన అద్భుతమైన కార్యక్రమాలతో ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖను గ్లోబల్ టూరిజం అవార్డు 2025 వరించింది. ఈ మేరకు మంగళవారం ద్వారక ఢిల్లీలోని యశోభూమిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎపి ప్రభుత్వ పర్యాటక శాఖ తరపున టూరిజం కన్సల్టెంట్ నిషితా గోయల్ ఈ అవార్డును అందుకున్నారు. నూతన పర్యాటక విధానాన్ని రూపొందించడంలో దార్శనిక నాయకత్వం, గమ్యస్థాన అభివృద్ధిలో ఇన్వెస్టర్లకు అందించిన మార్గదర్శకత్వం, పర్యావరణ అనుకూలమైన కొత్త రాజ >>2




# బలపడిన వాయుగుండం

## రాష్ట్రం అంతటా భారీ వర్షాలకు అవకాశం



**విజయవాడ,అక్టోబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడిందని ఎపి విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ బుధవారం వెల్లడించారు. ఇది ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని చెప్పారు. ఇది ప్రస్తుతానికి విశాఖపట్నానికి 400 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కి 420 కిలోమీటర్లు, పారాదీప్‌కి 500 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైందని స్పష్టం చేశారు. వచ్చే శుక్రవారం తెల్లవారుజామున అంటే.. అక్టోబర్ 3వ తేదీన ఇది గోపాల్‌పూర్ పారాదీప్ మధ్య తీరందాటే అవకాశం ఉందని వివరించారు. దీని ప్రభావంతో గురువారం ఉత్తరాంధ్రలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. అలాగే దక్షిణ కోస్తాలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. రాయలసీమలో సైతం విస్తారంగా వర్షాలు పడతాయని వివరించారు. తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్నారు. సముద్రంలో వేటకు వెళ్లొద్దంటూ ఈ సందర్భంగా మత్స్యకారులను హెచ్చరించారు.

కోస్తాలో బుధవారం విశాఖ, విజయనగరం, అనకాపల్లి, తూర్పుగోదావరి, కోనసీమ, వెస్ట్ గోదావరి, కాకినాడ తదితర జిల్లాల్లో ఒకటి రెండు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఇక గురువారం ఉత్తర కోస్తాజిల్లాలో ఒకటి రెండుచోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని.. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగాఉండాలని ప్రఖర్ జైన్ సూచిం చారు. ఇదే సందర్భంలో వర్షాలు కేవలం కొన్నిజిల్లాలవరకు మాత్రమేకాక, మొత్తం రాష్ట్రంలో సాధారణంగాగల స్థాయి పైగా >>2

# కేంద్ర ఉద్యోగులకు 3% డిఏ పెంపు

### 49.2 లక్షల మంది ఉద్యోగులు, 68.7 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి

### 3 నెలల డిఏ బకాయిలు అక్టోబరు నెల వేతనంతో చెల్లింపు

### కేంద్ర కేబినెట్ నిర్ణయం: సమాచార మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 1:** దసరా, దీపావళి పండుగల వేళ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కరవు భత్యం (డిఎ), డియర్‌నెస్ రిలీఫ్ (డిఆర్)లను 3 శాతం పెంచుతూ కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన బుధవారంనాడు జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. దీంతో శాలరీ బేసిక్ పే, పెన్షన్‌లపై చెల్లిస్తున్న డిఎ 55 శాతం నుంచి 58 శాతానికి పెరిగింది. ఈ నిర్ణయం 2025 జులై 1 నుంచే అమల్లోకి వస్తుందని తెలిపారు. జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించిన డిఎ బకాయిలను అక్టోబరు నెల వేతనంతో, దీపావళి కంటే ముందే అందిస్తామని తెలిపింది. ఈ నిర్ణయంతో దేశంలోని 49.2 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68.7 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి చేకూరుతుందని అశ్వినీ >>2

## కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాలు: కేంద్రం 8లో

వార్త

> సంతోషాన్ని ఇచ్చేది సంపద, లేదా వైభవం కాదు, ప్రశాంతమైన మనసు, వృత్తి మాత్రమే.
>
> -థామస్ జఫర్సన్

# గాంధేయవాదుల బ్రాందీయం!

'కరంచంద్ నేడుండినా ఈ నిషా బంద్ కాకుండేనా' అన్నాడు ఒక కవి. రాజకీయాలకు అతీతంగా మహాత్మా గాంధీని అందరు గౌరవించేవారే, ఆదరించేవారే, ఆరాధించేవారే. ఆయన జయంతులు, వర్ధంతులు క్రమం తప్పకుండా చేసుకుంటూనే ఉన్నాం. ఆయన ఇచ్చిన సందేశాలను పదేపదే వల్లిస్తూనే ఉన్నా మహాత్ముడు జాతికి అందించిన అమృత సందేశం మద్య నిషేధాన్ని మాత్రం పట్టించుకోకపోవడం అత్యంత దురదృష్టకరం. ఆదాయం ఆశలో పడి మంచి, చెడులు పట్టించుకోవడం లేదు. మానవ జాతిని పట్టిపీడిస్తున్న ఈ మద్యం రక్కసిని పారద్రోలే విషయంలో ఈ పార్టీ, ఆపార్టీ అనికాదు అందరూ ఒక తానులోని ముక్క లేనని రుజువు చేసుకుంటున్నారు. మద్యనిషేధం అనేది అధికార పార్టీలో ఉన్నవారిని ఇబ్బంది పెట్టేందుకు ఒక నినాదంగా ఉపయోగించుకుంటున్నారు. ఇలా మద్య నిషేధంపై ప్రజలను కూడగట్టి ఉద్యమం చేసినవారుఅధికారంలోకి రాగానే ఏరుదాటాక తెప్ప తగలేసినట్లుగా వ్యవహరిస్తున్నారు. మద్యం అనేది ప్రభుత్వాలకు ప్రధాన ఆదాయాల్లో ఒకటిగా మారిందనేది అందరికి తెలిసిందే. ఈ పరిస్థితుల్లో సంపూర్ణ మద్యనిషేధం విధించడం అనేది సాధ్యంకాదని కొందరు ఆర్థిక నిపుణుల వాదన. అది నిజమే కావొచ్చు. కానీ ఆదాయం కోసం ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టడం ఎంతవరకు సమంజసమోవిజ్ఞతతో ఆలోచించాలి. మద్యం వల్ల జరుగుతున్న కష్టనష్టాలను పరిశీలిస్తూ ముఖ్యంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న విషయాలను మనసు పెట్టి చూస్తే ఎంత హృదయవిదారక పరిస్థితుల్లో కొట్టుమిట్లాడుతున్నారో తెలుస్తుంది. అధిక శాతం నేరాలు ఈ మద్యం మత్తులోనే జరుగుతున్నాయి. మొన్న ఈమధ్య తెలంగాణలో రెండేళ్లు నిండని పసికందును మద్యమత్తులో సాక్షాత్తు కన్నతండ్రే నేలకేసి కొట్టి చంపాడు. ఇక గృహహింసకు అంతేలేకుండా పోతున్నది. ఆ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో మద్యం మత్తులో భర్త పెట్టే బాధలు భరించలేక ఆ ఇల్లాలు పుట్టింటికి వెళ్లిపోయింది. తాగుడు మానేస్తే తప్పతిరిగి రాలేనని స్పష్టం చేసింది. ఆ కోపంలో మద్యంమైకంలో భార్యపై కసితీర్చుకోవడానికి సొంత కొడుకులను ఇద్దరిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి గొంతుకోసి మట్టుపెట్టాడు ఆ కిరాతకుడు. హైదరాబాద్‌లో మరొక కిరాతకుడు మద్యం అలవాటును విడిచి పెట్టమని వేడుకున్నందుకు భార్యను చంపి మూలనపడి ఉన్న కారుల్లో మూటకట్టి పడేశాడు. ఇలా ఒకటి కాదు, రెండు కాదు నిత్యం మద్యంమత్తులో ఈ ఘోరాలు జరుగుతూనే ఉన్నాయి. వేలాది కుటుంబాలు చిధిలమైపోతున్నాయి. మహిళలపై అత్యాచారాలకు, హత్యలకు అంతేలేకుండాపోతున్నది. ఇందులో నిందితుడు తొంభైశాతం పైగా మత్తులో ఉన్నవారే. అంతెందుకు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దేశరాజధాని ఢిల్లీలో జరిగిన నిర్భయ కేసులో దోషులందరూ పూర్తిగా మత్తులో ఉన్నవారే. ఇక చాలా రోడ్డుప్రమాదాలకు మూల కారణం ఈ మద్యం మత్తేనని చెప్పొచ్చు. రెండు తెలుగు రాష్ట్రాలు రోడ్డుప్రమాదాల్లో అగ్రస్థానంలో ఉన్నాయి. సరాసరి యేటా పదిహేనువేల మందికిపైగా మరణిస్తుంటే మరో యాభై, అరవై వేల మంది క్షతగాత్రులవుతున్నారు. ఇలా క్షతగాత్రులైన వారిలో కొందరు శాశ్వత వికలాంగులుగా మారి కుటుంబానికి భారమై మంచానికే పరిమితమై జీవచ్ఛవంలా జీవనం సాగిస్తున్నారు. మద్యంవల్ల మామూలు వ్యాధులే కాదు, ఊపిరితిత్తులు, కేన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులతో లక్షలాది మంది అల్లాడుతున్నారు. మద్యం అనేది ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చింది కాదు. మద్యానికి బానిసలై, అనారోగ్యంపాలై, కుటుంబాలకు, కుటుంబాలే రోడ్డున పడుతుండడంతో ఆనాడే ఆవేదనచెందిన మహాత్ముడు స్వతంత్రభారతావని నుంచి మద్యాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ కలలకు అనుగుణంగా స్వాతంత్ర్యంసిద్ధించిన తర్వాత 1947అక్టోబరు 1తేదీ నుంచి అప్పటి మద్రాసు ప్రభుత్వం మద్య నిషేధాన్ని విధించింది. అందులో భాగంగా ఆంధ్ర, రాయలసీమప్రాంతాలు ఆనాడు దీనిని విజయవంతంగా అమలు చేశారు. మద్యపానం వల్ల జరిగే కష్టనష్టాలను ప్రజలకు వివరించి చెప్పడంలోనూ, మరొకపక్క అక్రమ మద్యం తయారుచేసే వారిపై ఉక్కుపాదం మోపడంలోనూ ఆనాటి ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవ హరించింది. ఎక్కడో రహస్యంగా మద్యం సేవించాలనుకున్నా, తాగి పదిమందిలోకి రావాలనుకున్నా భయపడేవారు. తాగుబోతులంటే ప్రజల్లో ఒక హేయభావం ఉండేది. వారిని సామాజికంగా బహిష్కరించే స్థాయికి ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ఆనాటిప్రభుత్వం కొంతమేరకు విజయం సాధించింది. తాగుబోతు యువకులకు పెండ్లిళ్లు కావడం కష్టతరంగా మారింది. మద్యం రక్కసి రాష్ట్రాన్ని వదిలిపెట్టని తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఆ తర్వాత రాజకీయ జోక్యం పెరగడంతో నిషేధాన్నిఅమలు చేయడం కష్టతరంగా మారింది. ఆదాయం భారీగా కోల్పోతున్నామనే వాదనలు లేవ నెత్తారు. 1969ప్రాంతంలో నిషేధానికి స్వస్తిపలికారు. ఆనాడేఆదాయం వందకోట్లకు చేరుకుంది. అప్పటినుండి పెరుగుతూ, పెరుగుతూ ఇప్పుడు రెండురాష్ట్రాల్లో డెబ్బైవేలకోట్లకుపైగా చేరుకున్నదని చెప్పొచ్చు. ఎన్నికల్లో కూడా ఇది కీలకమైపోయింది. నియోజకవర్గాల్లో ఎన్ని మంచి పనులు చేసినా, ఎంత డబ్బు వెదజల్లినా, మద్యం పంచకపోతే గెలుపుఅసాధ్యమనే పరిస్థితులు దాపురించాయి. మరొకపక్క మద్యం సేవించండి, ఆదాయాన్ని పెంచేందుకు సహకరించండిఅన్నట్టుగా ప్రభుత్వమే మద్యాన్ని ప్రోత్సహిస్తున్నది. ఇప్పటికైనా పాలకపెద్దలు ఆలోచించాలి. అప్పుడే మహాత్ముడిని మరచిపోలేదంటూ తామేంతో ఘనంగా నిర్వహిస్తున్న గాంధీ జయంతి, వర్ధంతులకు ఒక అర్థం ఉంటుంది.

> గడిచిపోయిన కష్టాలను జ్ఞప్తికి తెచ్చుకో. అనుభవిస్తున్న సుఖాల తీయదనం పెరుగుతుంది.
>
> 
>
> సిసి కోల్టన్

> సమస్యలను చేపట్టేవారి శక్తి సామర్థ్యాలపై వాటి పరిష్కారం ఆధారపడి ఉంటుంది.
>
> 
>
> స్వామి వివేకానంద


# నేటికీ గాంధీ సిద్ధాంతమే అనుసరణీయం

*గాంధీ సిద్ధాంతాలు ఈ రోజుకీ ప్రాముఖ్యత కోల్పోలేదు. ప్రజాస్వామ్యం పటిష్టం కావాలన్నా, ఆర్థిక సమానత్వం రావాలన్నా, రైతు, యువత, మహిళల సమస్యలకు పరిష్కారం కావాలన్నా, మత సామరస్యత కాపాడాలన్నా, పర్యావరణాన్ని రక్షించుకోవాలన్నా గాంధీమార్గం అవసరం. అందువల్ల గాంధీయిజం కేవలం గతపు జ్ఞాపకంకాదు భవిష్యత్తు భారతదేశానికే మార్గదర్శి. గాంధీజీకి ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు కాదు, ప్రజలే నిజమైన పాలకులు అన్నభావన. ఆయన దృష్టిలో రాజకీయాలు సత్యం, ధర్మం, సేవలతో నిండి ఉండాలనేవారు. భారత దేశం వైరుధ్యాల దేశం కానీ ఈ వైరుధ్యాలను సమతౌల్యం చేయగల మార్గమే గాంధీ సిద్ధాంతం. ఆయన కలగన్న దేశం అంటే హింస లేకుండా, అసమానత లేకుండా, లోభం లేకుండా, సత్యం, అహింస, నైతికత, సమానత్వం ఆధారంగా నిలిచే దేశం. కాబట్టి నేటి భారతం నుండి గాంధీ భారతం వైపు పయనించాలి, అదే గాంధీకి నిజమైన నివాళి.*



డా.ఎ. భాగ్యరాజ్

భారతదేశ చరిత్రలో మహాత్మా గాంధీ పేరు శాశ్వత కాంతి దీపంలా వెలుగుతోంది. ఆయన జీవితం, ఆలోచనలు, ఆచరణలో చూపిన నిబద్ధత కేవలం ఒక రాజకీయ నేతకే కాకుండా, ఒక నైతిక తత్వవేత్తకూ ప్రతీకగా నిలిచాయి. స్వాతంత్ర్య సమరంలో ఆయన ఉపయోగించిన అహింసా మార్గం, సత్యాగ్రహం ప్రపంచ చరిత్రలోనే ఒక విప్లవాత్మకమైన మార్గదర్శకం. కానీ నేటి భారతదేశాన్ని పరిశీలిస్తే, గాంధీ కలలుగన్న దేశం కంటే పూర్తి విరుద్ధమైన భారతం కనబడుతోంది. స్వాతంత్ర్యం కోసం గాంధీ కలగన్న సమాజం సమానత్వం, సత్యం, అహింస, స్వావలంబన, సుస్థిరత అనే విలువలపై నిలబడాలి. కాని నేటి భారత్ అసత్యం, హింస, అవినీతి, అసమానత, వినాశక వినియోగం అనే దిశలో ప్రయాణిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యదేశాలలో జాతీయవాదం, దేశీయవాదం, మతవాదం పేరుతో నిరంకుశత్వం కింద బలహీనపడుతున్నాయి. గాంధీ సత్యాగ్రహం స్వరాజ్య పౌరులకు శాంతియుత పౌర ప్రతిఘటన ద్వారా పాలకులను జవాబుదారీగా ఉంచాలని గుర్తు చేస్తాయి. అవినీతి, తప్పుడు సమాచారం ఉన్న యుగంలో నైతిక రాజకీయాలపై ఆయన మార్గం అనుసరణీయమైనది, ముఖ్యమైనది. గాంధీ సిద్ధాంతం భారత స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించింది. రైతుల సమస్యల పరిష్కారానికి చంపరన్ సత్యాగ్రహం (1917), హిందూ-ముస్లిం ఐక్యతకు ఖిలాఫత్ ఉద్యమం (1919), ప్రజలు బ్రిటిష్ పాలనతో సహకరించకుండాచేసిన సహాయనిరాకరణ ఉద్యమం (1920), దండయాత్ర ద్వారా బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా ఉప్పు సత్యాగ్రహం (1930) ఉద్యమం, 'భారతాన్ని విడిచి వెళ్లిపో' అన్న నినాదం ద్వారా క్విట్ ఇండియా ఉద్యమం (1942)ద్వారా స్వాతంత్ర్యానికి కారకుడు అయ్యాడు గాంధీ. పై ఉద్యమాలన్నింటిలో గాంధీ సిద్ధాంతం ప్రధాన ఆయుధం శాంతి, సత్యం, అహింస. ఆయన వల్లే ప్రపంచం భారతదేశాన్ని అహింసా విప్లవానికి నిలయంగా గుర్తించింది. గాంధీ పోరాటం భారతానికి మాత్రమే పరిమితం కాలేదు. ఆయన అహింసా సిద్ధాంతంఅమెరికాలో మార్టిన్ లూథర్ కింగ్, దక్షిణాఫ్రికాలో నెల్సన్‌మండేలా వంటి నాయకులకు ప్రేరణ అయింది. శాంతి, సత్యం, అహింస అనే ఆయుధాలు ప్రపంచానికీ మార్గదర్శక సూత్రాలుగా నిలిచాయి. గాంధీయిజంపై ప్రపంచ నాయకుల ఆలోచనలు మహాత్మా గాంధీ ఆలోచనలు భారతదేశానికే పరిమితం కాలేదు. మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేశాయి. చాలామంది ప్రపంచ నాయకులు గాంధీయిజాన్ని శాంతి, సత్యం, అహింస అనుసరించారు, కొనియాడారు. జాతి వివక్షకు వ్యతిరేకంగా చేసిన అహింసా పోరాటం గాంధీ సత్యాగ్రహం నుండి నేరుగా ప్రేరణ పొందానని ప్రకటించాడు. ఆయన చేసిన కవాతులు, ధర్నాలు, బహిష్కరణలు భారతదేశంలో గాంధీ ఉద్యమాలను ప్రతిధ్వనించాయి. 'గాంధీ హింసను తిరస్కరించాడు సత్యం, అహింస, ధైర్యం శాంతి అనే ఆయుధాలతో స్వేచ్ఛ కోసం పోరాడాడు. ఆయన తత్వశాస్త్రం నేటికీ మానవాళికి ఔచిత్యాన్ని కలిగి ఉంది. 'వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాటం గాంధీయిజం ఆలోచనల నుండి నైతిక బలాన్ని పొందిందని నెల్సన్ మండేలా (దక్షిణాఫ్రికా) ఉద్ఘాటించారు. గాంధీ స్వదేశీ, స్వావలంబనను కోరుకున్నారు. కానీ నేటి భారత్ గ్లోబలైజేషన్, కార్పొరేట్ ఆధిపత్యం వైపు వెళ్లింది. 2025 నాటికి ఒక శాతం ధనికులు దేశ సంపదలో 40 శాతం కంటే ఎక్కువ కలిగి ఉన్నారు. మరోవైపు కోట్ల మంది పేదరికపు రేఖ కింద ఉన్నారు. గాంధీ కుల వివక్ష తొలగించాలనుకున్నారు. కానీ నేటికీ కుల దాడులు,



నేడు మహాత్మా గాంధీ జయంతి

మత ఘర్షణలు, సామాజిక అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయి. మహిళలు ఇంకా భద్రత, సమాన హక్కులకోసం పోరాడుతున్నారు. గాంధీ నైతిక రాజకీయాలు కోరుకున్నారు, కానీ నేడు రాజకీయాలు డబ్బు, మతం, కులం ఆధారంగా నడుస్తున్నాయి. ఎన్నికల వ్యవస్థలో పారదర్శ కత తగ్గిపోతోంది. గాంధీకలగన్నసత్యాధారిత రాజకీయాలు వాస్తవానికిఅసత్యం, హింస, ద్వేషం ఆధారంగా మారాయి. గాంధీ సమాజంలో సత్యం, అహింసా సంస్కృతి కావాలని ఆశపడ్డారు. కానీ నేటి సంస్కృతి లోభం, వినాశక వినియోగం, హింసా సంస్కృతి వైపు మొగ్గు చూపుతోంది. గాంధీ సరళ జీవన విధానం ద్వారా పర్యావరణ సంరక్షణకు ప్రాధాన్యం ఇచ్చారు. కానీ నేటి భారత్ పారిశ్రామికీకరణ పేరుతో అడవులను నాశనం చేస్తోంది. కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు దేశ భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తున్నాయి. ఇజ్రాయిల్ తన భద్రత పేరిట రక్షణ యుద్ధాలు చేస్తోంది. కానీ నిరంతరం బాంబులు, గోడలు, ఆయుధాల దాడులతో శాంతిని కాదు, భయాన్ని మాత్రమే పెంచుతున్నాయి. పాలస్తీనా అణచివేతకు గురైన ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారు. వారిలో కొందరు తీవ్రవాదం మార్గం ఎంచుకోవడం వల్ల పరిస్థితులు చేయిదాటిపోతోంది. ఇజ్రాయిల్ పాలస్తీనా రెండూ హింస మార్గంలో నడుస్తున్నాయి. ఫలితం మరణాలు, విధ్వంసం, ద్వేషం. అంతర్జాతీయ సమాజంలో కొన్ని దేశాలు ఇజ్రాయిల్ కోసం మద్దతు ఇస్తుంటే, మరికొందరు పాలస్తీనా కోసం మాట్లాడుతున్నారు. కానీ గాంధీ దృష్టిలో ప్రపంచం ఏకపక్షతకు బదులు న్యాయం వైపు నిలబడాలి. మన దేశం కూడా ఇందులో గాంధీ సిద్ధాంతానికి తిలోదకాలిచ్చింది. గాంధీ చెప్పిన సత్యాగ్రహం అనేది అన్యాయాన్ని ఎదిరించే శాంతి విప్లవం. పాలస్తీనీయులు తమ హక్కులకోసం హింసాత్మక మార్గం కాకుండా సత్యాగ్రహాన్ని ఎంచుకుని వుండి వుంటే ప్రపంచ మద్దతుతో మరింత బలపడి వుండేది. గాంధీ మార్గం కేవలం ఒక స్మృతి కాదు, నేటి సమస్యలకు సమాధానం. మత, కుల ఘర్షణలకు శాంతి పరిష్కారం అహింస, అవినీతి, అసత్య రాజకీయాలపై ప్రజాస్వామ్య పోరాటానికి మార్గం సత్యాగ్రహం. గ్రామాభివృద్ధి, పేదరిక నిర్మూలనకు పునాది స్వావలంబన. దళితులు, మహిళలు, మైనార్టీల హక్కుల రక్షణ సమానత్వం, పర్యావరణ సంరక్షణకు మార్గదర్శకం సరళ జీవనం. ప్రస్తుత పరిస్థితిలోమన దేశంలో మతం ఆధారంగా విభజన పెరిగింది. రాజకీయాల్లో మతాన్ని ఆయుధంగా వాడుతున్నారు. స్వార్థ రాజకీయాల కోసం మత సామరస్యాన్ని కాపాడటానికి కంటే ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు ఎక్కువ జరుగుతోంది. ఇది గాంధీజీ ఆత్మకు అత్యంత విరుద్ధమైనది. గాంధీ భావజాలంలో మత సామరస్యత ప్రధాన స్థానం పొందింది. ప్రజాస్వామ్యంఎన్నికల సమయంలో మాత్రమే కనిపిస్తోంది. డబ్బు, మతం, కులం ఆధారంగా ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రజా ప్రతినిధులు అధికారం, లాభం కోసం పనిచేస్తున్నారు. కానీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కాదని అనిపిస్తోంది. ఎన్నికల సంఘం స్వతంత్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇది గాంధీ కలలుగన్న జనపాలనకు విరుద్ధం. ప్రస్తుత భారతంలో సామాజిక మాధ్యమాలలో బహిరంగా గాంధీని తక్కువ చేసి చూపించడం, మాట్లాడడం ఒక అలవాటుగా మారింది ఒక వర్గపు రాజకీయ నాయకులకి యువతకు. కానీ ఆయన మార్గమును అనుసరిస్తేనే కదా తెలిసేదానికి గాంధీ విశ్వసించిన అహింస ఒక బలహీనుల ఆయుధం కాదు అది శక్తివంతుల (ఆయుధం) శక్తని. ప్రస్తుత భారత దేశం గాంధీయిజం నుండి చాలాదూరం వెళ్ళిపోయింది. సత్యం బదులుఅబద్ధం, అహింస బదులు హింస, స్వదేశీ బదులు గ్లోబలైజేషన్, గ్రామ స్వరాజ్యం బదులు కార్పొరేట్ రాజ్యంగా మారిపోయింది. అయినా గాంధీ సిద్ధాంతాలు ఈ రోజుకీ ప్రాముఖ్యత కోల్పోలేదు. ప్రజాస్వామ్యం పటిష్టం కావాలన్నా, ఆర్థిక సమానత్వం రావాలన్నా, రైతు, యువత, మహిళల సమస్యలకు పరిష్కారం కావాలన్నా, మత సామరస్యత కాపాడాలన్నా, పర్యావరణాన్ని రక్షించుకోవాలన్నా గాంధీమార్గం అవసరం. అందువల్ల గాంధీయిజం కేవలం గతపు జ్ఞాపకంకాదు భవిష్యత్తు భారతదేశానికే మార్గదర్శి. గాంధీజీకి ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు కాదు, ప్రజలే నిజమైన పాలకులు అన్నభావన. ఆయన దృష్టిలో రాజకీయాలు సత్యం, ధర్మం, సేవలతో నిండి ఉండాలనేవారు. భారత దేశం వైరుధ్యాల దేశం కానీ ఈ వైరుధ్యాలను సమతౌల్యం చేయగల మార్గమే గాంధీసిద్ధాంతం. ఆయన కలగన్న దేశం అంటే హింస లేకుండా, అసమానత లేకుండా, లోభం లేకుండా, సత్యం, అహింస, నైతికత, సమాన త్వం ఆధారంగా నిలిచే దేశం. కాబట్టి నేటి భారతం నుండి గాంధీ భారతం వైపు పయనించాలి, అదే గాంధీకి నిజమైన నివాళి. అదే ప్రపంచ మానవాళికి శిరోధార్యం, ఆచరణీయం. •

# బాల్యమే.. కానీ సవాళ్లెన్నో!

పి.వి.ప్రసాద్

పిల్లలు దైవానికి వారసులని, తల్లిదండ్రులకు ఆశాజ్యోతులని, రేపటి సమాజానికి వారధులని అంటుంటారు. అయితే బాల్యావస్థ నేడు పలు సమస్యలు, సవాళ్లతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. చదువు సంధ్యలతో, ఆటపాటలతో ఆనందంగా సాగాల్సిన ఎంతోమంది బాలల జీవన పయనం నేడు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతోంది. ముఖ్యంగా బాలలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో బాలకార్మిక సమస్య ఒకటి. ఇది చాపకింద నీరులా వ్యాపిస్తూ చిన్నారుల పాలిట శాపంగా మారుతోంది. తల్లిదండ్రుల దుర్భర దారిద్ర్యం, ఆర్థిక అస్థిరత్వం, నిరాదరణవంటి కారణాలతో చాలా మంది బాలలు కార్మికులుగా మారుతున్నారు. పలకా బలపం పట్టి బడికివెళ్లి చదువుకోవాల్సిన ఎంతో మంది బాలలు వివిధ రంగాల్లో, వృత్తుల్లో బాల కార్మికులుగా శ్రమిస్తూ వారి అందమైన, ఆనందకరమైన బాల్యాన్ని కోల్పోతున్నారు. అలాగే బాలలు పలురకాల భౌతిక, లైంగిక పరమైన హింసలకు, అత్యాచారాలకు, అపహరణలకు గురౌతున్నారు. సమాజంలో బాలలకు కొన్ని హక్కులున్నాయి. వాటిని పరిరక్షించేందుకు జాతీయ బాలల హక్కులకమిషన్, బాలల రక్షణ చట్టాలు వంటివి ఉన్నాయి. అలాగే భారత రాజ్యాంగం ప్రకారం 6-14 సం.ల మధ్య వయసున్న పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యను అందించాల్సి ఉంటుంది. దీనికోసం 2009లో విద్యా హక్కు చట్టం కూడా తేబడింది. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు 1986లో బాల కార్మిక (నిషేధం, నియంత్రణ) చట్టం రూపొందించబడింది. అయితే చట్టాలు, శాసనపరమైన నిబంధనలు ఎన్నున్నా అవి పకడ్బందీగా అమలు కావడంలేదు. దాంతో బాలల సమస్యలు సమాజంలో తీరని వ్యథలగానే మిగిలిపోతున్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని బాలల విద్యా విషయానికొస్తే, ప్రభుత్వాలు మారినప్పుడల్లా పాఠశాల విద్యలో పలు మార్పులు, చేర్పులు జరుగుతున్నాయి. గతప్రభుత్వ హయాంలో ఎలిమెంటరీ స్కూళ్లను హైస్కూళ్లలో విలీనం చేయడం, ఆంగ్ల మాధ్యమాన్ని అకస్మాత్తుగా తప్పనిసరి చేయడం వంటి చర్యలవల్ల పిల్లలు నానా ఇక్కట్లు పడుతున్నారు. మాతృభాషలో విద్యాభ్యాసం అన్ని విధాలా మేలని వివిధ అధ్యయనాలు తెలుపుతున్నప్పటికీ, ఆంగ్లభాషపై మోజుని పెంచి తెలుగుని దూరంచేస్తున్నారు. మాతృభాషలో విద్యాబోధనవల్ల పిల్లల్లో గ్రహణశక్తి, సృజనాత్మకత పెరుగుతాయనే విషయాన్ని విస్మరిస్తున్నారు. మాతృభాషలో ఆలోచించినంత స్వేచ్ఛగా పరాయి భాషలో ఆలోచించలేరు. ఆంగ్లంలో చదివితేనే ఉద్యోగఉపాధి అవకాశాలు దక్కుతాయనే భ్రమని తల్లిదండ్రుల్లో కల్పిస్తున్నారు. వాస్తవంగా ప్రతిభకే తప్ప భాషా ప్రాతిపదికగా ఉద్యోగాలు లభించవని గ్రహించాలి. మోయలేని పుస్తకాల భారంతో, వయసుకు మించిన సిలబస్‌ల చదువులతో చిన్నారులు సతమతమవుతున్నారు. పసి మెదళ్లకు ఒత్తిడులు ఎక్కువైపోతున్నాయి. బాలలకు క్రీడలు ఎంతో అవసరం. కానీ వాటికి ప్రాధాన్యం ఇవ్వకుండా ఎంతసేపూ చదువు, మార్కులు, ర్యాంకులతోనే గడిపేస్తున్నారు. కానీ ఆటపాటలకు, సృజనాత్మక ప్రక్రియలకు దూరమైన పిల్లలు శారీరక, మానసిక ఆరోగ్యాలను కోల్పోతున్నారని గ్రహించడం లేదు. రోజూ బడుల్లో పిల్లలకు చదువుతో పాటు క్రీడలను కూడా కల్పిస్తేవారిలో చురుకుదనం, దేహదారుఢ్యం పెంపొందుతాయి. నలుగురితో కలిసి ఆటలాడుకోవడం వల్ల పిల్లల్లో ఐకమత్యం అలవడుతుంది. నేడు ఇవి కరవై, చాలా మంది పిల్లలు ఇంట్లో సెల్‌ఫోన్లకు అంకితమైపోతున్నారు. బాలలను ప్రతిభావంతులుగా, జాతి భావిపథ నిర్దేశకులుగా మలచాల్సిన ప్రధాన పాత్రధారులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే. బాలలు సమాజానికి అతి విలువైన వనరులు. దేశాభివృద్ధికి శక్తివంతమైన మూలాధారాలు. •

# ప్రజావాక్కు



## సినిమాలపై ట్రంప్ సుంకం

**అమెరికాలో** తెలుగు సినిమాలకు మంచి స్థిరమైన మార్కెట్ ఏర్పడింది. అక్కడి కలెక్షన్లు టాలీవుడ్ మొత్తం ఆదాయంలో సుమారు 15శాతం వాటా కలిగిఉన్నాయి. అయితే ట్రంప్ ప్రతిపాదించిన 100 సినిమా సుంకం వల్ల అక్కడ టికెట్ ధరలు రెట్టింపు కావచ్చన్న సమాచారం పరిశ్రమలో ఆందోళన కలిగిస్తోంది. ధరలు పెరగడం వల్ల సాధారణ ప్రేక్షకులు థియేటర్లకు వెళ్ళడాన్ని తగ్గించే అవకాశం ఉంది. దీంతో మధ్యస్థాయి సినిమాలు తీవ్రంగా నష్టపోవచ్చు. పెద్ద బడ్జెట్, స్టార్ హీరోల సినిమాలకే కొంత మద్దతు లభించవచ్చు. ఈ పరిస్థితుల్లో నిర్మాతలు కొత్తవ్యూహాలు ఆలోచించాల్సి ఉంటుంది. అమెరికా మార్కెట్ బదులు ప్లాట్‌ఫారమ్‌లు లేదా ఇతర దేశాల మార్కెట్లపై దృష్టి పెట్టే అవకాశం ఉంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## సేంద్రియ ఎరువులే శరణ్యం

**అమెరికా** ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తూ నైతికంగా ఒడిపోతోంది. అమెరికాలో దాదాపు 20 శాతం సాగు అయ్యే బీటీ మొక్కజొన్నను మన నెత్తిన దిగుమతుల పేరిట రుద్దాలి అని చూస్తున్నారు. మన దేశంలో మొక్కజొన్న ఎక్కువగా పండే మహారాష్ట్ర, కర్ణాటక, వంటి రాష్ట్రాలు రైతుల నెత్తిన బారి పిడుగు పడనుంది. మరి అమెరికాకు సందు ఇస్తే మరిన్ని దిగుమతులు మన నెత్తిన పెట్టె అవకాశం ఉంది. కాబట్టి భారత్ ఇప్పుడే జాగ్రత్త పడాలి. సేంద్రియ ఎరువులతో ఉన్న విత్తనాలు మాత్రమే వాడుతామని ప్రతిజ్ఞ పూనాలి.

- భారత అవినాష్, జనగామ

## ముగ్గురు పిల్లల నిబంధన సరికాదు

**తెలంగాణలో**త్వరలోజరిగే స్థానికఎన్నికల్లో 1995 తర్వాతజన్మించిన ముగ్గురుపిల్లలకే గ్రామపంచాయితీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీ చేయరాదనే నిబంధన ఏ విధంగానూ సరికాదు. 1990లలో దేశంలో జనాభా విస్ఫోటనం సంభవించి దశాబ్దా వృద్ధిరేటు 24కు రేరడంతో జనాభాను ఎలా అయినా కట్టడి చేయాలన్న ఉద్దే శంతో ముగ్గురు పిల్లల నిబంధన తెచ్చారు. కానీ మారిన పరిస్థితులలో జాతీయ కుటుంబ సర్వే ప్రకారం పూర్తి సంతానోత్పత్తి రేటు దేశంలో రెండుగా ఉండగా, తెలంగాణలో 1.9గానమోదయింది.

- శాగ శ్రీనివాస్, చిన్నపెండ్యాల, జనగాం జిల్లా

## పల్లెల్లో ఊపందుకోనున్న రాజకీయం

రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడమే తరువాయి.. ఎన్నికల రంగంలోకి దూకేందుకు స్థానిక నాయకులు సిద్ధంగా ఉన్నారు. సర్పంచ్, ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో పోటీ చేయాలనే ఔత్సాహికులు తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన వెంటనే పల్లెల్లో మళ్లీ రాజకీయం ఊపందుకోనుంది. ఒకవైపు ప్రజల్లో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నాయకులు, యువకులుచొరవచూపుతున్నారు. గ్రామాలలో మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలు, యువజన సంఘాలతో నిత్యం సమావేశమవుతున్నారు. గ్రామంలో ముఖ్య నాయకులు, పెద్దలను కలుస్తూ ఆశీస్సులు పొందే ప్రయత్నం చేస్తున్నారు.

- సింగు. లక్ష్మీనారాయణ, దామెరకుంట, భూపాలపల్లి

## ఏనుగుల సంచారం

**ఉత్తరాంధ్ర** గిరిజన ప్రాంతంలో ఒరిస్సా అటవీప్రాంతం నుండి ఒకేసారి ఏనుగులుప్రక్కనున్న ఏజెన్సీ ప్రాంతానికి చొరబడుతూ ప్రజల్ని భయభ్రాంతులతో వణికిస్తున్నాయి. పంటనష్టం కోట్లలో అరటి, పామలిన్‌కి ఏర్పడింది గతంలో. అడవి జంతువులను అదుపుజేయడం, ఎదుర్కొనడం, ప్రత్యేక శిక్షణ, అనుభవం గల, ఫారెస్ట్ రక్షకులకు తగిన సామాగ్రి, శిక్షణ ఉంటూ వాటిని ఎదుర్కొనడం చిన్నకార్యాచరణ కాదు. ఈ మధ్య ఇతర రాష్ట్రాలలో వాటి ఉనికి, సంచారం మీద నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ముందుసమాచారాన్ని తెలుసుకొని ప్రజలకు అప్రమత్తంగా హెచ్చరికలు జారీచేశారు. ఇది ఎంతో గొప్ప కార్యం. వాటినుంచి ముప్పు తప్పించే అధికార్లు, సిబ్బందిచేసే సాహసం చాలా గొప్పది.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

## ప్రజాస్వామ్యం అంధకారంలోకి


భారత దేశంలో ప్రజాస్వామ్యం అంధకారంలోకి వెళుతుంది. ప్రజలపై రాజకీయ శక్తుల అఘాయిత్యాలు అధికమై ప్రజలు స్వేచ్ఛగా స్వతంత్రంగా నివసించలేక తీవ్ర వేదనలకు గురి అవుతున్నారు. సామాన్యులపై రాజకీయ శక్తుల ఆగడాలు అధికమై ప్రజాస్వామ్యరాజ్యంలో శాంతియుతంగా బతికే అవకాశం లేకుండాపోతుంది. దేశంలో వ్యవస్థలు చట్టాలు కూడా నేరస్తులకురాజకీయశక్తులకు అనుకూలంగా వత్తాసు పలుకుతూ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్నాయి. ప్రజలు శాంతియు తంగా స్వేచ్ఛగాబతికిననాడే ప్రజాస్వామ్యదేశంగా చెప్పుకోవచ్చు.

- డి చాంద్ బాషా, కర్నూలు

# మానవాభివృద్ధిలో ఆర్థికప్రగతి భాగం కావాలి

పుల్లెంల గణేష్

భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇటీవల కాలంలో వివిధ దేశాల పర్యటనలో భాగంగా, భారతదేశం ప్రపంచంలో నాల్గవ ఆర్థిక అభివృద్ధి చెందిన దేశంగా మారుతున్నదని చెప్తున్నారు. భారతదేశంలో ప్రస్తుతం ఉన్న సామాజిక, రాజకీయ, ఆర్థిక సాంస్కృతిక పరిస్థితులను క్షుణ్ణంగా గమనిస్తే, నిజంగా భారతదేశం ప్రపంచంలో నేడు ఆర్థికంగా శక్తివంతంగా ఉన్న అమెరికా, చైనా, రష్యా, జపాన్ తదితర దేశాలను వెనక్కి నెట్టి భారతదేశం నిజంగానే ఆర్థికంగా అభివృద్ధిని సాధిస్తుందా అని లోతుగా ఆలోచిస్తే అనేక రకమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకనగా ఒకపక్క ప్రపంచ మానవ అభివృద్ధి సూచిలో భారతదేశం నేటికీ193 దేశాల్లో 130వ స్థానంలో ఉండగా, భారతదేశం ఆర్థిక ప్రగతిలో నాల్గవ స్థానంలో ఉన్నదని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పదే పదే చెప్తే అబద్ధాలు నిజం అవ్వవు కదా! అసలుమానవ అభివృద్ధి లేకుండా ఆర్థిక ప్రగతిని సాధించడం ఏంటి? నేడు 140 కోట్ల మంది ఉన్న భారతీయుల్లో అత్యంత అభివృద్ధికి దూరంగా ఉంటూ, మధ్యతరగతి జీవితాన్ని గడుపుతున్నది ఎవరంటే సామాన్యులు, నిరుపేదలైన బీసీ, ఎస్సీ, ఎస్టీలే కనీస మౌలిక సదుపాయాలు అందక దుర్భర జీవితాన్ని గడుపుతూ, ప్రభుత్వాలు ఇచ్చే ఉచిత పథకాల కోసం తాపత్రయపడుతున్నారు. కానీ ఒకపక్క కేంద్ర ప్రభుత్వం ప్రపంచ దేశాలనే తలదన్ని భారతదేశం మూడవ లేదా నాల్గవ ఆర్థిక శక్తి కలిగిన దేశంగా ఎదుగుతున్నమని చెప్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే దేశంలో ఉన్న 10 అగ్రవర్ణాల అభివృద్ధిని 100 కోట్ల పైగా ఉన్న బీసీ, ఎస్సీ ఎస్టీ,ల అభివృద్ధిగా కేంద్ర ప్రభుత్వం మరీ ముఖ్యంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ చెప్పడం అంటే దేశంలో మెజారిటీగా ఉన్న అణగారిన వర్గాలని మోసం చేయడమే కదా! అగ్రవర్ణాలకి మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా లబ్ధి జరుగుతూ అణగారిన వర్గాలకి తరతరాలుగా అన్యాయం జరుగుతుందని అనేక గణంకాల ప్రకారం నిరూపితం అవుతున్నది. అది ఎలాఅంటే నేడు దేశంలో 10శాతం ఉన్న అగ్రవర్ణాలు ప్రభుత్వ విద్యా సంస్థలను కాదని అత్యంత ఆధునిక సౌకర్యాలు కలిగిన కార్పొరేట్ విద్యని పొందుతున్నారు. అత్యంత ఆధునిక సౌకర్యాలతో కార్పొరేట్ వైద్యాన్ని పొందుతున్నారు. కానీ 100 కోట్ల పైబడి ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలు మాత్రం ప్రభుత్వాల నుండి మెరుగైన ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి లభించక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యని నిర్లక్ష్యం చేసి నిరుపేదలైన, సామాన్యులైన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత ప్రభుత్వ విద్యని కల్పించకపోవడం వల్ల అటు కార్పొరేటు విద్యని కొనలేక అణగారిన వర్గా



ల విద్యార్థుల తల్లిదండ్రులు పస్తులు ఉంటూ, అప్పుల పాలు అవుతూ, ఉన్న కొద్ది ఆస్తిని అమ్ముకొని తమ బిడ్డల భవిష్యత్ కోసమని ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివిస్తున్నారు. ఇక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యాధునిక సౌకర్యాలతోకూడిన ఉచిత వైద్యాన్ని అందించకపోవడం మూలంగా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని కొనలేక, ప్రభుత్వ వైద్యశాలలో సరైన సదుపాయాలు లేక అణగారిన వర్గాలకి చెందిన వేల, లక్షల కుటుంబాలు అనారోగ్యాల బారినపడుతున్నారు. సరైన విజ్ఞానంతో కూడిన స్కిల్స్ లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన ఉపాధి నిరుద్యోగులకి కల్పించకపోవడం మూలంగా లక్షల మంది అణగారిన వర్గాల నిరుద్యోగులు దినసారి కార్మికులుగా పనిచేస్తున్నారు. ఇక అగ్రవర్ణాల కబంధహస్తల్లో వేల, లక్షల ఎకరాల భూమి ఉండడం చేత అణగారిన వర్గాల చేతుల్లో భూమి లేకపోవడం వలన పీడిత వర్గాలకు చెందిన లక్షల కుటుంబాలు ప్రభుత్వాలు ఉచిత భూమిని కల్పిస్తే స్వశక్తితో వ్యవసాయం చేసుకొని ఆత్మ గౌరవంతో బ్రతకాలని వేచి చూస్తున్నారు. మరి అలాంటి కుటుంబాలకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తఆధ్వర్యంలో ఉచిత భూపంపిణీ చేస్తే, దేశంలో అభాగ్యులుగా ఉండి పేదరికంలో ఉన్నలక్షల మంది అణగారిన వర్గాల కుటుంబాలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధిని సాధిస్తాయి కదా! మరి మౌలిక సదుపాయాలైన విద్యా, వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి విషయంలో ఇంతటి తారతమ్యాలు ఉంచుకొని అగ్రవర్ణాల ప్రగతిని మొత్తం దేశం ప్రగతిగా చూపిస్తే, కోట్ల మంది అణగారిన వర్గాలు అభివృద్ధికి దూరంగా జీవిస్తున్నారు కదా! దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఏ విధంగా భారతదేశం ఆర్థికంగా చాలా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతూ నాల్గవ ఆర్థిక శక్తి కలిగిన దేశంగా తయారవుతున్నామని చెప్తారు. నేడు ప్రపంచంలో ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాలైనఅమెరికా, చైనా, రష్యా, జపాన్ మొదలగునవి అక్కడి ప్రజలకి మౌలిక సదుపాయాలన్నీ సమృద్ధిగా కల్పించి, ఆ తర్వాత ఆర్థిక ప్రగతిని సాధించాయి తప్ప, ఆయా దేశాల మానవ అభివృద్ధిని సాధించకుండా ఆర్థిక అభివృద్ధి పైనే దృష్టి పెట్టలేదు. కానీ భారతదేశంలో మాత్రం మానవ అభివృద్ధి లేకుండా ఆర్థిక అభివృద్ధి సాధిస్తున్నామని దేశ ప్రధాని నరేంద్ర మోడీ చాలా గర్వంగా పదేపదే చెప్తున్నారు. అంటే ఒక రకంగాదేశ ప్రజలను మరీ ముఖ్యంగా అత్యంత కడు పేదరికంలో ఉన్న అణగారిన వర్గాలని మభ్యపెడుతూ మోసం చేస్తున్నరాని చెప్పడానికి నిదర్శనం కదా! కాబట్టి ఇకనైనా కేంద్రప్రభుత్వం తమ విధానాన్ని మార్చుకొని మానవ అభివృద్ధిని సాధిస్తూ, అందులో భాగంగా దేశంలో ఉన్న కుల, మత తారతమ్యాలని అధిగమిస్తూ భారతపౌరులకి సౌకర్యవంతమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, మానవ అభివృద్ధిలో భాగంగా దేశ ఆర్థిక అభివృద్ధిని భాగం చేయాలి తప్ప, మానవ అభివృద్ధి లేని ఆర్థిక ప్రగతి సాధించడం అంటే అది ఆధునిక అనాగరిక చర్యకు నిదర్శనంగా గ్రహించాలి. కాబట్టి దేశంలోఉన్న కుల, మతాలకతీతంగా భారతీయ పౌరులందరికీ సౌకర్యవంతమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, మరోపక్క ఆర్థిక ప్రగతిని సాధిస్తే, అప్పుడు మాత్రమే భారతదేశం మానవఅభివృద్ధి సూచిలో అత్యంత ఉన్నత స్థానంలో ఉంటుంది. •

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# డ్వాక్రా మహిళల కోసం రెండు పథకాలు

## పిల్లల చదువుకోసం ఎన్టీఆర్ విద్యాలక్ష్మి'

## లక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తల్ని చేస్తా : సిఎం చంద్రబాబు



**విజయ వాడ, అక్టోబరు1 ,ప్రభాత వార్త ప్రతి నిధి:** డ్వాక్రా సంఘా ల ద్వారా మహిళలను బలోపేతం చేశాం. డ్వాక్రా మహిళలు పెద్ద ఎత్తున డబ్బులను పొదుపు చేస్తున్నారు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని తిరిగి పూర్తి స్థాయిలో చెల్లించేస్తున్నారుడ్వాక్రా మహిళల్లో కేవలం 1 శాతం మాత్రమే ఎన్పీఏలు ఉన్నారంటే మహిళా శక్తి ఏంటో అర్థం చేసుకోండన్నారు. చాలా పరిశ్రమలు, చాలా మంది అప్పులు తీసుకుని ఎన్పీఏలుగా మారుతున్నారు. డ్వాక్రా సంఘాలు మాత్రం తీసుకున్న అప్పులను నిఖార్సుగా తిరిగి చెల్లిస్తున్నారు. లక్ష మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. "ఎక్స్" వేదిక మహిళల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరించారు. మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేసే బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలిప్రతి ఎమ్మెల్యే 1000 మంది మహిళలను గుర్తించి పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేలా కృషి చేయాలన్నదే ప్రభుత్వం యోజన అన్నారు. మహిళా ఆర్థిక స్వావలంభన దిశగా కూటమి ప్రభుత్వం మరో అడుగు వేసిందన్నారు.. డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల పిల్లల చదువుకు అండగా నిలిచేందుకు ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఆడబిడ్డల వివాహాలకు చేయూతనిచ్చేలా ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి పథకాలను అమల్లోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ రెండు పథకాల కింద గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ (సెర్ప్) పరిధిలోని స్త్రీనిధి బ్యాంకు ద్వారా రూ.లక్ష వరకు పావలా వడ్డీకి రుణంగా ఇస్తారన్నారు. ఇందుకు ఇప్పటికే కార్యచరణ ప్రారంభించామన్నారు. గత వారంలోనే ఈ పథకాల్ని ప్రారంభించాల్సి ఉండగా, అనివార్య కారణాలతో వాయిదా పడింది. మరో పది రోజుల్లో ఈ పథకాలు అమల్లోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇక గరిష్ఠంగా ఇద్దరు పిల్లల చదువులకు ఎన్టీఆర్ విద్యాలక్ష్మి పథకం వర్తిస్తుంది. రూ.10 వేల నుంచిరూ. లక్ష వరకు రుణసాయం అందిస్తారు. పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలకు చెల్లించాల్సిన ఫీజుకు అనుగుణంగా అవసరమైన మొత్తాన్ని తీసుకోవచ్చు. దీనికోసం పావలా వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. తీసుకున్న మొత్తానికి అనుగుణంగా చెల్లింపు వాయిదాల సంఖ్య నిర్ణయిస్తారు. గరిష్ఠంగా 48 వాయిదాల్లో మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. అడ్మిషన్ లెటర్, ఫీజు చెల్లింపు విధానం, ఇన్స్టిట్యూట్ వివరాలు, రసీదును సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో సభ్యురాలి బ్యాంకు ఖాతాలో నేరుగా నగదు జమ చేస్తారు. ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి పథకానికి కూడా కొన్ని నిబంధనలు ఉన్నాయి. డ్వాక్రా సభ్యురాలి కుమార్తె వివాహానికి ఈ పథకం వర్తిస్తుంది. అవసరానికి అనుగుణంగా 10 వేల నుంచి లక్ష వరకు రుణంగా తీసుకునే వెసులుబాటు ఉంది. దీనికి కూడా పావలా వడ్డీయే చెల్లించాల్సి ఉంటుంది. తీసుకున్న మొత్తానికి అనుగుణంగా చెల్లింపు వాయిదాల సంఖ్య ఉంటుంది. గరిష్ఠంగా 48 వాయిదాల్లో చెల్లించాలి. పెళ్లి పత్రిక, ఈవెంట్ నిర్వహణకు సంబంధించిన పత్రం, పెళ్లి ఖర్చు అంచనా వ్యయం పత్రాలను సమర్పించాలి. వివాహానికి సంబంధించిన వివరాల పరిశీలన అనంతరం నేరుగా సభ్యురాలి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తారు. ఏడాదికి రూ.2000 కోట్ల వ్యయం అవుతుంది. ఈ రెండు పథకాల కింద సంవత్సరానికి ఒక్కో పథకానిక రూ.1000 కోట్ల చొప్పున మొత్తం రూ.2 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ పథకాల అమలు ద్వారా పావలా వడ్డీ కింద వచ్చే ఆదాయంలో 50 శాతాన్ని తిరిగి డ్వాక్రా సంఘాలకు ఊపిరిగా ఉన్న మండల సమాఖ్యలు, గ్రామ సమాఖ్యల బలోపేతం చేసేందుకు వినియోగించనున్నారు. మిగతా 50 మొత్తాన్ని స్త్రీనిధి ఉద్యోగుల ప్రయోజనాలకు ఉపయోగించనున్నారు.

ఈ పథకాల కింద రుణసాయం పొందిన తర్వాత సదరు సభ్యురాలు ప్రమాదంలో చనిపోతే, ఆ రుణ మొత్తాన్ని మాఫీ చేస్తారు మరో పక్క డ్వాక్రా మహిళల పిల్లల చదువులకు భరోసానిచ్చేలా కూటమి ప్రభుత్వం కొత్త పథకానికి రూపకల్పన చేసింది.

పిల్లల విద్యావికాసానికి దోహదపడేందుకు 4 శాతం వడ్డీకే రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. పథకానికి ఎన్టీఆర్ విద్యా సంకల్పంగా నామకరణం చేసిన ప్రభుత్వం ఏటా 200 కోట్లు ఖర్చు చేసేలా ప్రతిపాదనలను సిద్ధం చేసింది.

## పైశాచిక ఆనందం కోసం నన్ను అక్రమంగా అరెస్ట్ చేశారు

### ఎంపి మిధున్‌రెడ్డి

**తిరుపతి రూరల్, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** కూటమి నాయకులు తమ పైశాచిక ఆనందం కోసమే తనను అక్రమంగా అరెస్ట్ చేశారని రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఎంపి స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకుండానే అక్రమంగా అరెస్ట్ చేసి 73 రోజులు జైల్లో పెట్టారని వాపోయారు. కేసులు తనకేమీ కొత్తకాదనీ, చదువుకునే రోజుల్లోనే తనపై అక్రమ కేసులు బనాయించారని గుర్తు చేశారు. తాను ఇంజినీరింగ్ చదివేరోజుల్లో నాటి టిడిపి ప్రభుత్వం తనపై మొదటి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఓ తీవ్రవాదిలాగా తనపట్ల వ్యవహరించారని అన్నారు. తనను అక్రమంగా అరెస్ట్ చేసి తమ తల్లిదండ్రులను మనోవేదనకు గురిచేశారే తప్ప మరేమీ చేయలేకపోయారని అన్నారు. అక్రమ కేసులకు నిరాధార ఆరోపణలకు భయపడే వాడను కాదని స్పష్టం చేశారు. కష్టకాలంలో తనకు అండగా నిలిచిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. గతంలో తనతో పాటు మాజీ ఎం ఎల్ఏలు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డిలను అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. కేసు కోర్టు పరిధిలో వున్నందున పూర్తి స్థాయిలో మాట్లాడలేకపోతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని 2029లో తమ తీర్పును ఇవ్వడానికి సిద్ధంగా వున్నట్లు తెలిపారు.

## యు పి ఎస్ పెన్షన్ ఆప్షన్ల గడువు నవంబర్ వరకు పొడిగింపు..

**గుంతకల్లు రైల్వే, అక్టోబర్ 01, ప్రభాత వార్త:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయబోతున్న ఏకీకృత పెన్షన్ పథకం (యూ పి ఎస్)లో చేరాలనుకునే కేంద్ర ప్రభుత్వ (రైల్వే) సిబ్బంది తమ తమ ఎంపిక దరఖాస్తులను (ఆప్షన్స్ ఫారాలను) నవంబర్ 30లోగా తాము పనిచేస్తున్న కార్యాలయాల్లో అందజేయాలని రైల్వేవర్గాలు తెలిపాయి. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వశాఖలలో పనిచేస్తున్న 24 లక్షల మంది సిబ్బంది వారు పొందే వేతనంలో యాభై శాతం పెన్షన్ గా పొందే కేంద్ర ప్రభుత్వ ఏకీకృత పెన్షన్ (యూనిఫైడ్ పెన్షన్ పథకం) పథకాన్ని అమలు చేసే క్రమంలో సెప్టెంబర్ 30 లోగా తమ తమ ఆప్షన్స్ ఫారాలను ఇవ్వాలని ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే వివిధ వర్గాల నుంచి కేంద్ర ప్రభుత్వానికి వచ్చిన విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వ, రైల్వే సిబ్బంది తాము ఎన్ పి ఎస్ లోనే కొనసాగుతారా? లేక కొత్తగా అమలులోకి వచ్చిన యూ పి ఎస్ పథకంలో చేరుతారా అనే అంశాలపైనే తుదినిర్ణయం తీసుకోవాలని సూచించారు. కంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న యూ పి ఎస్ పథకంలో చేరాలనుకునే వారు తాము పనిచేస్తున్న కార్యాలయాల్లో నిర్ణీత దరఖాస్తులను భర్తీచేసి నవంబర్ 30 లోగా అందజేయాలన్నారు. సెప్టెంబర్ 24 నాటికి యూ పి ఎస్ పథకంలో చేరిన కేంద్ర ప్రభుత్వ సిబ్బంది 70,670 మందిపి ఎఫ్ ఆర్ డి ఏ... గత నెల సెప్టెంబర్ 21 నాటికి జాతీయ పెన్షన్ పథకం (ఎన్ పి ఎస్) లో మొత్తం 24,64,437 మంది కేంద్ర ప్రభుత్వ సిబ్బంది ఉండగా, ఈ ఏడాది సెప్టెంబర్ 24 నాటికి యూ పి ఎస్ పథకంలో చేరేందుకు 70,670 మంది ఎంపిక చేసుకోగా (ఆప్షన్ ఇవ్వగా), వీరిలో సివిల్ విభాగం నుంచి 21,366 మంది, తపాలా శాఖ9,996 మంది, టెలికాం130 మంది , రైల్వేశాఖ నుంచి 18,024 మంది, డిఫెన్స్ నుంచి 7,058 మంది సిబ్బంది యూపిఎస్ లో చేరేందుకు ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు.

## దసరా మహోత్సవాల సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు సమర్పణ



**శ్రీశైలం అక్టోబర్ 01 ప్రభాతవార్త:** దసరా మహోత్సవాల సందర్భంగా.. శ్రీ స్వామి అమ్మవార్లకు.. రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు సమర్పించిన రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి శ్రీ ఆనం రామనారాయణరెడ్డి, శ్రీశైల శాసనసభ సభ్యులు శ్రీ బుడ్డా రాజశేఖర్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్న దేవదాయ శాఖ కార్యదర్శి డా. హరి జవహర్ లాల్ , జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గనియా, జిల్లా ఎస్. పి . సునీల్ షెరాన్ , చైర్మన్ గా నియమితులైన రమేష్ నాయుడు మరియు కార్యనిర్వహణ అధికారి యం. శ్రీనివాస రావు ఆలయం వద్దకు చేరుకున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆలయ అర్చకులు చైర్మన్ రమేష్ నాయుడు ఈవో శ్రీనివాసరావు సాదర స్వాగతం పలికారు అనంతరం పట్టు వస్త్రాలకి శాస్త్రోతంగా ప్రత్యేక పూజలు చేసి పట్టు వస్త్రాలను ఆలయ ప్రదక్షణ చేసి అనంతరం శ్రీ స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆలయ వేద పండితులు అర్చకులు వేద ఆశీర్వచనం చేసి శ్రీ స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలను అందించారు అనంతరం 2026 సంవత్సరంకు సంబంధించిన క్యాలెండర్ ని ఆవిష్కరించారు.

## రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు : మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ అక్టోబర్ 1, ప్రభాతవార్తప్రతినిధి:** విజయదశమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ విజయదశమి అనేది సత్యం, ధర్మం, న్యాయం చెడుపై సాధించే విజయానికి ప్రతీక. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, సుభిక్షం నింపాలని మనసారా కోరుకుంటున్నాను. రైతులు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు సంక్షేమానికి ప్రధాన ప్రాధాన్యం ఇస్తూ, పంటలకు మద్దతు ధరలు కల్పించడం, రాయితీలు ఇవ్వడం, విత్తనాలు, ఎరువులు, విద్యుత్‌ను అందించడంరైతుల ముఖాల్లో చిరునవ్వులు.

## విజయవాడ గాంధీ హిల్‌కు కొత్తకళ నేడు సిఎం చంద్రబాబు రాక

**విజయవాడ,అక్టోబరు1,ప్రభాతవార్తప్రతినిధి:**విజయవాడ గాంధీ హిల్‌కు కొత్తకళ సంతరించుకుంది. గాంధీ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు తొలిసారిగా కొండపై పర్యటించి గాంధీ స్మారకస్థూపం నుండి బెజవాడ అందాలను వీక్షించనున్నారు. గాంధీ హిల్‌పై ఇప్పటికే భద్రత ఏర్పాటలను కట్టుదిట్టం చేశారు. గాంధీ హిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను చేపట్టారు. ఇప్పటికే అక్కడ నూతనంగా జంబో లెఫ్ట్‌ను నిర్మించారు. కొండ మిడిల్ డౌన్ నుండి స్మారకస్థూపం వరకు లిఫ్ట్ నిర్మించారు. విజయవాడ వ్యూ పాయింట్‌ను సందర్శించేలా ఏర్పాటు చేసిన నూతన లిఫ్ట్, ట్రైన్, పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. గాంధీ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు గాంధీ హిల్‌పై పర్యటించనున్నారు. తొలిసారిగా సీఎం చంద్రబాబు గాంధీ స్మారకస్థూపం సందర్శించనున్న ఈ నేపథ్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఒకప్పుడు గాంధీ స్థూపం చేరుకోవాలంటే ఘాట్ రోడ్డులో వెళ్లాలి. కానీ అది కొండ పైవరకు లేదు. కొండ శిఖరాగ్రంలో ఉన్న గాంధీ స్మారకస్థూపం వరకు వెళ్లాలంటే మెట్ల మార్గం ఒక్కటే దిక్కు. అయితే పర్యాటకులకు ఇది ఇబ్బందిగా ఉందని గాంధీ హిల్ నిర్వాహుకులు జంబోలను నిర్మించారు.. చరిత్ర కలిగిన గాంధీ హిల్‌ను పూర్వవైభవం తీసుకొచ్చే ప్రణాళికలు చేస్తున్నారు..విజయవాడ నగరం ఆధ్యాత్మికంగా, చారిత్మకంగా, సాంస్కృతికంగా ఎంతో గొప్ప ప్రాధాన్యత కలిగిన ప్రదేశం. ఇక్కడ ఒకవైపు ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ, మరోవైపు గుణదల మేరిమాత కొండ, గాంధీ కొండలు విశేష ఖ్యాతిని పొందాయి. వీటిలో అతి ముఖ్యమైనది గాంధీ హిల్, ఎన్నో ప్రత్యకతలతో నిలుస్తోంది. మహాత్మగాంధీ స్మారకార్ధంగా నిర్మించబడినన గాంధీ హిల్ కొండ దశాబ్దాలుగా లక్షలాది మంది సందర్శకులతో ఆకర్షిస్తుంది. మహాత్మగాంధీ మరణాతరం అయన జ్ఞాపకార్ధం దేశవ్యాప్తంగా అనేక స్మారక చిహ్నాలు నిర్మించబడాయి. కానీ గాంధీ హిల్‌పై మహాత్మ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయకపోవడంతో ఈ క్రమంలో విజయవాడ రైల్వే స్టేషన్ పశ్చిమ ద్వారం సమీపంలో ఉన్న గాంధీ హిల్ కొండపై స్మారక స్థూపాన్నీ నిర్మించాలని ముమ్మర ఏర్పాటు చేపట్టారు.1964 నవంబర్ 9న దీని నిర్మాణనికి శ్రీకారం చుట్టగా 1968లో గాంధీజీ శతజయంతి వేడుకలు సందర్భంగా నాటి భారత రాష్టపతి డా. జాకిర్ హుసేన్ చేతుల మీదుగా 52 అడుగుల ఎతైన స్మారక స్థూపాన్ని ప్రజలకు అంకితం చేశారు. అయితే అప్పటి నుంచి గాంధీ హిల్‌కు నగరంలో ప్రత్యక గుర్తింపు వచ్చింది.

## 'దివ్యరథంపై దేవదేవుడు'

### - గోవిందనామస్మరణలతో మార్మోగిన తిరుమల

**తిరుమల,అక్టోబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:** భగవంతుడు ఊరేగే వాహనాల్లో రథోత్సవం అన్నివిధాలా శ్రేష్టమైంది. "రథస్తం కేశవం దృష్ట్వా పునర్జన్మవిద్యతే"అనే ఆర్షవాక్కులు రథోత్సవం మోక్షప్రదాయకమని వివరిస్తాయి. ఆత్మరథికుడు, శరీరమే రథం. బుద్ది సారధి, మనస్సు పగ్గం. ఇంద్రియాలే గుర్రాలు. విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంలో పోల్చడంతో స్థూలశరీరం వేరని, సూక్ష్మశరీరం వేరని, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. కలియుగవైకుంతం ఏడుకొండలపై దేవదేవుని సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదోరోజు బుధవారం ఉదయం మహోన్నత దివ్యరథంపై భూదేవిశ్రీదేవిసమేత మలయప్పస్వామి భక్తులకు దర్శనమిచ్చాడు. ఉదయం ఆలయంలోపల నిత్యకైంకర్యాలు పూర్తిచేసుకు న తరువాత ఆలయంనుండి సర్వాంగసుందరంగా విశేషభర ణాలు, తులసీమాలలు, వివిధ రకాల పుష్పాలమాలలు ధరించి ఉభయదేవేరులతో కలసి మలయప్పస్వామి ఆలయంముందుకు వేంచేపుచేశారు. ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, వాహన ఇన్‌స్పెక్టర్, ఆలయ అర్చకులు మంగళ వాయిద్యాల నడుమ ఆలయం ముందు రథంపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. ఉదయం 7గంటలకు ఇక్కడ వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారిని బంగారు గొడుగు అమర్చిన మహోన్నరథంపై అధిరోహింపజేశారు. అర్చకులు కర్పూరహారతు లిచ్చి ఆలయమాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. స్వామివారి రథంముందు భక్తులు ఏడుకొండలవాడా.. ఆపదమొక్కుల వాడా.... వడ్డీకాసుల వెంకన్న గోవిందా గోవింద నామస్మర ణలతో స్వయంగా ఈ రథాన్నిలాగి భక్తిపారవ శ్యంతో పునీతులయ్యారు. తిరుమాఢవీధులలో అడుగడుగునా నీరాజనాలు సమర్పించారు.

## బొబ్బిలి కోటలో అంగరంగ వైభవంగా ఆయుధ పూజ

**బొబ్బిలి అక్టోబర్ 1 ప్రభాతవార్త** బొబ్బిలి కోటలో ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాల్లో భాగంగా ఆయుధపూజ బొబ్బిలి రాజ వంశీయులు అంగరంగ వైభవంగా జరిపారు. బొబ్బిలి కోటలో ఉన్న ఆనాటి బొబ్బిలి యుద్ధం ఆయుధాలను ప్రతి సంవత్సరం మాదిరిగా రాజవంశీయులు విజయ్ కృష్ణ రంగారావు రామకృష్ణ రంగారావు ఆర్ వి ఎస్ ఎస్ కె రంగారావు (బేబీ నాయన) ఆధ్వర్యంలో అలనాటి ఆయుధాలకు వేదమంత్రాలతో శాస్త్రోక్షంగా విజయదశమి పూజలు నిర్వహించి బొబ్బిలి చెట్టు చివరి రాజు ఆర్ ఎస్ ఆర్ కె రంగారావు వారి చిత్రపటానికి. స్వర్గీయ కుమార్ రాజా గోపాలకృష్ణ రంగారావు వారి చిత్రపటానికి నాయనా సోదరులు ఆనాటి పూర్వీకులు వాడిన ఆయుధాలను వాటి పనితీరును నెమర్ వేసుకుంటూ విశేష పూజలు నిర్వహించారు. బొబ్బిలి రాజుల ఆరాధ్య గురువు చిన్న జీయర్ స్వామి వారి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూల నుంచి వచ్చిన అభిమానులకు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు ఈ వేడుకలను చూడడానికి పెద్ద ఎత్తున రావడం విశేషం. ఎమ్మెల్యే బేబీ నాయన మాట్లాడుతూ మా పూర్వీకులు యుద్ధ విద్యలలో మంచి నిపుణులు ఆనాటి నుండి ఆ ఆయుధాలను మేము మ్యూజియంగా భద్రపరిచి ఉంచాం అని చెప్పారు.



## నేటి ఉదయం 'చక్రస్నానమహోత్సవం'

### - ముగింపునకు చేరుకున్న బ్రహ్మోత్సవాలు

**తిరుమల,అక్టోబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి తొమ్మిదిరోజులు స్వయంగా బ్రహ్మదేవుడు దగ్గరుండి జరిపించే బ్రహ్మోత్సవాలు గురూవారం ఉదయం చక్రస్నానమహోత్సవంతో ముగుస్తున్నాయి. బ్రహ్మోత్సవాల్లో సపరివారం దేవతలు తిరుమలలోనే ఉంటారని పురాణాల ఆర్యోక్తి. అంతటిపవిత్రమైన ఈ తొమ్మిదిరోజులు భక్తులు కూడా భగవంతుని సేవలో తరిస్తారు. ఎందరో ప్రముఖులు, ధనవంతులు, వివిఐపిలు ఒక్కరేంటి అందరూ ఆ స్వామిసేవలోనే సేవకులుగా తరిస్తారు. గతనెల 24నుండి మొదలైన సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి చివరివాహనంగా అశ్వవాహనంగా జరిగింది. చివరిఘట్టంగా చక్రస్నానమహోత్సవం నేటి ఉదయం నిర్వహిస్తారు.

## బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు వసతి ప్రాధాన్యత : డిప్యూటీ ఇఒ భాస్కర్

**తిరుమల,అక్టోబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:** ఏడు కొండలపై సాధారణరోజుల్లో సామాన్య భక్తులకు 50శాతం గదులు కేటాయిస్తే తొమ్మిదిరోజులు పాటు జరిగిన సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో రోజుకు 2,500 గదులు వారికే కేటాయించామని వసతికల్పనవిభాగం డిప్యూటీ ఈఓ భాస్కర్ తెలిపారు. నూతన యాత్రికుల వసతి సముదాయం( వెంకటాద్రినిలయం-పిఎసి 5)బ్రహ్మోత్సవాల్లోనే అందూటులోకి రావడంతో 10వేలమంది భక్తులకు వసతి కల్పించేలా ఏర్పాట్లు చేశామన్నారు. 2,400 లాకర్లు భక్తులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. బుధవారం ఉదయం మీడియాసెంటర్‌లో ఆయన మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో విచ్చేసిన విఐపిలకంటే సామాన్యులకే వసతి కేటాయించడం జరిగిందన్నారు.

# తిరుమల సమాచారం

## అశ్వవాహనంపై కలియుగదైవం



**తిరుమల,అక్టోబర్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠంలో శ్రీవేంకటేశ్వరస్వామిగా ఆవిర్భవించి భక్తులను కాపాడుతున్న కలియుగ ప్రత్యక్షదైవం శ్రీనివాసుడి బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి చివరగా అశ్వవాహనంపై భక్తులను కటాక్షించాడు. కలియుగాంతంలో స్వామి కల్కిమూర్తియై గుర్రంపై పయనిస్తూ ,ఖడ్గధారియై దుష్టశిక్షణం, శిష్టరక్షణం చేస్తాడని పురాణాలు పేర్కొన్నాయి. ఆధ్యాత్మికంగా పరమాత్మే అశ్వం. ఆయనే మనహృదయంలోవుండి ఇంద్రియాల్ని నియమిస్తున్నాడు. శ్రీహరి శ్రీనివాసుడై ఈ లోకంలో వేంకటాచలం చేరి అటునుండి పద్మావతిదేవిని పెండ్లాడటానికి మొట్టమొదట వేటనెపంతో గుర్రంపైనే వచ్చాడట. స్వామివారు అశ్వంపై కూర్చుని తన వేగశక్తిని, బలశక్తినీ నిరూపిస్తుంటారు. వేగశక్తి అశ్వలక్షణం. రథాన్ని లాగేవి గుర్రాలే. బుధవారం రాత్రి అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడు చివరగా అశ్వవాహనంపై విహారించాడు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు,బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, శాంతారాం,నరేశ్, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, జెఈఓ వీరబ్రహ్మం, సిఇ సత్యనారాయణ భక్తులు పాల్గొన్నారు.

## రేపు డయల్ యువర్ 'టిటిడి ఇఒ' కార్యక్రమం పునఃప్రారంభం



**తిరుమల,అక్టోబర్ 1 ప్రభాత వార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చిన భక్తులకు వెంకన్న దర్శనంలో గానీ, వసతి కల్పనలో ఎదురైన అనుభవాలు, ఇబ్బం దులు, తమతమ సూచనలు,సలహాలు తెలిపేందుకు ప్రతినెలా మొదటి శుక్రవారం తిరుమలలో "డయల్ యువర్ ఇఓ"కార్యక్రమం జరగ నుంది. దేశవిదేశాల్లోని భక్తులు తమతమ ఫిర్యాదులు, సూచనలను శుక్రవారం ఉదయం 9నుంచి 10గంటల వరకు 0877-2263261 నంబర్లకు ఫోన్‌ద్వారా నేరుగా టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్‌తోమాట్లాడే అవకాశం కలుగుతుంది. పరిపాలనపరమైన కారణాలతో గతంలో ఈ కార్యక్రమం నిర్విరామంగా సాగలేదు. ఇటీవల నూతనంగా ఈఓగా సింఘాల్ రాకతో పునరుజ్జీవం కలిగిస్తున్నారు.

## బ్రహ్మోత్సవాల్లో ఒక్కరోజే 16రకాల ఆహారపదార్థాలు

### - అన్నప్రసాదాల పంపిణీపై 99శాతం సంతృప్తి



**తిరుమల,అక్టోబర్ 1ప్రభాత వార్త ప్రతినిధి:** సాధారణ రోజుల్లోనే తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాదభవనంతోబాటు మినీ అన్నప్రసాదం భవనంలో, ఫుడ్‌కోర్టులలో 1.20లక్షలమంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరిస్తుండటం విశేషం. అలాంటిది ఇలవైకుంతంగా తలపించే తిరుమలలో దేవదేవుని సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు అత్యంత విశేషమైన గరుడసేవరోజు మాత్రమే 16 రకాల ఆహారపదార్థాలతో 9.28లక్షలమంది భక్తులకు అన్నప్రసాదాలు అందించడం రికార్డుస్థాయి అని అన్నప్రసాదంవిభాగం డిప్యూటీ ఈఓ ఎం.రాజేంద్రకుమార్ తెలిపారు. మీడియాసెంటర్‌లో అన్నప్రసాదం వివరాలను తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ఇప్పటివరకు అన్నప్రసాదాల పంపిణీపై 99శాతం మంది భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. భక్తులకు ఈ ఎనిమిదిరోజులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ అన్నప్రసాదం, అల్పాహారం, పాలు, మజ్జిగ భక్తులకు పంపిణీ చేశామన్నారు. దాతలు 23రకాల కూరగాయలను విరాళంగా అందించినట్లు చెప్పారు. గత ఎనిమిదిరోజులు 30లక్షలమందికి అన్నప్రసాదాలు అందించడం జరిగిందన్నారు. అన్నప్రసాదం ప్రత్యేక అధికారి జిఎల్ఎన్ శాస్త్రి మాట్లాడుతూ విశేషమైన గరుడసేవరోజు మాత్రం గ్యాలరీలతోబాటు మాఢవీధుల్లో హోల్డింగ్ పాయింట్ల వద్ద 9.8లక్షలమంది భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశామని తెలిపారు. గరుడసేవరోజు ప్రతి గంటకు ఒక్కోరకమైన ప్రసాదాన్ని పంపిణీ చేశామన్నారు. శ్రీవారిసేవకులు, పోలీసులు, టిటిడి ఉద్యోగుల సాయంతో గత సంవత్సరంకంటే ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు 33శాతం అదనంగా అన్నప్రసాదాలు పంపిణీ జరిగిందని శాస్త్రి తెలిపారు.

## సెప్టెంబర్‌లో వందకోట్లు దాటిన హుండీ ఆదాయం

### - బ్రహ్మోత్సవ రోజుల్లో తగ్గిన కానుకలు



**తిరుమల,అక్టోబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంతవాసు డు.. ..అత్యంత సంపన్న వంతమైన దేవుడు తిరుమలేశునికి సెప్టెంబర్‌నెలలోనూ హుండీ ఆదాయం వందకోట్లు రూపాయలు దాటింది. గతనెల 24వతేదీ నుండి 30వరకు తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదిరోజులకుగాను హుండీ కానుకలు కొంత తగ్గింది. ఎనిమిదిరోజులు కానుకల ద్వారా భక్తులు వెంకన్న హుండీకి 28కోట్ల రూపాయల వరకు ముడుపులు సమర్పించుకున్నారనేది తెలుస్తోంది. 30రోజులకుగాను 107.44కోట్ల రూపాయలు ఆదాయం చేకూరింది. బ్రహ్మోత్సవాల్లో రెండవరోజు సెప్టెంబర్ 25వతేదీ 1.74కోట్లు, 26న మూడోరోజు 2.58కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. ఇక మిగిలిన ఆరురోజులు మూడుకోట్లు మార్కుదాటింది. ఇక భక్తులు దర్శనాలకు సంబంధించి నెలంతా 21కోట్లమంది భక్తులు స్వామివారిని దర్శించుకోగలిగారు. తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాల్లోనే 6.50లక్షలమంది భక్తులకు మూలవిరాట్టుతోబాటు వాహనసేవల దర్శనం టిటిడి కల్పించింది. అయితే సెప్టెంబర్‌నెలలో 107.44కోట్లు ఆదాయం చేకూరగా, 21లక్షలమంది భక్తులు దర్శనం చేసుకున్నారు. గత ఏడాదికంటే కొంత తగ్గిందనేది టిటిడి వర్గాల అంచనా. అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడ్ని సేవించుకునేందుకుదేశవిదేశాల్లోని భక్తులు తమ ఇష్టదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమలకు భారీగా తరలివస్తున్నారు. మరీ బ్రహ్మోత్సవాల్లోనూ భక్తులు తగ్గుముఖం పట్టలేదు. హుండీ కానుకలు మాత్రం తగ్గాయి.

సాదారణంగానే తిరుమలకు వచ్చిన భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా కానుకల రూపంలో హుండీకి నగదు,నగలు సమర్పించుకోవడం కనిపిస్తోంది. భక్తుల రద్దీతో బాటు మొక్కుబడుల రూపంలో కానుకలు హుండీకి భారీగానే నెలనెలా చేకూరడం విశేషం. గడచిన నెలలో ప్రతిరోజూ సరాసరి 3.50-4కోట్లురూపాయలు వరకు హుండీ ఆదాయం లభించింది. బ్రహ్మోత్సవాల్లో 24న 3.01కోట్లు రూపాయలు, 25న 1.74కోట్లు, 26న 2.58కోట్లు, 27న 3.36కోట్లు, 28న 3.79కోట్లు, 29న 4.14కోట్లు రూపాయలు, సెప్టెంబర్ 30న 3.77కోట్లరూపాయలు సమకూరింది. సాధారణరోజుల్లో 20వతేదీ 4.59కోట్లు, 1న 4.03కోట్లు,12న 4.15కోట్లు ఇలా వరుసగా రోజుకు 3.50కోట్లరూపాయలు దాటిన రోజులే ఎక్కువ.

# జీఎస్టీ అధికారుల ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోం

● రూ.130 కోట్ల పన్ను విషయమై అప్పిలేట్ అథారిటీని ఆశ్రయించండి: హైకోర్టు ● శక్తి ఫెర్రో సంస్థకు 3 వారాల గడువు మంజూరు

**విజయవాడ, అక్టోబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఫెర్రో ఎల్లాయ్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ (ఎస్ఎఫ్ఏఐపీఎల్) సంస్థకు రూ.130.61 కోట్ల పన్నును విధిస్తూ జీఎస్టీ రాష్ట్ర అధికారులు జారీ చేసిన ఉత్తర్వుల్లో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారాలన్నీ జీఎస్టీ 'అప్పిలేట్ అథారిటీ' విచారించడం ఉత్తమం అని అభిప్రాయపడింది. ఆ పన్నులో సంస్థ ఇప్పటికే 10 శాతం చెల్లించిందని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో జీ ఎస్టీ అప్పిలేట్ అథారిటీ అప్పీలు దాఖలు చేసుకునేందుకు సంస్థకు 3 వారాల సమయం ఇచ్చింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం సెప్టెంబరు 26న ఈ మేరకు తీర్పు ఇచ్చింది. చిత్తూరు జిల్లా వసనాడు గొల్లపల్లి గ్రామ పరిధిలోని ఎస్ఎఫ్ఏఐపీఎల్ సంస్థ... ఉక్కు తుక్కు వర్తకంతో పాటు లాజిస్టిక్స్, వేర్ హౌసింగ్, టీఎంటీ బార్ల తయారీ, ఇతర ఉత్పత్తుల వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. శక్తి ఫెర్రో సంస్థ 2017-18 నుంచి 2020-21 వరకు రాష్ట్ర జీఎస్టీతో పాటు వడ్డీ, జరిమానా కింద మొత్తం రూ.130.61 కోట్ల చెల్లింపునకు తిరుపతి లోని జీఎస్టీ ఆడిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ కమీషనర్ (రాష్ట్ర పన్నులు) 2024 సెప్టెంబరు 5న పనున మదింపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ శక్తి ఫెర్రో సంస్థ అప్పట్లో హైకోర్టులో వ్యాజ్యం వేసింది. తాజాగా జరిగిన విచారణలో సంస్థ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. వస్తువుల కొనుగోలు, దస్త్రాలను పరిశీలిస్తే జీఎస్టీ అధికారులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదనేది స్పష్టమవు తోందన్నారు. మదింపు ఉత్తర్వులను రద్దు చేయాలన్నారు. రాష్ట్ర జీఎస్టీ అధికారుల తరపున వాణిజ్య పన్నుల శాఖ ప్రభుత్వ న్యాయవాది(జీపీ) మన్నం కృష్ణారావు వాదనలు వినిపించారు. 'పలు కంపెనీల నుంచి తమకు వస్తువులు సరఫరా అయ్యాయని శక్తి ఫెర్రో సంస్థ చేస్తున్న వాదనకు ఆధారాలు లేవు. ఉనికిలో లేని సంస్థలు, వ్యక్తుల నుంచి శక్తి సంస్థ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ) పొందింది. నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ధ్రువపత్రాలు జారీ చేసేందుకు ఉనికిలో లేని సంస్థలను ఏర్పాటు చేశారు. వస్తువుల రవాణాకు సంబంధించిన వివరాలు లేవు' అని అన్నారు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం... ఆరోపణలు, ప్రత్యారోపణల నేపథ్యంలో వాస్తవాలను తేల్చేందుకు లోతైన విచారణ (ఎంక్వైరీ) అవసరమని అభిప్రాయపడింది. లోతుల్లోకి వెళ్ళి విచారించేందుకు జీఎస్టీ అప్పిలేట్ అథారిటీ సరైందని పేర్కొంది. అప్పీలు చేసేందుకు ఫెర్రో సంస్థకు సమయం ఇచ్చింది. వ్యాజ్యాన్ని పరిష్కరించింది.



# యూరియా వాడకం తగ్గించాలి

● లక్ష టన్నులు అందించాం ● ఇంకా స్టాక్ అందుబాటులో ఉంది: మంత్రి అచ్చెన్నాయుడు

**శ్రీకాకుళం, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** యూరియా వాడకం తగ్గించి పంటకు సరిపడా యూరియా వాడాలని వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా దత్తత గ్రామమైన బన్నువాడలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పండించిన పంటలో డిఏపి, యూరియా అధిక వినియోగం వలన భూసారం కోల్పోయి ప్రాణాలకే ముప్పు ఉండే అవకాశం ఉందన్నారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలన్నారు. గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రూ.250 కోట్ల యూరియాను విక్రయిస్తే, తమ ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా రూ.300 కోట్ల వరకు విక్రయించినట్లు తెలిపారు. ఇకపై రైతులు పండించే పంటకు ఎంత మేరకు అవసరమో డిమాండును బట్టి యూరియాను రైతుల ఇంటి వద్దకే పంపిణీ చేసేలా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. భూసారం పెంచేందుకు అవసరమైన విత్తనాలను రైతులకు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నానో యూరియా వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని మంత్రి అన్నారు. యూరియాకి ప్రత్యామ్నాయంగా నానో యూరియాను వాడుకోవచ్చని సూచించారు. నానో యూరియా వల్ల రైతుకు రవాణా, నిల్వ ఖర్చులు ఆదా అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు, నీటి సంఘం అధ్యక్షులు సనపల మురళీధరరావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు ఎన్.కిరణ్ కుమార్, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు త్రినాధ స్వామి, సహాయ సంచాలకులు జగన్మోహన్, వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎం.సుధాకర్ రావు, ఎంపిడిఓ రేణుక, బిఆర్ వంశధార ప్రాజెక్టు కార్యనిర్వహణ ఇంజనీర్ శేఖర్‌బాబు, డీఎస్పీ లక్ష్మణరావు, ఉద్యానవన అధికారి సునీత, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# జిఎస్‌టి 2.0 సంస్కరణలు సామాన్యుల పాలిట వరం

### - కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**కోవూరు (నెల్లూరు), అక్టోబర్ 1 ప్రభాతవార్త:** జిఎస్‌టి తగ్గింపు పట్ల వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి 3 వేల రూపాయల నిత్యావసర సరుకుల కొనుగోలుపై 250 ఆదా అవుతున్నాయి. కోవూరులో జిఎస్‌టి 2.0 ప్రయోజనాలపై ప్రజలకు వివరిస్తూ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పెన్షన్‌లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడి చేపట్టిన జిఎస్‌టి 2.0 సంస్కరణలు దేశ వ్యాప్తంగా ప్రజలకు దసరా కానుక లాంటిదన్నారు కోవూరులో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌తో కలిసి ఆమె బజారు వీధి తదితర ప్రాంతాలలో జిఎస్‌టి 2.0 ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించారు. గతంలో నాలుగు స్లాబులుగా ఉన్న జిఎస్‌టిని నేడు 2 స్లాబులకు తీసుకు రావడం పట్ల వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో దేశం ఆర్థికంగా అభివృద్ధి చెంది ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్టంలో ఒక వైపు కొత్త పరిశ్రమలు, మరో వైపు, సూపర్ సిక్స్ లాంటి సంక్షేమ పథకాలతో సీఎం చంద్రబాబు పాలనలో ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు సర్పంచ్ ఏకశిరి విజయ, ఎంపీపీ తుమ్మల పార్వతి, టిడిపి జిల్లా కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఇంత మల్లారెడ్డి, రావెళ్ల వీరేంద్ర నాయుడులతో పాటు కొడవలూరు, విడవలూరు బుచ్చిరెడ్డిపాలెం మండలాల టిడిపి అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్ల నాయుడు, వేటూరి శ్రీహరి రెడ్డి, బెజవాడ జగదీష్, గుత్తా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సాంస్కృతిక కార్యక్రమాల్లో

# ఎపి టీచర్ల ప్రదర్శన అదుర్స్

**విజయవాడ, అక్టోబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఢిల్లీలోని సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ వారి ఆధ్వర్యంలో జాతీయ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో రాష్ట్ర కళా సాంస్కృతిక వారసత్వ సంపద, గొప్పదనం, అవతరణ, సాంప్రదాయాలు, కళలు, మహానుభావులు తదితరంశాలలో పిపిటి ప్రదర్శన, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, అన్నమయ్య, అల్లూరి సీతారామరాజు, సంక్రాంతి సంబరాలు, థింసా, జానపద నృత్యం, రాష్ట్ర గీతం పై ప్రదర్శనలు చేసారు. ఈ ప్రదర్శనలకు అత్యంత స్పందన లభించింది. దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాల నుండి ఎస్‌సిఈఆర్టీ ఆధ్వర్యంలో జరిగే నెప్‌లో భాగంగా ఢిల్లీలో గల సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ వారి ఆధ్వర్యంలో ద్వారా ఎంపిక చేయబడిన 68 మంది ఉపాధ్యాయులకు రోల్ ఆఫ్ పప్పెట్రీ ఇన్ ప్రైమరీ ఎడ్యుకేషన్‌లో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశం ప్రాథమిక తరగతి బోధనలో పప్పెట్రీ ద్వారా జాయ్ ఫుల్ లెర్నింగ్ జరిగేలా ఉపాధ్యాయులను సంసిద్ధులను చేయడం. విద్యార్థుల్లో జాతీయ ఐక్యత భావాన్ని పెంపొందించడం. ఇతర రాష్ట్రాల శిక్షణార్థుల ప్రశంసలు అందుకుంది. ఢిల్లీలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమం ఉపాధ్యాయులకు జ్ఞానమార్పిడి వేదికగా నిలిచి సృజాత్మక బోధనా పద్ధతులను అభివృద్ధి చేయడంలో భిన్నత్వంలో ఏకత్వం అనే భారతీయ భావనను బలోపేతం చేయడంలో ముఖ్యపాత్ర వహిస్తోంది. శిక్షణ అనంతరం డైరెక్టర్ రాజీవ్ కుమార్ చేతుల మీదగా సర్టిఫికెట్స్ అందుకున్నారు. ఏపీ నుండి ఏడుగురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అత్యాచార బాధితురాలికి పరామర్శ

**విజయవాడ, అక్టోబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో అత్యాచారానికి గురైన మైనర్ బాలికను ఆస్పత్రిలో మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శైలజ రాయపాటి పరామర్శించారు. బాలిక ఆరోగ్యస్థితిపై ఆస్పత్రి సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రక్షణ ఇవ్వాల్సిన బంధువే నేరస్తుడవడం సిగ్గుచేటు అన్నారు. బాధిత కుటుంబానికి మనోధైర్యాన్ని అందించిన ఛైర్‌పర్సన్ చిత్తూరు జిల్లాలో పూతలపట్టు మండలానికి చెందిన ఇంటర్ విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచారం కేసుపైన స్పందించారు. ఈ కేసును సుమోటోగా తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. నేరస్తులు ఎవరైనా కఠిన శిక్ష నుంచి తప్పించుకోలేరన్నారు.

# భారీగా గంజాయి పట్టివేత

**విజయవాడ, అక్టోబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ రామవరప్పాడు వద్ద భారీగా గంజాయి పట్టుబడింది. సుక్మా నుంచి సాలెంకు తరలిస్తుండగా సమాచారం అందిన డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. గూడ్స్ తరలించే డీసీఎం వాహనంలో గంజాయి తరలిస్తున్న నిందితులను దారికాచి పట్టుకున్నారు. వారి నుంచి 1,300 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పైపులు, ఇతర సామగ్రి మధ్యలో పెట్టి నిందితులు గంజాయి రవాణా చేస్తున్నారు. 561 ప్యాకెట్లుగా చేసి తరలిస్తున్న 1,300 కిలోల గంజాయి డిఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2.6 కోట్లు డిఆర్ఐ అధికారులు ఉంటుందన్నారు ఇద్దరు నిందితులు అరెస్టు చేసి, గంజాయి రవాణాకు ఉపయోగించిన లారీని స్వాధీనం చేసుకున్నారు.

# మణిద్వీప మహాసంస్థానంలో శాస్త్రోక్తంగా లక్ష మోదుగల హోమం



**రాపూరు (నెల్లూరు), అక్టోబర్ 1 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ మాతృదేవి విశ్వశాంతి అశ్రమంలోని మణిద్వీప మహాసంస్థానంలో లక్ష మోదుగల హోమాన్ని అశ్రమ వ్యవస్థాపకురాలు భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి శాస్త్రోక్తంగా నిర్వహించారు.. గర్భాలయంలోని శ్రీ లలింతాభికా దేవి, శ్రీ మహా లక్ష్మీ దేవి, శ్రీ మహా సరస్వతీ దేవిల ఉత్సవ మూర్తులకు అశ్రమ వ్యవస్థాపకరాలు భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి తన స్వహస్తాలతో అభిషేకాలు, విశేష అర్చనలు, కమలార్చనలు, మహా మంగళ హారతులు నిర్వహించి, భక్తులకు దేవి నవరాత్రుల ప్రాముఖ్యతను అనుగ్రహ బాషణం చేశారు. అనంతరం అశ్రమంలోని యాగశాలలో శ్రీ మహా గణేశ హోమం, శ్రీ లలితా సహస్రనామ హోమం, శ్రీ ఛండీ హోమం, నవగ్రహ శాంతి హోమం, శ్రీ లక్ష్మీ నృసింహ హోమం, శ్రీ మహా గణేశ లక్ష్య మోదుక హోమలు నిర్వహించి భగవతి విజయేశ్వరీ దేవి పూర్ణహుతిని హోమగుండాలలో సమర్పించారు. సాయంత్రం 6.30కి సామూహిక శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ముగ్గురమ్మలను దర్శించుకున్నారు. భక్తులకు కావలసిన భోజన, వసతీ ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు పులిపాటి విజయ్ భరత్, విజయ్ గోకుల్, సింధూ, సౌమ్య, తదితరులు పర్యవేక్షించారు.



వృద్ధ మహిళను పెన్షన్ వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి సవిత

# సూపర్ సిక్స్ పథకాలతో పేదవారి కళ్లల్లో ఆనందం

### పెన్షన్లు పంపిణీలో మంత్రి సవిత

**రొద్దం. అక్టోబర్ 1 ప్రభాతవార్త:** శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో ఎన్టీఆర్ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఇంటింటికి వెళ్లి వృద్ధులకు వికలాంగులకు వితంతువులకు అనారోగ్యంతో మంచాన పడిన బాధితులకు స్వయాన పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత రాకతో చెరుకూరు గ్రామస్తులు బాణాసంచ పేల్చుతూ వీధి వీధినా పెద్ద ఎత్తున పూల వర్షం కురిపించారు. ప్రతి ఇంటికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేసి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు పరచి ప్రతి ఒక్క పేదవారి కుటుంబంలో పెద్ద దిక్కుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. మీరు కూడా తనను ఆశీర్వదించి, ఈ స్థాయిలో ఉంచినందుకు మీకు ఎప్పుడు రుణపడి ఉంటానని అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు విషం కక్కుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు పలు అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహాసీల్దార్ ఉదయ శంకర్ రాజు, ఎంపీడీవో ఆనంద్ ప్రసాద్, ఎస్ఐ నరేంద్ర, ఈవో ఆర్‌డి గోవిందప్ప, అన్ని శాఖల అధికారులు, కూటమి నాయకులు నరహరి, మాధవనాయుడు, చిన్నపయ్య, వెంకటరామిరెడ్డి, యు నరసింహులు, మారెప్ప, రామచంద్ర, పవన్, శ్రీనాథ్ చౌదరి, ఈసీ హరీష్, అరుణ్ కుమార్ రెడ్డి, చిన్నమంతురు పవన్, సిద్దన్న, ఉమా శంకర్, తిరుపాల్ నాయుడు, రుద్ర గ్రామస్తులు క్రిష్టప్ప, నాగరాజు, చౌడప్ప, అంజి, ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టేందుకు

# సిఎం చంద్రబాబు కుట్ర

**విజయవాడ, అక్టోబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టేందుకు సిఎం చంద్రబాబు కుట్ర పన్నారని, ఆయన ఎప్పుడు సిఎంగా ఉన్నా రైతుకు కష్టాలే వస్తున్నాయని వైసిపి మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులు చనిపోతే మద్యం తాగి చనిపోయారన్న చంద్రబాబు వ్యవసాయాన్ని ఎలా కాపాడతారని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు ఒక్కపైసా ఇవ్వలేదని వివరించారు.

విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ డ్వాక్రా మహిళల పొదుపు సొమ్ముపై చంద్రబాబు కన్ను పడిందన్నారు. పథకాల పేరుతో నిధుల మళ్లింపునకు రంగం సిద్ధం చేశారని ఆరోపించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ పెట్టి కల్యాణ లక్ష్మికి మాత్రం వడ్డీతో రుణాలిస్తున్నారని వివరించారు. ప్రభుత్వ తీరుపై మహిళల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందని విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి విమర్శించారు.

# బెజవాడకు పోటెత్తిన భక్తులు

### - 14 లక్షల మందికి పైగా దుర్గమ్మ తల్లి దర్శనం

**విజయవాడ, అక్టోబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంద్రకీలాద్రి దసరా సంబరాలకు ఈ ఏడాది భక్తులు రికార్డు స్థాయిలో తరలివస్తున్నారు. గత సంవత్సరం దసరా పది రోజుల్లో 8.94 లక్షలు, ఆ తర్వాత రెండు రోజులు వచ్చిన భవానీ భక్తులను కలిపితే .. సంఖ్య 12 లక్షలకు చేరింది. ఈ ఏడాది సోమవారం మూలానక్షత్రం రోజున వచ్చిన 1.95 లక్షల మంది, మంగళవారం శ్రీదుర్గాదేవి దర్శనానికి వచ్చిన 1.30 లక్షల మందిని కలిపితే... భక్తుల సంఖ్య తొమ్మిది రోజులకే 11 లక్షలు దాటింది. చివరి రెండు రోజుల్లో 3 లక్షల మందికి పైగా దుర్గమ్మను దర్శించుకోనున్నారు. ఈ లెక్కన దసరా ముగిసేసరికే 14 లక్షలు దాటబోతున్నారు. ఆ తర్వాత రెండు రోజులు రాజరాజేశ్వరీదేవి రూపంలోని దుర్గమ్మ దర్శనమిస్తుంది. కనీసం 3 నుంచి 4 లక్షల మంది భవానీ భక్తులు తరలిరానున్నారు. దసరా శరన్నవరాత్రుల్లో ఈ ఏడాది 18 లక్షల మంది వచ్చే అవకాశం ఉంది. దీంతో సామాన్య భక్తుల దర్శనాలలో కీలకమైన క్యూలైన్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. భక్తులకు గాలి, వెలుతురు తగిలేలా విశాలంగా క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు ఆధునిక సాంకేతికతను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. ఫేస్ రికగ్నైజేషన్, ఏఐతో అనుసంధానించి భక్తుల సంఖ్యను లెక్కించే కెమెరాలు, హెడ్‌కౌంట్ కెమెరాలు, డ్రోన్లు, లైవ్ ఫుటేజీ ఆధారంగా ఎప్పటికప్పుడు అప్రత్తమై రద్దీని నియంత్రిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీఐపీ, వీవీఐపీల దర్శనాలను మూడు గంటలకే పరిమితం చేశారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే వ్యవస్థ కూడా మంచి ఫలితాలు ఇచ్చింది.



# శ్రీమహిషాసుర మర్దినిదేవిగా దుర్గమ్మ

● నేడు పూర్ణాహుతి ● దుర్గమ్మవారికి టిటిడి పట్టువస్త్రాలు ● శ్రీరాజరాజేశ్వరి మాతగాదుర్గమ్మ ● పెరిగిన భవానీ భక్తుల రద్దీ

**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలలో భాగంగా బుధవారం నాడు శ్రీమహిషాసుర మర్ధని దేవిగా భక్తులను అనుగ్రహించారు. దుర్గమ్మవారిని బుధవారం సాయంత్రం 5 గంటలకు 85,094 వేలమంది భక్తులు దుర్గమ్మవారిని దర్శించుకున్నట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. రు.62,15,970 లక్షల ఆదాయం సమకూరిందన్నారు.

దుర్గమ్మవారికి తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవేంకటేశ్వరస్వామివార్ల తరపున బుధవారం పట్టువస్త్రాలను టిటిడి బోర్డు సభ్యులతో కలిసి ఎండోమెంట్ కమీషనర్ కె రామచంద్రమోహన్ సమర్పించగా ఇఓ వికె శీనానాయక్ దుర్గమ్మవారి తరపున పట్టువస్త్రాలను అందుకుని వారికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి దుర్గమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం, మెమొంటోలు సమర్పించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

దుర్గమ్మవారి దర్శనానికి దసరా ఉత్సవాల్లో భవానీ మాలధారుల బుధవారం ప్రారంభమైంది. పెరుగుతున్న భవానీ మాలదారులకు త్వరితంగా దర్శనం కలిగించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దుర్గమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆధ్యాత్మిక ఆనందంలో భక్తులను ఓలలాడించాయి.




దుర్గమ్మవారికి పట్టువస్త్రములు సమర్పిస్తున్న టిటిడి బోర్డ్‌సభ్యులు

దుర్గమ్మవారి ఆలయంలో విజయదశమి పర్వదినాన దసరా ఉత్సవాలకు పూర్ణాహుతి నిర్వహించి పూర్తి చేస్తారు. విజయదశమి పర్వదినాన దుర్గమ్మవారు శ్రీరాజరాజేశ్వరి దేవిగా భక్తులను అనుగ్రహిస్తారు.

### వైభవంగా నగరోత్సవం

సాయంసంధ్యాకాలంలో శ్రీ గంగాభవాని సమేత మల్లేశ్వర స్వామివార్ల నగరోత్సవం వైభవంగా జరిగింది. నగర వీధుల్లో విహారిస్తూ శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను కటాక్షించారు.

దుర్గమ్మవారిని బుధవారం శ్రీ దుర్గమ్మవారి అవతారంలో హైకోర్టు న్యాయమూర్తి వి శ్రీనివాస్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మరాజు పట్టాబి, ఎమ్మెల్యేలు వేగుళ్ళ జోగేశ్వరరావు, నన్నపనేని సదాశివరావు తదితర ప్రముఖులు దర్శించుకున్నారు.



దుర్గమ్మ దర్శనానికి భవానీ మాలదారులు పెరిగినందున, విశేషించి విజయదశమి పర్వదినాన పెరగబోయే భవానీ మాలదారులకు త్వరితంగా సేవలందించి దర్శనం త్వరగా అయ్యేలా చేయడానికి పలు చర్యలు తీసుకున్నారు. గురువారంనాడు విఐపి, ప్రోటోకాల్ దర్శనాలు రద్దు చేశామని ఇఓ వికె శీనా నాయక్ మీడియాకు తెలిపారు.



# సూర్యనారాయణస్వామి మూలవిరాట్‌ను తాకిన సూర్యకిరణాలు

**శ్రీకాకుళం, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** శ్రీకాకుళంలోని సూర్యనారాయణ స్వామి వారి దేవాలయంలో దక్షిణాయ పుణ్యకాలంలో భాగంగా బుధవారం శ్రీ సూర్యనారాయణ స్వామి వారి మూలవిరాట్‌కు సూర్యకిరణాలు తాకడం అద్భుతంగా కనిపించింది. శ్రీ సూర్య నారాయణ స్వామి వారిని బుధవారం ఉదయం బంగారు రంగు లేలేత కిరణాలు స్వామి వారి మూలవిరాట్‌ను తాకాయి. సుమారు 3 నిమిషాలు పాటు స్వామి వారి కిరణదర్శనం అద్భుతం జరిగింది. ప్రతి ఏటా మార్చి 9, 10 తేదీల్లో, అలాగే అక్టోబర్ 1, 2 తేదీల్లో సూర్యకిరణాలు స్వామి వారి మూలవిరాట్‌ను తాకడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు. అలాగే రేపు ఒక రోజు మాత్రమే స్వామి వారి కిరణస్పర్శ జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు.



# మహిషాసుర మర్దినిగా ముత్యాలమ్మ అమ్మవారు

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** ప్రముఖ శైవక్షేత్రం శ్రీకాళహస్తి పట్టణంలో గత పది రోజులుగా నిర్వహించిన దసరా మహోత్సవాలు ముగిసాయి. బుధవారం కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేసి శాంతి అభిషేకాలు నిర్వహించారు. ముత్యాలమ్మ గుడిలో వెలసిన అమ్మవారికి మహిషాసుర మర్ధిని అలంకారం జరిపారు. శ్రీకాళహస్తి పుణ్య క్షేత్రంలో బుధవారమే దశమి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలో కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారు, ముత్యాలమ్మ ఆలయం, ఏడుగంగమ్మల ఆలయం, సంతమైదానంలోని అంకాళమ్మ ఆలయం, కొత్తపేటలోని శీతలాంబ అమ్మవారు భాస్కరపేటలోని నల్లగంగమ్మల అమ్మవారు, ఉప్పువీధి, బజారువీధుల్లో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. కాగా వేడాం గ్రామంలో వెలసిన దక్షిణకాళికాదేవి కొత్తపేటలోని శీతలాంబ అమ్మవారి ఆలయంలో విశేషాలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దుర్గమ్మ కొండపైకి రెండు వైపుల మెట్ల మీద విద్యుత్ దీపాలు కనువిందుచేశాయి. కనకాచలం కొండపై వెలసిన అమ్మవారికి శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి సారె అందించారు.



# అలౌకిక ఆనందాన్ని పంచిన చతుర్వేద పారాయణ సభ

**విజయవాడ, అక్టోబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంద్రకీలాద్రి ప్రత్యేక కుంకుమార్చన మంటపంలో జరిగిన చతుర్వేద పారాయణ సభ అలౌకిక ఆనందాన్ని పంచుతూ వీనుల విందుగా సాగింది. బ్రహ్మశ్రీ చింతపల్లి ఆంజనేయ ఘనపాటి అధ్యక్షతన జరిగిన ఈ పండిత సన్మాన సభకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళ నాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 450 మంది వేద పండితులు, వేద విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దుర్గగుడి ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా దసరా మహోత్సవాలలో చతుర్వేద పారాయణ సభ జరుగుతోందని చెప్పారు. వివిధ దేవస్థానాల నుంచి వేద పండితులు ఒకచోటకు రావటం వల్ల వివిధ అంశాల గురించి చర్చించే అవకాశం లభిస్తుంది అన్నారు. దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) మాట్లాడుతూ సంస్కృతి పరిరక్షణలో వేద పండితుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం కార్య నిర్వహణ అధికారి పి. కిషోర్, 450 మంది పండితులు పాల్గొన్నారు.




సియోల్‌లో పాంగ్యోలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను సందర్శించిన మంత్రి నారాయణ, అక్కడి ప్రతినిధులు

### వ్యర్థాల నుంచి ప్రత్యామ్నాయ ఎనర్జీని రూపొందించే దిశగా


# ఎపిలో ప్రయోగాత్మక చర్యలు

**- మంత్రి నారాయణ - సియోల్‌లో పాంగ్యోలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ సందర్శన**

**విజయవాడ, అక్టోబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** వ్యర్థాల నుంచి ప్రత్యామ్నాయ ఎనర్జీని రూపొందించాలనే దిశలో ఏపీలో అనేక ప్రయోగాత్మక చర్యలు చేపట్టామని ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఈ దిశలో ఆధునీక సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ప్రణాళియుతంగా అడుగులు ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్ సమీపంలోని పాంగ్యోలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను మంత్రి నారాయణ సందర్శించారు. అక్కడ పర్యావరణ హితంగా చెత్త నుంచి విద్యుత్‌ను తయారుచేస్తున్న ప్లాంట్‌ను మంత్రి నారాయణ పరిశీలించారు. మున్సిపాల్టీల్లో ఉత్పత్తయ్యే ఘన వ్యర్థాలను 1000 డిగ్రీలకు పైగా వేడిలో తగులబెట్టి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న పాంగ్యో ప్లాంట్ పట్ల నారాయణ ఆసక్తి కనబరిచారు. ఏపీలోనూ చెత్త రహిత మున్సిపాల్టీల కోసం వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లు మరో 6 ఏర్పాటుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పాంగ్యో ప్లాంట్‌లో ఉపయోగిస్తున్న టెక్నాలజీ, విద్యుత్ తయారీ అంశాలను దక్షిణ కొరియా అధికారులు మంత్రికి వివరించారు. అంతకు ముందు కున్వా ఇంజినీరింగ్, గ్లోబల్ థీమ్ పార్క్ రిసార్ట్స్ అండ్ హోల్డింగ్స్ (జీటీఆర్ఎఫ్) ఛైర్మన్‌లతో మంత్రి భేటీ అయ్యారు. టూరిజం, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో అగ్రగామిగా ఉన్న (జీటీఆర్ఎఫ్) తమ రాష్ట్రానికి సహకరించాలని మంత్రి నారాయణ కోరారు. స్మార్ట్ సిటీల నిర్మాణం, వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లు, గ్లోబల్ థీమ్ పార్క్ డెవలప్‌మెంట్ తదితరంశాలపై చర్చ కొనసాగింది. విశాఖలో రెండు రోజులు పాటు జరిగే పారిశ్రామిక వేత్తల సదస్సుకు దక్షిణ కొరియా పెట్టుబడుదారులను మంత్రి పొంగూరు నారాయణ ఆహ్వానించారు.

# అమరావతికి హైస్పీడ్ కారిడార్!

- కోల్‌కతా -చెన్నై హైవేకి సమాంతరంగా నిర్మాణం
- కేంద్ర ప్రభుత్వం తాజా ప్రతిపాదనలు
- అమరావతి రింగ్‌రోడ్ మీదుగా వెళ్లేలా ప్రణాళిక
- హైస్పీడ్ కారిడార్‌తో అభివృద్ధికి ఊతం



**విజయవాడ, అక్టోబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరో భారీ రవాణా ప్రాజెక్ట్ రాబోతోంది. ఇప్పటికే కోల్‌కత్తా - చెన్నై జాతీయ రహదారి-16 (ఎన్‌హెచ్16) రాష్ట్రం మీదుగా నడుస్తుండగా, దీనికి సమాంతరంగా ఒక కొత్త హైస్పీడ్ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. సరకు రవాణా, వేగవంతమైన ప్రయాణానికి ప్రత్యేకంగా అనువైన ఈ ప్రాజెక్ట్ దేశంలో ఉత్తర, దక్షిణ ప్రాంతాల అనుసంధానానికి కీలకంగా మారనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోడ్లు, మౌలిక వసతుల కల్పన, హైస్పీడ్ కారిడార్లపై దృష్టిని కేంద్రీకరించింది. ఎప్పటికప్పుడూ కేంద్ర ప్రభుత్వంతో వందే భారత్ రైళ్లు పెంచడం, బుల్లెట్ రైలు అవకాశాలపై చర్చలు జరుపుతూనే రాష్ట్రంలో వీలున్నచోట హైస్పీడ్ కారిడార్ల ఏర్పాటు కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో ఏపీకి మరో హైస్పీడ్ కారిడార్ రానుంది. కోల్‌కతా- చెన్నై జాతీయ రహదారి-16 ఏపీ మీదుగా వెళ్తుండగా.. దీనికి సమాంతరంగా ఒక కొత్త హైవే నిర్మించాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఎన్‌హెచ్ 16లో వాహన రద్దీ పెరగడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొన్నిచోట్ల ఇది నాలుగు వరుసలుగా, మరికొన్ని చోట్ల ఆరు వరుసలుగా మాత్రమే ఉండటంతో వాహనాలు వేగంగా కదలలేకపోతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ కొత్త కారిడార్‌పై ఎలైన్‌మెంట్ కసరత్తును ప్రారంభించింది.

ఈ హైస్పీడ్ కారిడార్ ఖరగ్‌పూర్ నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా చెన్నై వరకు దీనిని నిర్మించనున్నారు. ఈ మార్గం ప్రకాశం, నెల్లూరు జిల్లాల మీదుగా కొనసాగి చెన్నై చేరుతుంది. విజయవాడ సమీపంలో అమరావతి ఔటర్ రింగ్ రోడ్‌తో హైస్పీడ్ కారిడార్ కలపనున్నారు. తద్వారా గుంటూరు అవతల అదే ఔటర్ రింగ్ రోడ్ నుంచి మిగిలిన భాగం కొనసాగుతుంది. ఆ మార్గాన్ని చెన్నై వరకు నిర్మించకపోయినా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు మధ్య కోల్‌కతా- చెన్నై హైవేలో కలపాలని మోర్త్ ప్లాన్ చేసింది. దీన్ని పూర్తిస్థాయిలో చెన్నై వరకు కొనసాగిస్తేనే గ్రీన్‌ఫీల్డ్‌తో పాటు, యాక్సెస్ కంట్రోల్ హైవే నిర్మాణం జరుగునుంది.

### హైస్పీడ్ కారిడార్‌తో అభివృద్ధికి ఊతం

ప్రస్తుత కోల్‌కతాచెన్నై హైవే మీద వాహనాల రద్దీ అధికంగా ఉంది. రోజురోజుకూ విపరీతంగా రద్దీ పెరుగుతుండటంతో ఈ హైవే అవసరం ఉంది. కానీ పూర్తి మార్గంలో ఆరు వరుసలు నిర్మించలేదు. కొన్ని ప్రాంతాల్లో 4 లేన్లు మాత్రమే ఉన్నాయి. దాంతో వాహనాలు వేగంగా వెళ్లే అవకాశం లేదు. ఈ కారణంతో కోల్‌కతా- చెన్నై హైవేకి సమాంతరంగా మరొక హైస్పీడ్ కారిడార్ నిర్మాణం పూర్తయితే వాహనదారులకు భారీ ఊరట కలుగుతుంది. ఈ హైవే కొత్త ప్రాంతాల మీదుగా వెళ్లడంతో అవి అభివృద్ధి చెందేందుకు అవకాశాలుంటాయి. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు 7 హైవేల మీదుగా వెళ్తుంది కనుక అభివృద్ధి జరిగేందుకు వీలుంటుంది. హైస్పీడ్ కారిడార్ అందుబాటులోకి వస్తే ఉత్తర, తూర్పు భారత్.. దక్షిణాది రాష్ట్రాలను అనుసంధానం చేస్తుందని మోర్త్ భావిస్తోంది. విజయవాడ, అమరావతి చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు హైస్పీడ్ కారిడార్ వెళ్లే సమీపం ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతుంది. కొత్త కంపెనీలు, పరిశ్రమలు వస్తాయి. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం అమరావతికి మరింత ప్రయోజనం చేకూర్చుతుంది. నెల రోజుల్లో ఈ హైస్పీడ్ కారిడార్‌పై స్పష్టత రానుంది. మోర్త్ ఉన్నతాధికారులు ప్రాజెక్టు ఎలైన్‌మెంట్ల తయారీని పరిశీలిస్తున్నారు. ఎలైన్‌మెంట్ మీద కసరత్తు పూర్తయితే ఖరగ్‌పూర్- చెన్నై హైస్పీడ్ కారిడార్ వెళ్లే రాష్ట్రాల ప్రభుత్వాలతో సమావేశమై, వారి పర్మిషన్, అభ్యంతరాలు స్వీకరించి తుది ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేయనున్నారు. ప్రాజెక్టు వ్యయం, భూసేకరణ కీలకం కానున్నాయి. అమరావతి అవుటర్ రింగ్ రోడ్‌తో అనుసంధానం కావడంతో రాష్ట్ర రాజధాని రవాణా రంగంలో ప్రధాన కేంద్రంగా మారనుంది. రాజధానిలో ఏర్పడుతున్న కొత్త సంస్థలు, పెరుగుతున్న వాహన రాకపోకలను దృష్టిలో ఉంచుకుంటే, ఈ హైస్పీడ్ కారిడార్ ప్రాజెక్ట్ రాష్ట్రానికి గేమ్‌చేంజర్‌గా మారనుంది.

ఇక మూలపేట పోర్టు నుంచి విశాఖపట్నం వరకు 165 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ కోస్టల్ కారిడార్ ప్రణాళికలో ఉంది. 6 లేదా 8 వరుసల రహదారిగా నిర్మించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఇప్పటికే డీపీఆర్ సిద్ధం చేస్తోంది. దీని అంచనా వ్యయం సుమారు రూ.8,300 కోట్లు. ఈ కోస్టల్ కారిడార్‌ను హైస్పీడ్ కారిడార్‌లో భాగం చేయాలనే ఆలోచన కేంద్రానికి ఉన్నా, తాజా ప్రణాళికల్లో మార్పులు వస్తున్నాయి. సముద్రతీరం కాకుండా, లోపల వైపు కొత్త ఎలైన్‌మెంట్ పైనే మోర్త్ దృష్టి సారించింది. ఢిల్లీలో మోర్త్ ఉన్నతాధికారులు ఎలైన్‌మెంట్ల తయారీని సమీక్షిస్తున్నారు. మరో నెలలో స్పష్టత రానుంది. తర్వాత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరిపి, వారి సమ్మతి తీసుకుని తుది రూపురేఖలు ఖరారు చేస్తారు. అప్పటికి భూసేకరణ అవసరాలు, మొత్తం వ్యయం, ప్రాజెక్ట్ నిర్మాణ సమయానికి సంబంధించి పూర్తి సమాచారం వెలువడనుంది. ఈ హైస్పీడ్ కారిడార్ అమలులోకి వస్తే వాహనదారులకు పెద్ద ఊరట లభించడమే కాకుండా, కొత్త ప్రాంతాల అభివృద్ధికి కూడా తోడ్పడనుంది. అమరావతి చుట్టూ నిర్మిస్తున్న అవుటర్ రింగ్ రోడ్ ఏకకాలంలో ఏడు జాతీయ రహదారులను కలుపుతూ రాష్ట్ర రవాణా వ్యవస్థను కొత్త దశలోకి తీసుకువెళ్తుంది. ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని అనుసంధానించే ఈ కొత్త రహదారి, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపుని తీసుకురానుంది. కేంద్రం నిర్మించబోతున్న ఈ కొత్త ప్రాజెక్ట్ ద్వారా పరిశ్రమలు, లాజిస్టిక్స్, వాణిజ్య రంగం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. సరకు రవాణాకు సమయం తగ్గి, రవాణా వ్యయాలు కూడా తగ్గుతాయి. అనేక ప్రాంతాలు ద్వారా అనుసంధానమవడంతో స్థానిక ఆర్థిక వ్యవస్థలు చురుకుగా మారతాయి. భవిష్యత్తులో ఈ కారిడార్ రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే ప్రధాన బలంగా మారనుంది.

## అక్టోబరులో బ్యాంకు సెలవులివే

**ముంబయి, అక్టోబరు 1:** గాంధీ జయంతి, దుర్గా పూజ, నవరాత్రి, దసరా వంటి ప్రధాన పండుగల కారణంగా అక్టోబర్ నెలలో బ్యాంకులు పలు చోట్ల, ఆయా సెలవు దినాల్లో పనిచేయవు. ఆయా రోజుల్లో జాతీయ, ప్రాంతీయ పండుగలు, ప్రత్యేక దినాలు, వారాంతపు సెలవుల కారణంగా బ్యాంకింగ్ సేవలు ప్రభావితమవుతాయి. అక్టోబర్‌లో దేశ వ్యాప్తంగా బ్యాంకు హాలిడేలు ఇలా ఉన్నాయి. రోజువారీ వివరాలు ఇలా ఉన్నాయి అక్టోబర్ 1 బుధవారం నవరాత్రి ముగింపు / మహా నవమి / దసరా / ఆయుధ పూజ / విజయదశమి / దుర్గా పూజ కారణంగా అగర్తలా, బెంగళూరు, భువనేశ్వర్, చెన్నై, గాంగ్‌టాక్, గువహాటి, ఇటానగర్, కాన్పూర్, కోచి, కోహిమా, కోల్‌కతా, లక్నో, పట్నా, రాంచీ, షిల్లాంగ్, తిరువనంతపురం ప్రాంతాల్లో బ్యాంకులు పనిచేయవు. అక్టోబర్ 2 గురువారం మహాత్మాగాంధీ జయంతి / దసరా / విజయ దశమి / దుర్గా పూజ / శ్రీశ్రీ శంకరదేవ జన్మోత్సవం దేశవ్యాప్తం ప్యాన్ ఇండియా సెలవు. అక్టోబర్ 3 శుక్రవారం దుర్గా పూజ గాంగ్‌టాక్ ప్రాంతాల్లో బ్యాంకులు పనిచేయవు. అక్టోబర్ 4 శనివారం దుర్గా పూజ గాంగ్‌టాక్ ప్రాంతాల్లో బ్యాంకులు పనిచేయవు. అక్టోబర్ 5 ఆదివారం వీక్లీ ఆఫ్ సండే దేశవ్యాప్తం ప్యాన్‌ఇండియా సెలవు. ఈ హాలిడేలు ఆర్‌బీఐ ద్వారా నిర్ణయించబడిన జాతీయ, ప్రాంతీయ పండుగల ఆధారంగా ఉన్నాయి. అలాగే, రెండవ, నాల్గవ శనివారాలు, ఆదివారాలు బ్యాంకులకు సెలవు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సహా ప్రధాన బ్యాంకులు ఈ రోజుల్లో పూర్తిగా మూసివేస్తారు.

## పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర

**ముంబయి, అక్టోబరు 1:** గ్యాస్ ధరలు వినియోగదారులకు షాక్ ఇచ్చాయి. పండుగ వేళ గ్యాస్ భారం స్వల్పంగా పెరిగింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరలను పెంచినట్లు చమురు మార్కెటింగ్ కంపెనీలు తాజాగా ప్రకటించాయి. 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధరను రూ.15.50 మేరకు పెంచినట్టు ప్రకటించాయి. దాంతో వాణిజ్య సిలిండర్ ధర రూ.1595.50కి పెరిగింది. కీలక పండుగలకు ముందు వాణిజ్య సిలిండర్ గ్యాస్‌పై ఎక్కువగా ఆధారపడే హోటల్స్, రెస్టారెంట్లతో పాటు పలు రంగాలను ప్రభావితం చేయనున్నది. సవరించిన రేట్ల ప్రకారం 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.15.50 పెరగ్గా ఢిల్లీలో, 19 కిలోల వాణిజ్య సిలిండర్ రూ.1,595.50 పెరిగింది. దేశ ఆర్థిక రాజధాని ముంబయి మహానగరంలో రూ.1,547, చెన్నైలో రూ.1,754, కోల్‌కతాలో రూ.1,700కి పెరిగింది. ఇక 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులు లేదు. దాంతో గృహ గ్యాస్ వినియోగదారులకు ఊరట లభించినట్లయ్యింది. ప్రస్తుతం డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర ముంబయిలో రూ.852.50, ఢిల్లీలో రూ.853, చెన్నైలో రూ.868.50, కోల్‌కతాలో రూ.879, హైదరాబాద్‌లో రూ.925గా ఉన్నది. వాస్తవానికి వాణిజ్య అవసరాల కోసం వినియోగించే సిలిండర్‌ల ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రతి నెలా ఒకటో తేదీన మార్పులు చేస్తుంటాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ పెరగడంతోనే సిలిండర్ ధర పెంచారు. తాజాగా మరోసారి ధరలు పెరగడంతో హోటల్స్, క్యాటరింగ్ సేవలు తదితర వాణిజ్య సంస్థలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందని భావిస్తున్నారు.



# రెపోరేట్లు యథాతథం!

**5.5శాతం వద్దనే కొనసాగించిన ఆర్బీఐ**

**ముంబయి, అక్టోబరు 01:** రుణ గ్రహీతలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ద్రవ్య విధాన పరపతి సమీక్షలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటును ప్రస్తుతం ఉన్న 5.5 శాతంగానే యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారంఎంపిసి నిర్ణయాలను వెల్లడించారు. దీంతో ఇప్పట్లో గృహ, వాహన, ఇతర రుణాలపై వడ్డీ రేట్లు (ఈఎంఐలు) తగ్గే అవకాశం కనిపించడం లేదు. ద్రవ్య విధానంపై తటస్థ వైఖరినే కొనసాగించాలని కమిటీ నిర్ణయించినట్లు సంజయ్ మల్హోత్రా తెలిపారు. ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడం, అదే సమయంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం మధ్య సమతుల్యత సాధించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గతంలో తీసుకున్న విధానపరమైన నిర్ణయాల పూర్తి ప్రభావం స్పష్టంగా కనిపించే వరకు వేచి చూడటం సమంజసమని భావిస్తున్నామని ఆయన వివరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటికే 100 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించామని, ఆ ప్రయోజనాలు ఇంకా ఆర్థిక వ్యవస్థకు పూర్తిగా అందాల్సి ఉందని ఆయన గుర్తుచేశారు.

మరోవైపు, దేశ ఆర్థిక భవిష్యత్తుపై ఆర్బీఐ సానుకూల అంచనాలను ప్రకటించింది. ఆహార పదార్థాల ధరలు గణనీయంగా తగ్గడం, జీఎస్టీ రేట్ల కోత వంటి కారణాలతో ద్రవ్యోల్బణం మరింత అదుపులోకి వచ్చిందని గవర్నర్ తెలిపారు. ఈ నేపథ్యంలో, 202526 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం సగటు అంచనాను గతంలోని 3.1 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గిస్తున్నట్లు వెల్లడించారు.

అదేవిధంగా, దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు అంచనాను కూడా ఆర్బీఐ పెంచింది. దేశీయంగా బలమైన గిరాకీ, అనుకూలమైన రుతుపవనాలు, ద్రవ్య విధాన సరళీకరణ వంటి అంశాల నేపథ్యంలో వృద్ధి అంచనాను 6.5 శాతం నుంచి 6.8 శాతానికి పెంచుతున్నట్లు సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు.

ప్రస్తుతం వాణిజ్యపరమైన అంశాలలో చోటుచేసుకుంటున్న పరిణామాలను కూడా నిశితంగా గమనిస్తున్నామని, అందుకే వడ్డీ రేట్ల విషయంలో వేచి చూసే ధోరణిని అవలంబిస్తున్నామని ఆయన తెలిపారు.

మరోవైపు చిన్న మొత్తాలపై వడ్డీరేటును మరోసారి యథాతథంగా ఉంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అక్టోబర్ 1 నుంచి మూడు నెలల పాటు ప్రస్తుతం ఉన్న వడ్డీరేట్లు కొనసాగనున్నాయని తెలిపింది. దీంతో చిన్న మొత్తాలపై వడ్డీరేట్లను ముట్టుకోకపోవడం ఇది ఏడోసారి కావడం విశేషం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు) చిన్న మొత్తాలపై వడ్డీరేట్లలో ఎలాంటి మార్పులు చేయడం లేదని ఆర్థిక మంత్రిత్వశాఖ తన నోటిఫికేషన్‌లో వెల్లడించింది. దీంతో సుకన్య సమృద్ధి పథకం కింద వడ్డీరేటు 8.2 శాతంగాను, అలాగే పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్(పీపీఎఫ్)పై 7.1 శాతం, పోస్టాఫీస్ పొదుపు డిపాజిట్ స్కీంపై 4 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది.

# పర్సనల్, గోల్డ్‌లోన్‌లపై ఆర్బీఐ కొత్త రూల్స్

**నిధుల సమీకరణలోనూ పలు మార్పులు**

**ముంబయి, అక్టోబరు 1:** వ్యక్తిగత రుణాలు, బంగారు పూచీకత్తు, మూలధన సేకరణ వంటి విషయాల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పలు కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ఏడు కొత్త నిబంధనలతో సర్క్యులర్ ను విడుదల చేసింది. ఈ మార్పులలో మూడు అక్టోబర్ 1 నుంచే అమల్లోకి వచ్చాయి. మిగిలిన నాలుగింటిపై ప్రజాభిప్రాయాన్ని కోరింది. ఈ క్రమంలో అక్టోబరు 1 (బుధవారం) అమల్లోకి వచ్చిన ఆర్‌బీఐ కొత్త నిబంధనలు ఇలా ఉన్నాయి. ఫ్లోటింగ్ రేట్ రుణాల విషయంలో కొన్ని ముఖ్యమైన మార్పులు జరగనున్నాయి. ఇప్పుడు మీరు ఫ్లోటింగ్ రేటు రుణం తీసుకుంటుంటే బ్యాంకులు మూడు సంవత్సరాల లాక్ ఇన్ వ్యవధికి ముందే మీ ఈఎంఐని తగ్గించొచ్చు. ఇది లోన్ తీసుకునేవారికి ప్రత్యక్షంగా మేలు చేస్తుంది. ఈఎంఐ తగ్గే అవకాశం ఉంది. అదనంగా స్థిర రేటు రుణాలపై ఉన్నవారికి ఫ్లోటింగ్ రేటుకు మారే అవకాశం ఇవ్వొచ్చు. ఇది తప్పనిసరి కాకపోయినా, బ్యాంకులు కోరుకుంటే ఈ ఆప్షన్‌ను వినియోగదారులకు ఇవ్వొచ్చు. ఇది రుణగ్రహీతలకు సరైన వడ్డీ రేటును ఎంచుకోవడాన్ని సులభతరం చేస్తుంది. ఈ రూల్ అక్టోబర్ 1నుంచే అమల్లోకి వచ్చింది. బంగారం, వెండిలోన్ల విషయంలోనూ ఆర్‌బీఐ మార్పులు చేసింది. ఇప్పుడు ఆభరణాల వ్యాపారులు మాత్రమే కాకుండా బంగారాన్ని ముడి పదార్థంగా ఉపయోగించే చిన్న వ్యాపారాలు, చేతివృత్తులవారు వంటి ఎవరైనా కూడా బ్యాంకుల నుంచి బంగారం, వెండిపై లోన్ తీసుకోవచ్చు.

బ్యాంకులు, టైర్3, టైర్4 పట్టణ సహకార బ్యాంకులు వారికి వర్కింగ్ క్యాపిటల్ రుణాలను అందిస్తాయి. ఈ నిర్ణయం చిన్న వ్యాపారాలకు మూలధనాన్ని సేకరించడానికి ఉపయోగపడుతుంది. అయితే, పెట్టుబడి లేదా ఊహాజనిత ప్రయోజనాల కోసం బంగారాన్ని కలిగి ఉన్న వ్యక్తులకు ఈ సౌకర్యం అందుబాటులో ఉండదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఈ నిబంధన కూడా బుధవారమే అమల్లోకి వచ్చేసింది. బేసెల్-3 మూలధన నిబంధనలను కూడా ఆర్‌బీఐ సవరించింది. దీని కింద విదేశాలలో జారీ చేసిన శాశ్వత రుణ అర్హత పరిమితిని పెంచింది. ఇది బ్యాంకులకు విదేశీ మార్కెట్ నుంచి టైర్1 మూలధనాన్ని సేకరించడంలో ఎక్కువ సౌలభ్యాన్ని అందిస్తుంది. ఆర్‌బీఐ గోల్డ్ మెటల్ లోన్ల(జీఎంఎల్) విషయంలో మార్పులుచేసింది. బంగారు ఆభరణాల ఎగుమతిదారులకు వర్కింగ్ క్యాపిటల్ ఫైనాన్స్‌ను సులభతరం చేస్తుంది. ఈ పథకాన్ని మరింత సరళీకరించడానికి, ఆభరణాల పరిశ్రమలోని అర్హత కలిగిన రుణగ్రహీతలను గుర్తించడానికి ఉపయోగపడుతుంది. ఆర్‌బీఐ గోల్డ్ మెటల్‌లోన్ల తిరిగి చెల్లించే వ్యవధిని 180 రోజుల నుంచి 270 రోజులకు పెంచాలని ప్రతిపాదన చేసింది. ప్రస్తుత మార్గదర్శకాలు ఆభరణాల ఎగుమతిదారులు, దేశీయ ఆభరణాల తయారీదారులకు జీఎంఎల్ పొడిగింపును అనుమతిస్తాయి.

భారతదేశంలో పనిచేస్తున్న విదేశీ బ్యాంకు శాఖల నిబంధనలకు కూడా ఆర్‌బీఐ కీలక మార్పులకు చేసింది. కొత్త నియమాలు ఇప్పుడు వాటి పెద్ద రుణ ఎక్స్‌పోజర్‌లు, ఇంటర్ గ్రూప్ లావాదేవీలకు వర్తిస్తాయని సర్క్యులర్‌లో పేర్కొంది. అలాగే క్రెడిట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టింగ్ లో కూడా మార్పులను ఆర్‌బీఐ ప్రతిపాదించింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు క్రెడిట్ బ్యూరోలకు డేటాను పదిహేను రోజులకు ఒకసారి (ప్రతి రెండు వారాలకు) సమర్పించడాన్ని తప్పనిసరి చేసింది. వేగంగా క్రెడిట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టింగ్ ఇవ్వడం వల్ల వ్యక్తుల క్రెడిట్ నివేదికలలో లోపాలను తగ్గించే అవకాశం ఉంది. అలాగే క్రెడిట్ నివేదికలోని లోపాలను సకాలంలో సరిదిద్దడానికి ఉపయోగపడుతుంది. ఇంకా గుర్తింపు ప్రక్రియను సులభతరం చేస్తూ, సీకేవైసీ నంబర్ ను ఇప్పుడు క్రెడిట్ నివేదికలో చేర్చాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది.




# మార్కెట్లకు ఆర్బీఐ బూస్ట్

**లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ**

**ముంబయి, అక్టోబరు 1:** ఆర్బీఐ తన మానిటరీ పాలసీ సమీక్షలో రెపోరేట్లను యధాతథంగా ఉంచుతున్నట్లు నిర్ణయించడంతో సెన్సెక్స్,నిఫ్టీలు లాభాల్లో ముగిసాయి. రెపోరేట్లను 5.5శాతం వద్ద యదాతథంగానే కొనసాగిస్తామని ప్రకటించింది. నిఫ్టీ 24,800 స్థాయికి ఎగువన ముగిసింది. మీడియా, ప్రైవేటు బ్యాంకులు, ఫార్మా షేర్లు,బ్యాంకులస్టాక్స్ లాభాల్లో ముగిసాయి. ఎస్అండ్‌పి బిఎస్ఇ సెన్సెక్స్ 715.69 పాయింట్లు పెరిగి 80,983.31 వద్ద స్థిరపడితే నిఫ్టీ 50 సూచీ 225.20 పాయింట్లు లాభపడి 24,836.30 పాయింట్ల వద్ద స్థిరపడింది. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.91శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.16శాతం పెరిగాయి. మార్కెట్‌పరంగా సెన్సెక్స్‌లో 2804 షేర్లు పెరిగాయి. 1346 కంపెనీలషేర్లు క్షీణించగా 141 కంపెనీల షేర్లు స్థిరంగా కొనసాగాయి. దసరా, మహాత్మాగాంధీ జయంతి కావడంతో స్టాక్ మార్కెట్లు గురువారం మూతపడనున్నాయి. అలాగే బ్యాంకులకు ఇచ్చే స్వల్పకాలిక వడ్డీరేటును కూడా 5.75శాతం వద్దనే ఉంచింది. నిఫ్టీలోమీడియా సూచీ 3.58శాతం పెరిగింది. సన్ నెట్‌వర్క్ 9.99శాతం, నజారా టెక్నాలజీస్ 9.49శాతం, పివిఆర్‌ఐనాక్స్ 2.05శాతం, జీ ఎంటర్‌టైన్‌మెంట్ 1.54శాతం, నెట్‌వర్క్ 18 మీడియా ఇన్వెస్ట్‌మెంట్స్ 0.84శాతం సరిగమ ఇండియా 0.77శాతం, హాత్‌వే కేబుల్ అండ్ డేటాకామ్ 0.71శాతం, డిబికార్ప్ 0.09శాతం చొప్పున పెరిగాయి. ఇక టిప్స్ మ్యూజిక్ మాత్రం 1.61శాతం ప్రైమ్‌ఫోకస్ 0.68శాతం చొప్పున దిగువన ముగిసాయి. ఆటోమొబైల్ విక్రయాలు ఊపందుకోవడంతో కంపెనీల షేర్లు కూడా పెరిగాయి. ఎస్కార్ట్స్ 5.64శాతం, విఎస్టీ టిల్లర్స్ ట్రాక్టర్స్ 3.82శాతం, అతుల్ ఆటో 4.05శాతం, మహీంద్ర అండ్ మహీంద్ర 1.21శాతం, హుండై మోటార్ ఇండియా 1.63శాతం, ఎస్ఎంఎల్ ఇసుజు 0.75శాతం, స్టీల్‌స్ట్రిప్స్ వీల్స్ 3.33శాతం, బజాజ్ ఆటో 0.61శాతంపెరిగాయి. హైటెక్ పైప్స్ 3.83శాతం పెరిగితే ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ 2.86శాతం పెరిగింది. రైల్‌టెల్ కార్పొరేషన్ కూడా 3.69శ్రాతం, ఎస్జీ ఫిన్‌షెర్వ్ 1.97శాతం, క్వాలిటీ పవర్ ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్స్ 2.08శాతం చొప్పున ముందుకు కదిలాయి. యూరోపియన్ షేర్లు మిశ్రమంగా ముగిసాయి. అమెరికా షట్‌డౌన్‌తో మార్కెట్లు క్షీణించాయి. ఆసియా మార్కెటు కూడా మిశ్రమంగానే ముగిసాయి. మెయిన్‌ల్యాండ్ చైనా, హాంకాంగ్‌లలో శెలవు కారణంగా మూతపడ్డాయి. జపాన్‌లో సెంట్రల్ బ్యాంకు మూడో త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది.

## 80వేల మందికి ఉద్వాసన

# సోషల్‌మీడియా సృష్టే

**టిసిఎస్ అధికార ప్రతినిధి వెల్లడి**




**న్యూఢిల్లీ, అక్టోబరు 1:** ప్రముఖ ఐటీ దిగ్గజంటిసిఎస్ లో భారీ సంఖ్యలో ఉద్యోగాల తొలగింపు జరిగిందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు కలవరం కలిగించాయి. అయితే అదేమీ లేదని టిసిఎస్ స్పష్టంచేసింది.సుమా రు 80 వేల మంది ఉద్యోగులను కంపెనీ తొలగించిందని ప్రచారం జరుగుతుండగా, ఈ వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదని టీసీఎస్ అధికారికంగా స్పష్టం చేసింది. సోహమ్ సర్కార్ అనే ఒక ఎక్స్ యూజర్ చేసిన పోస్ట్ ఈ చర్చకు దారితీసింది. టీసీఎస్ లో 15 ఏళ్లుగా పనిచేస్తున్న తన స్నేహితుడిని ఉటంకిస్తూ దాదాపు 80 వేల మంది ఉద్యోగులను రాజీనామా చేయమని కోరినట్లు ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. వీరిలో కొందరికి 18 నెలల జీతాన్ని పరిహారంగా ఇవ్వగా, మరికొందరికి కేవలం మూడు నెలల జీతంతో సరిపెట్టారని, ఇంకొందరికి ఎలాంటి పరిహారం అందలేదని ఆరోపించారు. ఈ పోస్ట్ వైరల్ కావడంతో, పలువురు నెటిజన్లు కూడా తమకు తెలిసిన వారిని కంపెనీ తొలగించిందని, ఈ సంఖ్య 40 నుంచి 50 వేల వరకు ఉండవచ్చని కామెంట్లు చేశారు. అయితే, సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారాన్ని టీసీఎస్ ప్రతినిధి తీవ్రంగా ఖండించారు. 80 వేల మందిని తొలగించారన్న వార్త పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. కాగా, ఇదే ఏడాది ఆగస్టులో 12,000 మంది ఉద్యోగులను తొలగించాల్సి వచ్చినట్లు కంపెనీ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. గత రెండేళ్లుగా జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేగంగా అభివృద్ధి చెందడమే ఐటీ రంగంలో తొలగింపులకు ప్రధాన కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. కోడింగ్ వంటి అనేక పనులను ఏఐ సులభంగా చేస్తుండటంతో కంపెనీలు తమ ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకుంటున్నాయి. ముఖ్యంగా మధ్యస్థాయి సీనియర్ ఉద్యోగులపై ఈ ప్రభావం ఎక్కువగా పడుతోంది. ఇదే తరహాలో, మరో ఐటీ దిగ్గజం యాక్సెంచర్ కూడా గత మూడు నెలల్లో సుమారు 11,000 మంది ఉద్యోగులను తొలగించినట్లు సమాచారం. ఏఐ రాకతో ఉద్యోగాలు పోతాయని భయపడకుండా, దానిని ఒక సాధనంగా వాడుకుని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని టెక్ నిపుణులు సూచిస్తున్నారు. "భారతదేశంలో అద్భుతమైన సాంకేతిక ప్రతిభ ఉంది. ఏఐ నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా వారు కంపెనీలకు మరింత విలువైన ఆస్తిగా మారవచ్చని గూగుల్ ఏఐ చీఫ్ డాక్టర్ జెఫ్ డీన్ గతంలో బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో అన్నారు. ఏఐ టెక్నాలజీని అందిపుచ్చుకున్న వారికే భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు ఉంటాయని పర్ప్లెక్సిటీ ఏఐ సహ వ్యవస్థాపకుడు అరవింద్ శ్రీనివాస్ కూడా అభిప్రాయపడ్డారు.

# ఆటోమొబైల్ సేల్స్ పతనం

**గత ఏడాదితోపోలిస్తే 13శాతం తక్కువే**



**ముంబయి, అక్టోబరు 1:** రిటైల్ ఆటోమొబైల్ సేల్స్ సెప్టెంబర్‌లో దాదాపు 13శాతం పడిపోయాయి. పండుగ సీజన్‌కు ముందు నెలాఖరు నాటికి డిమాండ్ మొదలైంది. దాంతో ఆటో కంపెనీలకు ఊరట కలగడంతో పాటు అక్టోబర్‌పై ఆశలను రేకెత్తించింది. వాహన్ పోర్టల్ డేటా ప్రకారం మొత్తం 1.51 మిలియన్ వాహనాలు నమోదయ్యాయి. గత సంవత్సరం ఇదే సమయంలో 1.74 మిలియన్ యూనిట్లతో పోలిస్తే ఇది 13.28 శాతం తగ్గింది. ఈ గణాంకాలు రిజిస్ట్రేషన్స్ మాత్రమే ప్రతిబింబిస్తాయని, పూర్తి డెలివరీల వివరాలు కొద్దిరోజుల తర్వాత మాత్రమే తెలుస్తుందని ఆటో పరిశ్రమ నిపుణులు తెలిపారు. సెప్టెంబర్ తొలి మూడువారాల్లో కొనుగోళ్లు మందగించాయి. పండుగ ఆఫర్లు, జీఎస్టీ రేట్లలో మార్పుల్లో స్పష్టత కోసం కొనుగోలుదారులు వాహనాలను కొనుగోలు చేయకుండా నిరీక్షించినట్లుగా పరిశ్రమ వర్గాలు తెలిపాయి. అదే సమయంలో పితృపక్షాలు సైతం షాపింగ్‌ను ప్రభావితం చేసిందని మార్కెట్ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ 22న నవరాత్రుల ప్రారంభం నుంచే మార్కెట్‌లో సందడి కనిపించిందని జీఎస్టీ సంస్కరణలతో ధరలు సైతం తగ్గడంతో షోరూమ్స్ సందడిగా కనిపించినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా ప్యాసింజర్ కార్లు, ద్విచక్ర వాహనాల విభాగాల షోరూమ్‌ల్లో కస్టమర్ల రద్దీ, బుకింగ్‌లు, ఎక్వైరీలు పెరిగాయి. దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి సెప్టెంబర్ 22 నుంచి 25 మధ్య కేవలం నాలుగు రోజుల్లో 75వేల వాహనాలను విక్రయించింది. మారుతి ఆగస్టు నెల మొత్తంలో సుమారు 1.35లక్షల యూనిట్లను విక్రయించింది. గత సంవత్సరం అక్టోబర్‌లో నవరాత్రి వేడుకలు ప్రారంభం కాగా.. పండుగల ప్రభావం సెప్టెంబర్‌లో కనిపించలేదు. ఈ సంవత్సరం సెప్టెంబర్ చివరి వారంలో డిమాండ్ కనిపించింది. ఇక రాబోయే నెలల్లో అమ్మకాలు జోరుగా సాగుతాయని ఆటోమొబైల్ ఇండస్ట్రీ భావిస్తున్నది. అక్టోబర్‌లో పండుగలు కొనసాగనున్నాయి. ఆ తర్వాత పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమవుతుంది. పెట్రోల్ కార్లపై 1200సీసీ వరకు, డీజిల్ కార్లపై 1500 సీసీ వరకు 18శాతానికి జీఎస్టీ తగ్గింది. అంతకంటే ఎక్కువ సీసీ కలిగిన వాహనాలపై 40శాతం.. ఇక ఎలక్ట్రికల్ వాహనాలపై కేవలం 5శాతం జీఎస్టీ పరిమితం చేయడంతో పరిశ్రమకు ఊతమిస్తుందని ఆటో ఇండస్ట్రీ భావిస్తున్నది.

# బిలియనీర్లలో టాప్ ముఖేష్ అంబాని

## ఈసారి బాలీవుడ్ బాద్‌షా షారూక్‌ఖాన్ కూడా!



**న్యూఢిల్లీ, అక్టోబరు 1:** బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ తొలిసారి బిలియనీర్ల క్లబ్‌లో చేరారు. రూ.12,490 కోట్ల నెట్‌వర్త్‌తో తొలిసారి ధనవంతుల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఇక ఈ లిస్ట్‌లో ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా పేరుగాంచిన ముకేశ్ అంబానీనే టాప్‌లో ఉన్నారు. హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025 14వ ఎడిషన్ ప్రకారం ముకేశ్ అంబానీ కుటుంబం భారత్‌లో అత్యంత సంపన్నులుగా నిలిచారు. అంబానీ ఫ్యామిలీ రూ.9.55 లక్షల కోట్లతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత గౌతమ్ అదానీ, ఆయన కుటుంబం రూ.8.15 లక్షల కోట్లతో రెండోస్థానంలో నిలిచింది. ఇక ఈ జాబితాలో రోష్ని నాదర్ మల్హోత్రా, ఆమె కుటుంబం తొలిసారి మూడోస్థానంలోకి వచ్చింది. రూ.2.84 లక్షల కోట్లతో ఆమె భారత్‌లో అత్యంత ధనవంతురాలైన మహిళగా నిలిచారు. కాగా, భారత్‌లో బిలియనీర్ల సంఖ్య పెరుగుతోందని ఈ నివేదిక సూచిస్తోంది. ప్రస్తుతం దేశంలో మొత్తం బిలియనీర్ల సంఖ్య 350 దాటింది. 13 సంవత్సరాల క్రితం ఈ జాబితా ప్రారంభమైనప్పటి నుంచి బిలియనీర్ల సంఖ్య ఆరు రెట్లు పెరిగింది. ఇక మొత్తం బిలియనీర్ల విలువ రూ.167 లక్షల కోట్లుగా ఉంది. ఇది భారత్ జీడీపీలో దాదాపు సగం. దేశంలో యువ బిలియనీర్ల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతున్నట్లు హురూన్ నివేదిక వెల్లడించింది. తాజాగా పెర్ప్లెక్సిటీ వ్యవస్థాపకుడు 31 ఏళ్ల అరవింద్ శ్రీనివాస్ రూ. 21,190 కోట్ల సంపదతో భారత్‌లోనే అతి పిన్న వయస్కుడైన బిలియనీర్‌గా నిలిచారు. భారత్‌లో బిలియనీర్ల సంఖ్యలో ముంబై అగ్రస్థానంలో నిలిచింది. ముంబై నగరంలో దాదాపు 451 మంది సంపన్న వ్యక్తులు జీవిస్తున్నారు. ఆ తర్వాత న్యూఢిల్లీలో 223, బెంగళూరులో 116 మంది అత్యంత ధనవంతులు ఉన్నారు.

# రెండువారాలపాటు టివికె విజయ్ పర్యటనలు, ర్యాలీలు వాయిదా



**చెన్నై, అక్టోబరు 1:** తమిళ నటుడు, టీవీకే అధినేత విజయ్ తన రాష్ట్రవ్యాప్త పర్యటనను వాయిదా చేసుకున్నారు. కరూర్ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది దుర్మరణం పాలై తమిళనాడులో విషాద చాయలు అలుముకున్న వేళ విజయ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ ప్రధాన కార్యాలయం తెలిపింది. చాలామంది తమ ఆత్మీయులను కోల్పోయి దుఃఖంలో ఉన్న ఈ పరిస్థితుల్లో పార్టీ అధినేత విజయ్ రాష్ట్రవ్యాప్తంగా బహిరంగసభలను రెండు వారాల పాటు వాయిదా వేసుకున్నట్లు ఎక్స్‌లో పోస్టుచేసింది. పార్టీ నాయకుడు అంగీకరించిన తర్వాత తదుపరి బహిరంగ సభలకు సంబంధించిన వివరాలను ప్రకటిస్తామని టీవీకే కేంద్ర కార్యాలయం తెలిపింది. ఈ ఘటనలో తమ తప్పిదమేమీ లేకపోయినా డీఎంకే సర్కార్ తమపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని విజయ్ ఒకవిడియో విడుదలచేస్తూ డిఎంకె సర్కారుపై విమర్శించారు. స్టాలిన్ ప్రభుత్వానికి ప్రతీకార వాంఛ ఉంటే తనను ఏమైనా చేసుకోవచ్చన్నారు. తమ పార్టీ నేతలను టార్గెట్ చేయొద్దని ప్రభుత్వాన్ని కోరారు. కరూర్ ఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. నాపై అమిత ప్రేమతో ప్రజలు ర్యాలీకి వచ్చారు. తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. త్వరలోనే కరూర్ వెళ్లి బాధితులను పరామర్శిస్తాను. వాస్తవానికి మేము ఏ తప్పు చేయకపోయినా, మాపై కేసులు పెట్టారు. నిజం త్వరలోనే బయటపడుతుంది. వాస్తవానికి ఏం జరిగిందనేది ప్రజలకు తెలుసు. కరూర్ ప్రజలు నిజం చెప్పినప్పుడు, దేవుడే వచ్చి నిజం చెప్పినట్లుగా ఉంది. వాస్తవానికి నేను ఇలాంటి పరిస్థితులను ఎప్పుడూ ఎదుర్కోలేదు. నా హృదయం ఆవేదనతో నిండిపోయింది. నేను ఇప్పటికే 5 జిల్లాల్లో ప్రచారం చేశాను. కానీ కరూర్‌లోనే ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది తాను ర్యాలీ కోసం అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. కానీ ఊహించని ఘటన జరిగింది. నేను ఎప్పుడూ ఎవరికీ అపకారం తలపెట్టలేదు. ప్రజలు నాపై చూపిస్తున్న ప్రేమకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. ఇకపై మరింత బలంగా ప్రజల్లోకి వెళ్తామని టివికె చీఫ్ విజయ్ వెల్లడించారు.



బుధవారం న్యూఢిల్లీలో జరిగిన ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల్లో తపాలా స్టాంపు విడుదల చేస్తున్న ప్రధాని మోడీ

## ఆరెస్సెస్ సంస్థ కాదు

# మహోన్నత శక్తి

## సంస్థ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోడీ

## రూ.100 నాణెం, స్మారక తపాలా స్టాంపు విడుదల

**న్యూఢిల్లీ, అక్టోబరు 1:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అనేది కేవలం ఒక సంస్థ కాదని, వ్యక్తిత్వ వికాసం ద్వారా దేశ నిర్మాణానికి పాటుపడే ఒక మహోన్నత శక్తి అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. నేను అనే అహాన్ని వీడి మనం అనే సామూహిక భావన వైపు నడిపించే స్ఫూర్తిదాయక ప్రయాణమే సంఘ్ అని ఆయన అభివర్ణించారు. ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో బుధవారం జరిగిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ కు ఎన్నో అనుబంధ సంస్థలు ఉన్నప్పటికీ, వాటన్నింటి లక్ష్యం ఒకటేనని, అదే జాతికే ప్రథమ స్థానం అని స్పష్టం చేశారు. ఏ రెండు అనుబంధ సంస్థల మధ్య వైరుధ్యాలు ఉండవని ఆయన పేర్కొన్నారు. సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ దేశ నిర్మాణం అనే బలమైన సంకల్పాన్ని తీసుకున్నారని మోదీ గుర్తుచేశారు. ప్రతి పౌరుడిలో దేశం పట్ల బాధ్యత పెరిగినప్పుడే దేశం బలోపేతం అవుతుందని ఆయన విశ్వసించారని తెలిపారు. అందుకే వ్యక్తి వికాసానికి ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. నేటికీ సంఘ్ శాఖల్లో ఈ వ్యక్తిత్వ నిర్మాణ ప్రక్రియ కనిపిస్తుందని, ఇవి శారీరక, మానసిక, సామాజిక ఎదుగుదలకు దోహదపడే పవిత్ర వేదికలని ప్రధాని అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో డాక్టర్ హెడ్గేవార్ సహా ఎందరో సంఘ్ కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారని మోదీ గుర్తు చేశారు. స్వాతంత్ర్యానంతరం కూడా సంఘ్ పై అనేక దాడులు, కుట్రలు జరిగాయని ఆయన అన్నారు. సంస్థను అణచివేసేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయని, కానీ వాటన్నింటినీ సంఘ్ ఎదుర్కొని నిలబడిందని తెలిపారు. ఎన్ని కుట్రలు పన్నినా స్వయంసేవకులు ఎన్నడూ ద్వేషానికి ప్రాధాన్యత ఇవ్వలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటోంది. ఢిల్లీలోని బీఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరుగుతున్న ఈ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.100 నాణెం, పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు.


అనంతరం మోడీ మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాలు జరుపు కొంటున్న ఆర్ఎస్ఎస్‌కు శుభాకాంక్షలు తెలి పారు. పేదల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు ఆర్ఎస్ఎస్ కృషి చేస్తోందన్నారు. అసత్యంపై సత్యం, అన్యాయంపై న్యాయం, అధర్మంపై ధర్మం గెలుస్తుందన్నారు. 'నది తన ప్రవాహంతో అనేక భూముల్లో పచ్చదనం పెంచుతుంది. నదీ ప్రవాహంలా ఆర్ఎస్ఎస్ కూడా ప్రజలకు సేవ చేస్తోంది. విద్య, వైద్యం, రైతులకు అనేక విధాలుగా సంఘ్ సేవలు అందిస్తోంది. మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తోంది. ఆర్ఎస్ఎస్ చేసే ప్రతి పనిలో నేషన్ ఫస్ట్ అనేది కనిపిస్తోంది. గతంలో సంస్థ స్ఫూర్తిని అణచివేసేందుకు తప్పుడు కేసులు బనాయించడం, నిషేధించడం వంటి అనేక ప్రయత్నాలు జరిగాయి. అయినా ఆర్ఎస్ఎస్ అన్నింటినీ తట్టుకుని నిలబడింది అని మోదీ పేర్కొన్నారు.

అనేక సవాళ్లు ఎదుర్కొ న్నప్పటికీ ఈ సంస్థ నేటికీ బలంగా నిలబడిం దన్నారు. అవిశ్రాంతంగా దేశానికి, సమాజానికి సేవ చేస్తోందన్నారు. వారి ప్రయత్నాలు దేశంపై ఉన్న భక్తి, త్యాగం, నిబద్ధతకు నిదర్శన మన్నా రు. తాజాగా విడుదల చేసిన రూ.100 నాణెం పైజాతీయచిహ్నం,మరోవైపు భారతమాత.

# కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు

## వందేమాతరం గేయం 150వ వార్షికోత్సవాల నిర్వహణ

## రబీ పంటలకు మద్దతు ధర పెంపు - కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 1:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగులకు డీఏ పెంపుతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వందేమాతరం గేయం 150వ వార్షికోత్సవాలను నిర్వహించే ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ పచ్చజెండా ఊపింది. బయోమెడికల్ రీసెర్చ్ కెరీర్ ప్రోగ్రామ్ (బీఆర్‌సీపీ)-3వ దశకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అసోంలోని ఎన్‌హెచ్-715లోని కాలిబోర్- నుమాలిగఢ్ సెక్షన్‌లోని 4 లేన్‌ల రహదారిని విస్తరించాలని, ఇందుకోసం రూ.6,957 కోట్లు కేటాయిస్తూ చేసిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదించింది. అలాగే రబీ పంటలకు మద్దతు ప్రకటించింది. పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచాలనే లక్ష్యంతో ప్రత్యేక మిషన్‌కు ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా కొత్త 57 కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను ఆమోదించింది. భారత రాజ్యాంగ సభ వందే మాతరంను భారత జాతీయ గేయంగా గుర్తించింది. వందేమాతరం గేయం 150వ వార్షికోత్సవాలను దేశవ్యాప్తంగా వైభవంగా నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో భారతీయుల్లో దేశభక్తిని పెంచడంలో ఈ గేయం పోషించిన పాత్ర గురించి ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని కేంద్రం భావిస్తోంది. దేశవ్యాప్తంగా కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేసే ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది. వీటి ఏర్పాటుకు దాదాపు రూ.5,862.55 కోట్లు అవసరం అవుతాయని సర్కారు అంచనా వేసింది. 2026-27 నుంచి తొమ్మిదేళ్లలోగా వీటి నిర్మాణ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ 57 కేంద్రీయ విద్యాలయాల్లో ఏడింటిని కేంద్ర హోంశాఖ స్పాన్సర్ చేస్తుంది. మిగతా వాటిని రాష్ట్ర ప్రభుత్వాలే స్పాన్సర్ చేయాలి. ప్రస్తుతం మనదేశంలో 1,288 కేంద్రీయ విద్యాలయాలు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేయనున్న 57 కేంద్రీయ విద్యాలయాలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో దాదాపు 20 వరకు ఉన్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. 2026-27 ఆర్థిక సంవత్సరపు మార్కెట్ సీజన్ కోసం అన్ని నిర్దేశిత రబీ పంటల కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)లను పెంచే ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. రైతులకు గిట్టుబాటు ధరను కల్పిస్తామని సర్కారు తెలిపింది. గోధుమల ఎంఎస్‌పీ క్వింటాలుకు రూ.160 మేర పెరిగింది. దీంతో క్వింటాలు గోధుమల ధర రూ.2,585కు చేరింది. కుసుమపువ్వుకు రూ. 600, కాయధాన్యాలు రూ.300 మేర మద్దతు ధర పెంచింది. ఆవాలుకు రూ.250, క్వింటాలు పప్పుధాన్యాలకు రూ.225, క్విం టాలు బార్లీకు రూ.170లు పెంపు ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదించింది. పప్పు ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో 2025-26 నుండి 2030- 31 వరకు ఐదేళ్ల కాల పరిమితితో ప్రత్యేక మిషన్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పప్పు ధాన్యాల ఉత్పత్తిని ఐదేళ్లలో 350 లక్షల టన్నులకు పెంచాలన్నదే మిషన్ లక్ష్యం. రూ.11, 440 కోట్లు పెట్టుబడి ప్రోత్సాహం అందించనుంది. విత్తనాలు, పంట కోత తర్వాత మౌలిక సదుపాయాలు, పంట ఉత్పత్తుల సేకరణను 2 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూ౦నుంది. మెరుగైన రకాలను విస్తృతంగా అందు బాటులో ఉంచడంతో పాటు 2030- 31నాటికి 370 లక్షల హెక్టార్లలో పప్పుధాన్యాలు పండించే రైతులకు 126 లక్షల క్వింటాళ్ల సర్టిఫైడ్ విత్తనాలను పంపిణీ చేస్తారు.

# రూ.40 కోట్ల కొకైన్‌తో పట్టుబడ్డ బాలీవుడ్ హీరో విశాల్ బ్రహ్మ

## సింగపూర్ నుంచి చెన్నై రాగానే పట్టుకున్న డిఆర్ఐ అధికారులు



**హైదరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** బాలీవుడ్ హీరో విశాల్ బ్రహ్మ 40 కోట్ల రూపాయల విలువ చేసే 3.7 కిలోల నాణ్యమైన కొకైన్‌తో చెన్నై అ ంతర్జాతీయ విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) అధికారులకు దొరికిపోయాడు. రెండు రోజుల క్రితం వెలుగు చూసిన ఈ ఘటన బుధవారం బహిర్గతయ్యింది. అస్సాంకు చెందిన విశాల్ బ్రహ్మ స్టూడెంట్ ఆఫ్ ద ఈయర్ 2 అనే సినిమాలో నటించి పేరు సంపాదిం చిన ఈ క్రమంలో బాలీవుడ్‌లో నటుడుగా స్థిర పడ్డాడు. అయితే కొంతకాలంగా సినీ అవకాశాలు లేక పోవడంతో డ్రగ్స్ మాఫియా ఉచ్చులో దిగాడ ని డిఆర్ఐ అధికారులకు సమాచారం అందింది. కొన్ని రోజుల క్రితం ఢిల్లీ నుంచి కాంబోడియా వెళ్లిన విశాల్ బ్రహ్మ అక్కడి నుంచి సింగపూర్‌కు వ చ్చి కొన్ని రోజులు గడిపి చెన్నై విమానాశ్రయానికి రాగా ఇతని కదలికలపై ముందుగానే డిఆర్ఐ అధికారులు నిఘా వుంచారు. విశాల్ బ్రహ్మ చెన్నై రాగానే ఒక బృందం అతన్ని అనుసరించి బయటకు వస్తుండగా గేట్ వద్ద అదుపు లోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద తెలుపు రంగులో గల 3.7 కిలోల నాణ్యమైన కొకైన్‌ను జప్తు చేశారు. ఇతని వద్ద పట్టుబడ్డ డ్రగ్స్‌ను నైజీరియా ముఠా అందజేసిందని డిఆర్ఐ అధికారులు అను మానిస్తున్నారు. సింగపూర్ నుంచి చెన్నై వచ్చాక ఈ డ్రగ్స్‌ను రైలు మార్గం ద్వారా ఢిల్లీకి చేరేలా డ్రగ్స్ ముఠా వ్యూహం రచించినట్లు డిఆర్ఐ అధికారుల విచారణలో తేలింది. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించిన అధికారులు అతన్ని కస్టడీకి కోరారు. ఇతని సెల్‌ఫోన్‌లోని నంబర్ల ఆధారంగా ఇతర నిందితుల కోసం గాలిస్తున్నారు.

# నైట్‌షిఫ్టు వర్క్‌ఫోర్స్‌కు 'కిడ్నీల్లో రాళ్లు' సమస్య!

**బీజింగ్, అక్టోబరు 1:** రాత్రిపూట ఉద్యోగాలు చేసేవారికి, ముఖ్యంగా యువతకు కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం ఎక్కువగా ఉందని ఓ తాజా అధ్యయనం హెచ్చరించింది. షిఫ్ట్ పద్ధతిలో పనిచేసే వారిలో, ముఖ్యంగా రాత్రి షిఫ్టులు చేసేవారిలో ఈ ముప్పు 15 శాతం అధికంగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. శారీరక శ్రమ తక్కువగా ఉండే ఉద్యోగాలు చేసే యువత ఈ సమస్య బారిన పడే అవకాశాలు మరింత ఎక్కువని ఈ అధ్యయన ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ వివరాలు ప్రతిష్ఠాత్మక మేయో క్లినిక్ ప్రొసీడింగ్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. రాత్రివేళల్లో పనిచేయడం వల్ల శరీర జీవ గడియారం (సర్కేడియన్ రిథమ్) దెబ్బతింటుందని, ఇదే కిడ్నీలో రాళ్లు ఏర్పడటానికి ప్రధాన కారణంగా నిలుస్తోందని అధ్యయనం పేర్కొంది. ఈ జీవ గడియారం పనితీరులో మార్పులు రావడం వల్ల జీవక్రియలు, హార్మోన్ల విడుదలలో అసమత ుల్యత ఏర్పడుతుంది. ఇది కిడ్నీల పనితీరుపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. ఈ విషయంపై అధ్యయనానికి నేతృత్వం వహించిన చైనాలోని సన్ యాట్‌సేన్ యూనివర్సిటీకి చెందిన యిన్ యాంగ్ మాట్లాడుతూ, "షిఫ్ట్ ఉద్యోగాలు కిడ్నీలో రాళ్ల ప్రమాదాన్ని పెంచుతున్నాయని మా పరిశోధనలో తేలింది. ధూమపానం, నిద్రలేమి, తగినంతగా నీళ్లు తాగకపోవడం, అధిక శరీర బరువు (బీఎంఐ) వంటి జీవనశైలి అంశాలు కూడా ఈ ముప్పును పాక్షికంగా పెంచుతున్నాయని తెలిపారు. ఈ పరిశోధన కోసం శాస్త్రవేత్తలు సుమారు 2,20,000 మందికి పైగా వ్యక్తుల ఆరోగ్య సమాచారాన్ని 13.7 సంవత్సరాల పాటు విశ్లేషించారు. ప్రపంచవ్యాప్తంగా కిడ్నీలో రాళ్ల సమస్య సర్వసాధారణంగా మారుతోందని, దీనిని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలంలో గుండె జబ్బులు, కిడ్నీ వైఫల్యం వంటి తీవ్రమైన అనారోగ్యాలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకల్లో రూ.100 నాణెం విడుదల!

**న్యూఢిల్లీ, అక్టోబరు 1:** ఆర్ఎస్ఎస్ శతవసంతాల వేడుక సందర్భంగా న్యూఢిల్లీలోజరిగిన ప్రత్యేక వేడుకల్లో ప్రధానిమోడీ రూ.100 నాణెం విడుదలచేసారు. జాతీయ చిహ్నం ఒకవైపు, భరతమాత, వరదముద్రలో ఉన్న చిత్రం ముద్రించారు. అంతేకాకుండా సింహంతోపాటుగా ఉన్న భరతమాత దీవెనలందిస్తున్న చిత్రం రెండోవైపు ముద్రించారు. ఆర్ఎస్ఎస్ స్వయం సేవకకులు ఆ విగ్రహం ముందు మోకరిల్లుతున్నట్లుగా ఆ చిత్రం ఉంది. దేశభక్తి, అంకిత భావానికి ప్రతీకగా ఈ నాణెంలో స్వయంసేవకకులు తీరు నిలిచిందని ప్రధానిమోడీ ప్రశంసించారు. జాతికి సర్వం అంకితం, జాతికోసమే నా సొంతం అంటూ ఏదీలేదన్న ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను కూడా ఈ నాణెం ప్రస్ఫుటింపచేసింది. అలాగే 1963 గణతంత్ర వేడుకల్లో ఆనాడు ఆర్ఎస్ఎస్ కార్యకర్తల భాగస్వామ్య చిత్రంతో ఉన్న పోస్టల్ స్టాంపును కూడా ప్రధాని విడుదలచేసారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలను సంఘ్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే, ఢిల్లీ సీఎం రేఖాగుప్తా, సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌లు నిర్వహణలో కొనసాగాయి. 1925లో నాగ్‌పూర్‌లో కేశవ్‌బాలిరామ్ హెగ్డేవార్ ఆధ్వ ర్యంలో ఆర్ఎస్ఎస్‌ను స్థాపించారు. అప్పటినుంచి ఆర్ఎస్ఎస్ దశదిశలా విస్తరించింది. ఒకవిధంగా చెప్పాలంటే బిజెపికిసైద్ధాంతిక గురువుగా నిలిచిందన్న నానుడి కూడా లేకపోలేదు.

# వికీపీడియాకు దీటుగా మస్క్ 'గ్రోకీపీడియా'




**న్యూయార్కు, అక్టోబరు 1:** టెక్నాలజీ ప్రపంచంలో సంచలనాలకు కేంద్ర బిందువుగా నిలిచిన ఎలాన్ మస్క్, మరో కీలక ప్రకటనచేసారు. ప్రముఖ ఆన్‌లైన్ విజ్ఞాన సర్వస్వం (ఎన్‌సైక్లోపీడియా) వికీపీడియాకు పోటీగా, అంతకంటే మెరుగైన ప్లాట్‌ఫామ్‌ను రూపొందిస్తున్నట్లు తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. 'గ్రోకీపీడియా' పేరుతో రానున్న ఈ కొత్త ఆన్‌లైన్ ఎన్‌సైక్లోపీడియాను తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్ ఎఐతో అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వికీపీడియాతో పోలిస్తే మరింత విశ్వసనీయమైన, పారదర్శకమైన, కచ్చితమైన సమాచారాన్ని అందించడమే దీని ముఖ్య ఉద్దేశమని మస్క్ పేర్కొన్నారు. తన సంస్థ అభివృద్ధి చేసిన 'గ్రోక్ ఏఐ టెక్నాలజీ'ని ఈ ప్లాట్‌ఫామ్‌లో వినియోగించనున్నారు. విశ్వాన్ని మరింత లోతుగా అర్థం చేసుకునే ప్రయత్నంలో భాగంగానే ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు ఆయన వివరించారు. మానవాళికి కృత్రిమ మేధస్సును ప్రయోజనకరంగా మార్చాలన్న తన ఆశయానికి అనుగుణంగానే గ్రోకీపీడియా ఉంటుందని భావిస్తున్నారు. అయితే, ఎలాన్ మస్క్ ప్రకటనపై ఇంటర్నెట్‌లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొందరు నెటిజన్లు ఆయన ప్రయత్నాన్ని స్వాగతిస్తుండగా, మరికొందరు విమర్శలు గుప్పిస్తున్నారు. సమాచారం కోసం గ్రోక్ ఏఐ ఇప్పటికే వికీపీడియా డేటాను ఎక్కువగా వాడుకుంటున్నప్పుడు, గ్రోకీపీడియా అంతకంటే ఎలా మెరుగ్గా ఉంటుందని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో, గ్రోకీపీడియా రాకతో ఆన్‌లైన్ సమాచార ప్రపంచంలో ఎలాంటి మార్పులు వస్తాయోనని టెక్ నిపుణులు ఆసక్తిగా గమనిస్తున్నారు. గతంలో కూడా ఒకసారి వికీపీడియాకు 100 కోట్లు డాలర్లు ఇస్తానని సరదా వ్యాఖ్యలుచేసారు. అయితే ఆపేరును 'డి కీ పీడియా'గా మార్చాలని షరతులు పెట్టారు.



# డిసెంబరు 5,6తేదీల్లో రష్యా అధ్యక్షుడు పుతిన్ పర్యటన

**న్యూఢిల్లీ, అక్టోబరు 1:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. గతేడాది మాస్కో పర్యటన సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు.. పుతిన్ భారత పర్యటనకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆయన ఇండియా టూర్ తేదీలు ఖరారైనట్లు తెలుస్తోంది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఇటీవలే రష్యాలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పుతిన్ భారత పర్యటన తేదీలు ఖరారు చేస్తున్నట్లు అప్పట్లో ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది డిసెంబర్ 5,6 తేదీల్లో పుతిన్ న్యూఢిల్లీలో పర్యటించనున్నట్లు తాజా సమాచారం. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై యుద్ధం అనంతరం ఆయన భారత్‌కు రావడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పుతిన్ భేటీ కానున్నారు. రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అమెరికా భారీగా టారిఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. ఈ టారిఫ్‌లతో అమెరికాభారత్ మధ్య దూరం పెరుగుతుండగా భారత్‌రష్యా మధ్య బంధం మరింత బలపడుతోంది. ఈ క్రమంలో పుతిన్ భారత్ పర్యటన ఆసక్తికరంగా మారింది.

# బాధితురాలిని పెళ్లి చేసుకున్నా పోక్సో కేసు రద్దు కాదు

## బాంబే హైకోర్టు సంచలన తీర్పు

**ముంబై, అక్టోబర్ 1:** బాధితురాలిని వివాహం చేసుకున్నంత మాత్రాన పోక్సో కేసు రద్దు కాదు, అత్యాచార ఆరోపణల నుంచి నిందితుడు తప్పించుకోలేడని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. వివాహం చేసుకున్నాం, బిడ్డ పుట్టింది, సంతోషంగా ఉన్నామనే కారణంతో యువకుడిపై ఉన్న అత్యాచార కేసును కొట్టేయలేమని పేర్కొంది. బాంబే హైకోర్టు నాగపూర్ బెంచ్‌కు చెందిన న్యాయమూర్తులు ఊర్మిళ జోషి ఫాల్కే, నందేశ్ దేశ్‌పాండేలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. నిందితుడు, అతని కుటుంబ సభ్యులు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. "పోక్సో చట్టం లింగబేధం లేనిది. 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్నవారి మధ్య లైంగిక కార్యకలాపాలను నేరంగా పరిగణిస్తుంది. ఈ చట్టం కింద మైనర్ల మధ్య సంబంధంలో వాస్తవ సమ్మతికి విలువ లేదు" అని హైకోర్టు స్పష్టం చేసింది. అందుకే ఈ కేసులో ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయడానికి ఇది సరైన కేసు కాదన్నారు.

# సంక్షిప్తంగా..

## గాజాలో పిల్లల తిండికోసం లైంగికదోపిడీకి గురవుతున్న మహిళలు

**గాజా, అక్టోబర్ 1:** ఇజ్రాయెల్, హమాస్ మధ్య నలిగిపోతున్న గాజా ప్రజలు అత్యంత దయనీయపరిస్థితులు ఎదుర్కొంటున్నారు. నిలువనీడ లేక తినడానికి తిండి దొరక్క మానవతాసహాయంపై ఆధారపడి బతుకీడ్చుతున్నారు. తమ పిల్లలకింత తిండిపెట్టాలని ఆరాటపడుతూ ఏదైనా ఉపాధి దొరుకుతుందేమోనని చూసే మహిళలకు మాత్రం దారుణ పరిస్థితులు ఎదురవుతున్నాయి. వారు లైంగిక దోపిడీకి గురవుతున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆరుగురు పిల్లల ప్రాణాలు ఎలా నిలబెట్టుకోవాలా అని ఎదురుచూస్తోన్న 38 ఏళ్ల మహిళకు ఎయిడ్ ఏజెన్సీలో ఉపాధి కల్పిస్తానని ఒక వ్యక్తి హామీ ఇచ్చాడు. అందుకు బదులుగా అతడు తనను ఖాళీగా ఉన్న ఒక ఇంటికి తీసుకెళ్లాడని ఆమె మీడియాకు వెల్లడించింది. అక్కడి నుంచి ఎప్పుడు బయటపడతానా అని అనుకున్నాను. తర్వాత అతడు 30 డాలర్లలకు సమానమైన నగదు ఇచ్చాడు. కానీ ఎలాంటి ఉపాధి మాత్రం దొరకలేదు అని వాపోయింది. ఇలా ఆరుగురు మహిళలు తమ గోడు వెళ్లబోసుకున్నారు.

## పరిశోధన, అభివృద్ధి బలోపేతానికి వినూత్న పర్యావరణ వ్యవస్థ :రాజ్‌నాథ్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 1:** భారతదేశంలో రక్షణరంగంలో పరిశోధన, అభివృద్ధిని బలోపేతం చేయడానికి ఒక వినూత్న పర్యావరణ వ్యవస్థను పెంపొందించనున్నట్లు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. డిఫెన్స్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ 278వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత యుద్ధాల్లో ఆధునిక సాంకేతికత బాగా పెరిగిందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ఇది మనకు ఆందోళన కలిగించే విషయమన్నారు. కొత్తగా వస్తున్న సాంకేతికతలు ఏళ్ల తరబడి పరిశోధన, అభివృద్ధి ఆధారంగా రూపొందించినవన్నారు. దీన్ని మనం కూడా అందింపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మన చుట్టూ ఉన్న పరిస్థితులు మారిపోతున్నాయని, భద్రతా అవసరాలు పెరిగిపోయాయని వ్యాఖ్యానించారు. అందుకే రక్షణ బడ్జెట్ కూడా ఏటా పెరుగుతుందని తెలిపారు. బడ్జెట్ పెరుగుదలతో దాన్ని తెలివిగా ఉపయోగించాల్సిన బాధ్యత రెట్టింపు అయిందన్నారు. ఈ సందర్భంగా సాంకేతిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మన సాంకేతికత వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు నిధులు పెంచుతున్నట్లు తెలిపారు.

## విమానంలో యుపి ఎమ్మెల్యేను దూషించిన ప్రయాణికుడు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 1:** ఢిల్లీ నుంచి లక్నో వెళుతున్న విమానం గాల్లో ఉండగా ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే రాకేశ్ ప్రతాప్‌సింగ్‌కు, ఓ ప్రయాణికుడికి మధ్య వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్యేను అసభ్య పదజాలంతో దూషించిన ప్రయాణికుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎయిరిండియాకు చెందిన విమానం ఢిల్లీ నుంచి లక్నో బయలుదేరింది. ఇదే విమానంలో అమేథీకి చెందిన గౌరీగంజ్ ఎమ్మెల్యే రాకేశ్ ప్రతాప్‌సింగ్ కూడా ఉన్నారు. సమద్ అనే ఓ ప్రయాణికుడికి, ఎమ్మెల్యేకు మధ్య వాగ్వాదం జరిగింది. సమద్ తొలుత గట్టిగా అరవడంతో ఎమ్మెల్యే జోక్యం చేసుకుని అతనికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అతడు రాకేశ్‌ను అసభ్య పదజాలంతో తిట్టడంతో పాటు ఆయనపై దురుసుగా ప్రవర్తించాడు. విమానం గాల్లో ఉండగానే ఈ ఘటన జరిగింది. దీంతో విమానయాన సిబ్బంది కలుగజేసుకుని గొడవను పరిష్కరించారు. ఇక విమానం లక్నోలో ల్యాండ్ అయిన తర్వాత ప్రయాణికుడిపై ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. దీంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసుకున్న పోలీసులు ఫతేపూర్ జిల్లాకు చెందిన సమద్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## జపాన్ ప్రజలను వేధిస్తున్న 'సుమేహారా'



**టోక్యో, అక్టోబరు 1:** జపాన్‌లో వాసన వేధింపుతో జపాన్ లో రైళ్లు, బస్సులు, కార్యాలయాలు, మాల్స్, ఇతర పబ్లిక్ ప్రదేశాలలో గాఢమైన వాసనలను ఇతరులకు అసౌకర్యంగా భావిస్తారు. దీన్ని 'సుమేహారా' అని పిలుస్తారు. ఇది 'స్మెల్ హరాస్‌మెంట్'కు సంక్షిప్త రూపం. కొంత మంది సువాసనలకు సున్నితమైన వ్యక్తులు ఉంటారు. ఇలాంటి వారు బహిరంగ ప్రదేశాల్లో తిరిగిన ప్రతిరోజూ మైగ్రేన్, వికారం, లేదా అలెర్జీలతో బాధపడుతుంటారు. అయినప్పటికీ చాలా దేశాల్లో ఇది పెద్ద సమస్య కాదు. జపాన్ వాసులు మాత్రం ఇతరుల మనోభావాలను గౌరవించడానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. ఘాటైన సువాసనలు కార్యాలయాలు, రైళ్ల ప్రదేశాల్లో మర్యాద లేని ప్రవర్తనగా భావిస్తారు.

1 -10pg 9 chel:1 -10pg 9 chel.qxd 10/1/2025 2:28 PM Page 1



## పర్వదినం

పరవళ్ళు తొక్కే కృష్ణమ్మ ఒడిన
ప్రసిద్ధ క్షేత్రంబుగా వెలసి
కరుణా కటాక్షాలు చూపే
కనకదుర్గమ్మ తల్లి !
ఇంద్రకీలాద్రి పర్వతంపై
ఇలనేలే .. మహారాణివై
ఇలవేల్పువై ... ఇష్టదైవమై
సుఖ శాంతులనిచ్చే
సర్వలోకేశ్వరి మాతా !
సింహ వాహనమెక్కి
త్రిశూలం చేబూని
మహిషుని వధియించి
మహిషాసురమర్ధినిగా
ధర్మవిజయ సంకేతమిచ్చే
పర్వదినమే ...విజయదశమి
సర్వమంగళ దేవి నమామి !!!

-బి. పాండురంగ



## మంచి మార్గంలో నడవాలన్నదే ..

గాంధీ తన జీవితంలో స్వయంగా మరియు ఇతరుల వలన జరిగిన విషయాల అనుభవం నుండి తీసు కున్న నిర్ణయాలే ఎవరికి, ఎందుకూ కూడా భయపడకుండా ఉండడం 'తల్లి తండ్రులకి అబద్ధం చెప్పి మోసం చేయొద్దు అనుకోవడం. ఎప్పుడు నిజమే చెప్పాలి అని సత్య మార్గంలో నడవడం మరియు తన తోటి వారిని కూడా ప్రోత్సహించడం, సత్యము పలకడం కోసం ఏమైనా చేయవచ్చు అని హరిశ్చంద్ర నాటకం ద్వారా తీసుకున్న నిర్ణయం, ట్రైన్‌లో తనకు జరిగిన అన్యాయం ఇంకా ఎవరికి జరుగొద్దు అని 'సత్యగ్రహ' ఉద్యమాన్ని మొదలు పెట్టడం.. ఇవన్నీ మోహన్ దాస్ కరంచంద్ గాంధీకి ఎవరు చెప్పలేరు తాను స్వయంగా తీసుకున్న నిర్ణయాలే.. మనం ఇప్పుడు ఇలా స్వాతంత్ర్యంగా జీవించడానికి కారణం. ఇప్పటికి తన మాటలు, మార్గాలు మనం అనుసరించేలా చేస్తున్నాయి. అందరు మంచి మార్గంలో నడవాలన్నదే గాంధీ కోరిక. □

# విజయీభవ అంటున్న విజయదశమి

మన భారతీయ సంప్రదాయంలో పండుగలకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. మనకి ప్రతి నెల ఏదో ఒక పండుగ వస్తూనే ఉంటుంది. ఇలా వచ్చే ప్రతి పండుగకి విశిష్టత ఉంది. ఇంత విశిష్టమైన పండుగలలో దసరా పండుగకు మన పెద్దలు పెద్దపీట వేశారనే చెప్పాలి. ఈ పండుగని దేవాలయాల్లో, ఇళ్లల్లో కూడా పిల్లలు, పెద్దలు అందరూ కలిసిమెలిసి అత్యంత వైభవంగా జరుపు కుంటారు. ఈ దసరా పండుగను ఆశ్వీజ శుద్ధ పాడ్యమి నుండి నవమి వరకు 9 రోజులు దేవీ నవరాత్రులు, పదవరోజు విజయదశమి కలిపి 'దసరా' అంటారు. ఇది ముఖ్యంగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యతనిచ్చే పండుగ. ఈ పండుగను 'నవరాత్రి, శరన్నరాత్రి అని కూడా పిలుస్తారు. మన సనాతన ధర్మంలో పురాణాల్లో విజయదశమికి అత్యంత ప్రాధాన్యత ఉంది.

దేవతలు దానవులు కలిసి పాల సముద్రానికి వెడుతున్నప్పుడు అమృత బాండము బయటకి వచ్చినటువంటి రోజు ఏదైతే ఉందో ఆ రోజే వియజదశమి. అలాగే రామాయణంలో రాముడు రావణాసురుడిని సంహరించే ముందు అమ్మవారి అనుగ్రహం పొందిన రోజు కూడా ఈ రోజే. అలాగే మహాభారతంలో అర్జునుడు శమీ వృక్షాన్ని పూజించి శమీ వృక్షం మీద దాచుకున్న ఆయుధాలన్ని తీసుకొని యుద్ధానికి బయలుదేరి కౌరవుల మీద విజయం సాధించినటువంటి రోజు. జ్యోతిష్య శాస్త్రం కూడా విజయదశమిని విజయ మూహూర్తమని అంటారు. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం



నేటికి పూజలు అందుకుంటున్నారు. ఈ రోజు ఏ వృత్తికి సంబంధించిన వారు ఆ వస్తువులకి పూజ చేయడం ఆనవాయితి. అయితే మనం కూడా విజయం సాధించాలంటే పూజ చేయాలి. ఇలా చేస్తే ఏ పనిలోనైనా విజయం సాధిస్తాం. ఈ రోజు అమ్మవారికి షడ్రసోపేతమైన భోజనం అంటేకట్టెపొంగలి, చక్కెర పొంగలి, పులిహోర, వడపప్పు, పానకం, గారెలు లాంటి పిండి వంటలు నైవేద్యంగా సమర్పించాలి. ఈ రోజు బొమ్మల కొలువు పెట్టుకొని ముత్తయిదువుల్ని పేరంటం పిలిచి వారికి వాయినాలు ఇచ్చి సత్కరిస్తే అమ్మవారు వారి రూపంలో వచ్చి ఆశీస్సులు అందజేస్తారు. ఈ

విజయదశమికి ప్రత్యేకమైన ముహూర్తంతో పనిలేదు. ఆ రోజున ఏ పని ప్రారంభించిన తప్పక విజయం సాధిస్తాము దేవీ నవరాత్రులలో తొమ్మిది రోజులు అమ్మ వారిని పూజించిన తర్వాత దశమి రోజు శ్రవణా నక్షత్రం ఉంటుంది. శ్రవణా నక్షత్రం విజయదశమి సుదినంలో రావడంతో ఏ కొత్త పని ప్రారంభించినా విజయం సాధించి ఉన్నత స్థానానికి చేరుకుంటాము. ఈ విజయదశమి రోజున జ్యోతిష్క శాస్త్ర పరంగా అమ్మవారి అనుగ్రహం పొందడానికి చాలా విశేషమైనటువంటి రోజు. ఈ పండుగని జరుపుకోవడం వెనక ఓ పురాణం గాధ ఉంది. పూర్వం మహిషాసురుడనే రాక్షసుడు ఉండేవాడు. మహిష రూపంలో పుట్టడం వల్ల అతనికి ఆ పేరు వచ్చింది. 'మహిషా' అంటే 'దున్నపోతు' అని అర్థం. అతి బలవందుడైన మహిషాసురుడికి ముల్లోకాలను జయించాలనే దుర్బుద్ధి పుట్టింది. దాంతో నిద్రాహారాలు మాని ఏళ్ళ తరబడి తపస్సు చేయడం మొదలుపెట్టాడు. ఇలా తపస్సు చేస్తే బ్రహ్మ నుంచి వరాలు పొందవచ్చు అన్న ఆలోచన కూడా ఉంది. ఇలా తపస్సు చేస్తుండగా బ్రహ్మ వరం కోరుకోమన్నాడు. ఈ ప్రపంచంలో ఏ పురుషుడి నుండి చావు ఉండకూడదని వరం అడిగాడు. బ్రహ్మ వరం ప్రసాదించాడు. ఇక రాక్షసుడు ముల్లోకాల మీద పడి ప్రజలను హింసించసాగాడు. నత్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఈ రాక్షసుడిని చంపడానికి ఉపాయం ఆలోచించారు. మహిషాసురుడి చావు ఓ స్త్రీ చేతిలో ఉంది. కాబట్టి త్రిమూర్తులు ఓ దేవతని సృష్టించారు. ఆ దేవత దుర్గామాత. మహిషాసురుడితో యుద్ధం చేయ



డానికి సిద్ధంగా ఉన్న దుర్గాదేవికి మిగతా దేవతలంతా తమ ఆయుధాలను ఇచ్చారు. దేవేంద్రుడు వజ్రాయుధాన్ని, విష్ణువు సుదర్శన చక్రాన్ని, శివుడు త్రిశూలలాన్ని.. ఇలా దేవతలంతా తమ ఆయుధాల్ని అమ్మకు అందించి అండగా నిలిచారు. ఈ ఆయుధాలు అన్నింటిని తీసుకొని సింహాన్ని వాహనంగా చేసుకుని మహిషాసురుని సంహరించడానికి వెళ్లింది. హోరాహోరీగా 9 రోజులు మహిషాసురుడితో యుద్ధం చేసి పదవరోజు మహిశాసురుడిని సంహరించింది. అప్పుడు దేవతలంతా సంబరాల జరుపుకుంటారు. ఈమహిషాసుర సంహారమే విజయదశమికి నాంది పలికింది. ఇలా సంహరించిన తర్వాత ఆశ్వీజ శుద్ధ దశమి రోజు 'రాజరాజేశ్వరి దేవి'గా దర్శనమిస్తారు. ఈ రోజు ఇచ్చా, జ్ఞాన, క్రియాశక్తులను భక్తులకు అనుగ్రహించే తల్లిగా యోగ మూర్తిగా రాజరాజేశ్వరి దేవి

విజయదశమి రోజు జమ్మి చెట్టుకి కూడా పూజలు చేస్తారు. సాధారణంగా ప్రకృతిలో ఉన్న అన్ని వృక్షాలకు ఓ ప్రత్యేకత ఉంది. అదే విధంగా 'పంచ పల్లవాలు' అని చెప్పి మఱ్రి, మామిడి, మేడి, రావి, మర్కటి అంటే జువ్వి చెట్ల ఆకులను కలశాలలో పెట్టి పూజా అనంతరం ఆ నీరుతో సంప్రోక్షణ చేయడం జరుగుతుంది. ఇలా ప్రకృతిలో లభించే అనేక వృక్షాలలో ఔషధ గుణాలు ఉంటాయి.కాబట్టి వాటికి ప్రత్యేకత ఉంది. అలాగే జమ్మి చెట్టుకి కూడా ఉంది. దీనినే 'శమీ వృక్షం' అని కూడా అంటారు. అలాగే ఈ చెట్టుని పూజించి ప్రదక్షణలు చేస్తే శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ జమ్మి వృక్షానికి ప్రదక్షిణలు చేసేప్పుడు 'శమీ శమయతే పాపం/ శమీ వినాశనీ/ అర్జునశ్య ధనుర్ధారీ/ రామస్య ప్రియదర్శినం/ 'ఇలా ఈ శ్లోకాన్ని చదువుతూ ప్రదక్షణలు చేయడం వలన ఆ జమ్మి వృక్షం యొక్క అనుగ్రహం కలిగి అన్నింటా విజయం సాధిస్తారు. అలాగే శమీ వృక్షం కనకధారలు కురిపిస్తుందని పెద్దలు చెబుతారు. దీనిని బంగారంగాకూడా భావిస్తారు. ఈ రోజున జమ్మి ఆకులను పెద్దలకు సమర్పించి వారి ఆశీస్సులు తీసుకుంటారు. ఈ ఆకులను బీరువాలో గల్లా పెట్టెలో పెట్టుకొని ధన ధాన్యాలు, సంపదలు అభివృద్ధి చెందాలని కోరుకుంటారు. ఈ విధంగా విజయదశమి రోజున ఋషి పరంపరను, పెద్దలు ఆచరిస్తున్న పద్ధతులను అందరు ఆచరిస్తూ విజయం సాధించాలని కోరుకుంటూ.. అందరికీ విజయదశమి శుభాకాంక్షలు.

- పింగళి భాగ్యలక్ష్మి

## నేటి అలంకరణ

## శ్రీ రాజరాజేశ్వరి



"అంబారౌద్రిణి భద్రకాళి బగళా జ్వాలాముఖీవైష్ణవీ
బ్రహ్మణీత్రిపురాంతకీ సురనుతాదేదీప్యమానోజ్జ్వలా
చాముండాశ్రిత రక్షపోష జననీ దాక్షాయణీ పల్లవి
చిద్రూపి పరదేవతా భగవతీ శ్రీరాజరాజేశ్వరీ"

దసరా ఉత్సవాలలో దశమి తిధిన అమ్మవారు శ్రీరాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారి రూపం శ్రీరాజరాజేశ్వరీదేవి. సకల భువన బ్రహ్మాండాలకు ఈమె ఆరాధ్యదేవత. మహాత్రిపుర సుందరిగా ఈ దేవత త్రిపురాత్రయంలో పూజలందు కుంటుంది. ఈమెను అపజయమే ఎరుగని 'అపరాజితాదేవి'గా కూడా భక్తులు పూజించే ఆచారం ఉంది. ఇంద్రకీలాద్రి ప్రత్యక్ష దేవత ఎదురుగా ఉన్న క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామికి వెనుకవైపున, దుర్గమ్మను దర్శనం చేసుకుని బయటకు వచ్చే మార్గములో రావివృక్షం క్రింద అపరాజితాదేవిగా కొలువై వుంది. ఈమె స్వప్రకాశ జ్యోతి స్వరూపిణి. కోటి సూర్య సమప్రభ. కోటి సూర్యులను ఒకసారి ఒకచోట చేర్చినంత ప్రకాశవంతంగా ఈ తల్లి వెలుగొందుతుంటుంది. పరమేశ్వరుడి వామఅంకం ఈమెకు ఆసనం. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులను ఈ మూర్తి తన భక్తులకు వరాలుగా అనుగ్రహిస్తుంది. ఈమె యోగమూర్తి. మాయా మోహిత పూరితమైన మానవ మనోచైతన్యాన్ని శ్రీరాజరాజేశ్వరీదేవి ఉద్దీపితం చేసి, మోక్ష కైవల్యాన్ని కలిగిస్తుంది. అనంత శక్తి స్వరూపమైన శ్రీచక్రానికి ఈమె అధిష్ఠాన దేవత.

**వస్త్ర అలంకారం:** ఆకుపచ్చ వర్ణ వస్త్రం

**పుష్పాలు :** సుగంధభరిత పుష్పములు

**నివేదన :** పులిహోర, బూరెలు, గారెలు

**మ ంత్రం:**" ఐం క ఏ ఈల హ్రీం, క్లీం హసకహల హ్రీం సౌః సకల హ్రీం" అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలి. శ్రీలలితా సహస్రనామం పారాయణ చేసి కుంకుమార్చన, సువాసినీ పూజ చెయ్యాలి. ఆచార శక్తి గలవారు శ్రీచక్రార్చన చేస్తే మంచిది.

- భట్టిప్రోలు నటరాజ కుమార్


## అందమైన దుర్గమ్మ నగలు



శరన్నరాత్రులు అద్వితీయమైన అందం.. అమ్మది. దసరా ఉత్సవాల్లో మాత్రమే అలంకరించే ఈ నగలతో బెజవాడ దుర్గమ్మ అందం రెట్టింపవుతుంది. సర్వకవచం, అభయముద్రలు, త్రిశూలంతో సర్వకవచాలంకృత దుర్గాదేవి మెరిసిపోతుంటే, బాల త్రిపుర సుందరీదేవి బంగారు కిరీటం, ముత్యాల హారాలతో మురిసిపోతుంది. ఇక సరస్వతీదేవి రూపం, బంగారు వీణ, పగడాల హారం, వడ్డాణంతో చూడ్డానికి రెండు కళ్లూ సరిపోవు. కాసులపేరు పూలజడ ఏ రూపానికైనా ఒదిగిపోతాయి.
















## తెలుసుకుందాం..

మగవారితతో పోలిస్తే ఆడవారిలో భావోద్వేగాలతో కూడిన పీడకలలు ఎక్కువగా వస్తాయని పరిశోధకులు చెబుతున్నాయి. ఆందోళన, అణచిన భావోద్వేగాలు, హార్మోన్లలో హెచ్చుతగ్గులే ఇందుకు కారణం. అంతేకాదు, అమ్మాయిలకు తమ కలల్ని గుర్తుంచుకునే సామర్థ్యమూ ఎక్కువేనట. □

## వ్యథ

## ఆత్మ న్యూనత అసలు కారణం !



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

**ప్రశ్న:** మా అమ్మాయి అకారణంగా బాధ పడుతోంది. మంచి మాట చెప్పిన విమర్శగా భావిస్తోంది. వారం క్రితం ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. ఎలాంటి సమస్యలు లోపాలు లేకున్నా ఆమె ఎందుకు అలా ప్రవర్తిస్తోందో అర్థం కావడం లేదు. ఆమె వయస్సు 17 ఏళ్ళు. ఇంటర్ చదువుతోంది ఎలాగైనా డాక్టరు కావాలన్న లక్ష్యంతో బైపిసి గ్రూపు తీసుకొంది. ఆమె లక్ష్యం నెరవేరాలన్న ఉద్దేశ్యంతో పేరున్న కాలేజీలో చేర్పించాము. అక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయి. హాస్టల్లో కూడ మంచి వసతులు సమకూరు స్తున్నారు. కాలేజీలో నిష్ణాతులైన లెక్చరర్లు అన్నారు. ఆమె మార్కుల పరంగా టాప్ టెన్‌లో ఉంది. చాల పట్టుదలగా చదువుతోంది. రాత్రి ఒంటిగంట ఒక్కోసారి రెండు గంటల వరకు చదువుతుంది. మళ్ళీ ఉదయం ఆరు గంటలకు లేచి చదవడం ప్రారంభిస్తుంది. శారీరకంగా ఆరోగ్యంగా ఉంది మా అన్న కొడుకు, కూతురు ఇద్దరు డాక్టర్లే. అలాగే మా బంధువులలో మరికొందరు డాక్టరుఉన్నారు. చిన్నప్పటి నుంచి వారిని ఆదర్శంగా తీసుకుని ఎదగమని చెప్పేవాళ్ళం. దీనితో ఆమె కూడ డాక్టర్ కావాలన్న లక్ష్యం ఏర్పరచుకున్నది. చిన్నప్పటి నుంచి ఇల్లు,పుస్తకాలే లోకంగా పెరిగింది. చిన్నప్పుడు మా అత్తగారు ఆమెకు ఎక్కువ నియమనిబంధనలు, ఆచార వ్యహారాలు గూర్చి చెప్పేది. ఎవరంటే వారితో కలువకూడదని జాగ్రత్తలు చెప్పేది. దీనివల్ల ఆమె ఈడు పిల్లలతో కలవడం బాగా తగ్గించివేసింది. ఇంటికి బంధులు వచ్చినా సరిగా కలవదు. నలుగురితో కలసి సరదాగాగడపడం ఆమెకు తెలియదు. కొత్తవారిని చూస్తే సిగ్గు బిడియం ఎక్కువ. చాలా సున్నితమైన మనస్తత్వం అనే చెప్పాలి. అయితే ఇప్పుడు ఎందుకు బాధపడుతున్నదో అర్థంకావడం లేదు. అడిగితే ఏమి లేదని చెపుతుంది. ఏమి లేకపోతే ఆత్మహత్య చేసుకోవాలన్న భావం ఎందుకు కలిగిందంటే జవాబు చెప్పదు. ఈ స్థితిలో ఉన్న ఆమెలో ఆత్మవిశ్వాసం నింపే మార్గం. గూర్చి చెప్పండి కౌన్సెలింగ్ చేయిసేనత మార్పు వస్తుందేమో తెలపండి.

- ఒక సోదరి, విశాఖపట్నం.



**జవాబు:** అమ్మా మీరు అందించిన వివరాలను విశ్లేషిసేనత మీ అమ్మాయిలో ఆత్మమ్యానత భావం ఎక్కువగా ఉంది. బయటి వారితో కలసి భావాలు పంచుకుంటే బాధలు ఉద్వేగాలు ఉపశమిస్తాయి. అయితే ఆమె తనలో తాను కుమిలిఓవడం అలవాటు చేసుకున్నది. ఎదుటివారితో పోల్చుకుని తనను తాను తక్కువగా భావించడం అలవాటు చేసుకున్నది. ఇందుకు ఈ అత్త, మీరు కూడా కారణమే. మీ మాటలు ఆమెలో ప్రేరణ కలినపంచడంతో పాటు పోల్చుకోవడం అలవాటు చేశ్యాయి. ఆమె లక్ష్యం ఉన్నతమైనది స్థైర్యం చాలా అవసరం. లక్ష్య సాధనలో ఎదురయ్యే ప్రతి బంధకాలు, ఒత్తిడిని ఎదుర్కోవడం చాలా అవసరం. ఆమె లక్ష్యం సాధజంచే మార్గాలు అన్వేషించడం కంటే విఫలం అయితే జరిగే ప్రతికూల పరిస్థితులను ఎక్కువగా ఆలోచిసునతన్నట్టు భావించాలి. దీనికితోడు ఆమె నిద్రలేమి వల్ల తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నది. రోజుకు నాలుగైదు గంటలు నిద్ర పోతేచాలు. అనుకునే వారు తప్పకుండా మానసిక రుగ్మతలకు గురవుతారు. నిద్రలేమి వల్ల ఒత్తిడిని కలిగించే రసాయనాలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. దీర్ఘకలిక ఒత్తిడి డిప్రెషన్‌కు దారి తీసి ఆత్మహత్యా భావాలు కలిగేలా చేస్తాయి. కాబట్టి మొదట ఆమెలో ఆత్మ విశ్వాసం పెంచి, ఒత్తిడిని అధికగమించే మార్గాలు నేర్పండి. నలుగురితో కలవడం, ఓటమిని ఎదుర్కోవడం అలవాటు చేయండి. తగినంత నిద్ర పోయేలా చూడండి. కౌన్సెలింగ్ చేయించడం మంచిదని గుర్తించండి. □

## ఫోన్ సమయం తినేస్తుంది !



ఉదయాన్నే స్నేహితురాలి ఫోన్..నిన్న ఆఫీసులోని తమ విభాగంలో జరిగిన విషయాలన్నీ పూస గుచ్చినట్లు చెబుతోంది. ఆసక్తితో వింటూ పనిచేస్తుంటే ఎంతకీ తెమలదే! పనంతా పూర్తయ్యింది ఇక, రెడీ అవ్వడమే మిగిలింది.. కాసేపు విశ్రాంతి పేరుతో ఫోన్ పట్టుకుంటే చాలు..రీల్స్, షార్ట్స్ అంటూ సమయం గడిచిపోయింది. తీరా ఆఫీసుకు బయలుదేరేటప్పుడు హడావుడి. ఈ రెండు సందర్భాలే కాదు.. ఫోన్ మితిమీరి వాడటం వల్ల వచ్చే ఇబ్బందులు చాలానే ఉంటాయి. ఈ రోజుల్లో మొబైల్ అరచేతిలో ప్రపంచాన్ని చూపించేస్తుంది. కానీ, దాన్ని సరైన దారిలో వాడకపోయినా, నియంత్రించుకునే మార్గం తెలియకపోయినా విలువైన సమయమెంతో వృథా అవుతుంది. అలాకాకూడదంటే.. ఇతర పనులకు టైమ్ కేటాయించినట్లే ఫోన్ మాట్లాడేందుకు నిర్దేశించుకోమంటున్నారు. నిపుణులు. డెస్క్‌టాప్ మీద తప్ప మొబైల్‌లో సామాజిక మాధ్యమాలను లాగిన్ అవ్వొద్దని చెబుతున్నారు. అలానే భోజనం చేసేటప్పుడు, నిద్రపోయేటప్పుడు డిజిటల్ తెరలకు దూరంగా ఉండటం తప్పనిసరి. ఇక, అలారం కోసమనో, టైమ్ చూసుకునేందుకనో ఫోన్ మీద ఆధారపడుతుంటే నెమ్మదిగా ఆ పని మానేయండి. గడియారంలోనో, స్మార్ట్ ఫోన్‌లోనో రిమైండర్ పెట్టుకోండి. ఇవన్నీమీ పనుల వేగం పెంచుతాయి. ప్రయత్నించి చూడండి. □

## అప్పుడే దగ్గరవుతారు!

పొద్దున్న లేచింది మొదలు..ఎవరి హడావిడిలో వాళ్లుంటాం. ఒకే ఇంట్లో ఉంటున్నా ఒకరితో మరొకరం మాట్లాడుకునే టైమే ఉండదు ఒక్కోసారి. ఈ హడావిడిలో పిల్లలతో గడిపే సమయం కూడా ఉండదు. అయితే ఇలాగే ఉంటే పిల్లలకు, పేరెంట్స్‌కు మధ్య దూరం పెరిగిపోతుందంటున్నారునిపుణులు. ఈ క్రమంలో ప్రతి రోజూ ఓ నియమం పెట్టుకున్నట్లుగా పిల్లల కోసం సమయం కేటాయించాలని సూచిస్తున్నారు. ఉదయం లేవగానే హడావిడిలో పడిపోకుండా పిల్లలు, తల్లిదండ్రులు, ఒకరికొకరు గుడ్‌మార్నింగ్ చెప్పుకోవడం, ఈ క్రమంలోన పెద్దలు పిల్లలకు ఓ ముద్దూ ఓ హగ్గూ ఇవ్వడం,రాత్రి పడుకునే ముందు గుడ్‌నైట్ చెప్పుకోవడం..వంటివిరోజువారీ అలవాట్లుగా మార్చుకోవాలంటున్నారు నిపుణులు.

★ ఇంటి పనులు, వంట పనులు, ఇల్లు శుభ్రం చేయడం..వంటి పనుల్లో మీతో పాటు మీ పిల్లల్నీ భాగం చేయడం వల్ల ఇద్దరూ కలిసి మరింత ఎక్కువ సమయం గడపవచ్చు. మీరు వ్యాయామం చేసేటప్పుడు వాకింగ్/జాగింగ్‌కి బయటికి వెళ్లేటప్పుడు మీ పిల్లల్నీ మీతో పాటు కలుపుకోండి. తద్వారా వారి శరీరానికీ వ్యాయామం అందుతుంది. ఒకరికొకరు మరింత దగ్గరవ్వచ్చు.



★ పేరెంట్స్-పిల్లల మధ్య అనుబంధాన్ని పెంచడంలో ఆటలూ కీలక పాత్ర పోషిస్తాయంటున్నారు నిపుణులు. అందుకే పిల్లలతో ఆటలా? అనుకోకుండా వీలు చిక్కినప్పుడల్లా వారితో సరదాగా ఆడుకోవడం/వారిని ఆడించడంలో తప్పులేదు.

★ పిల్లలకెందుకు ఈ పనులు? అనుకోకుండా గార్డెనింగ్.. మొదలైన వాటిలో పిల్లలనూ భాగం చేయడం వల్ల వారికి మంచి అలవాట్లు అలవడడంతోపాటు ఇద్దరూ కలిసి కాసేపు సమయం గడిపినట్లూ ఉంటుంది. ఇలా ఆలోచిస్తే పేరెంట్స్ పిల్లలు కలిసి చేసే పనులు, అనుబంధాన్ని దగ్గర చేసుకునే మార్గాలు బోలెడుంటాయి. మరి పాటిస్తారుకదూ ! □



## గ్రాండ్ చెస్ టూర్‌లో..
# ప్రజ్ఞానంద ఓటమి

**న్యూఢిల్లీ:** గ్రాండ్ చెస్ టూర్–2025 సెమీస్‌లో భారత్ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద రమేష్‌బాబు ఓడిపోయాడు. తదుపరి మూడో స్థానం కోసం పోటీపడనున్నాడు. గ్రాండ్ చెస్ టూర్ ఫైనల్స్‌కు అర్హత సాధించిన ఏకైక భారతీయుడు ప్రజ్ఞానంద బుధవారం జరిగిన సెమీఫైనల్ టైబ్రేక్‌లో మాక్సిమ్ వాచియర్‌లాగ్రేవ్ చేతిలో పరాజయం చెందాడు. రెండు క్లాసికల్ గేమ్‌లు డ్రాగా ముగియడంతో, ప్రజ్ఞానంద, వాచియర్‌లాగ్రేవ్, రాపిడ్, బ్లిట్జ్ టైబ్రేక్‌లలో తలపడ్డారు. 20 ఏళ్ల ప్రజ్ఞానంద రాపిడ్ టైమ్ కంట్రోల్‌లో వెనుకబడి, మరింత అనుభవజ్ఞుడైన ప్రత్యర్థి చేతిలో 2–6 తేడాతో ఓడిపోయాడు. బ్లిట్జ్ గేమ్‌లలో ప్రజ్ఞానంద తిరిగి పోరాడటానికి ప్రయత్నించినా వాచియర్‌లాగ్రేవ్‌ను అధిగమించలేకపోయాడు. తరువాతి హోల్డ్ 3–3తో డ్రాగా ముగిసింది. చివరికి మ్యాచ్ స్కోరు 15–11తో వాచియర్‌లాగ్రేవ్‌కు అనుకూలంగా ఉంది. ఇక మూడవ స్థానం కోసం జరిగే మ్యాచ్‌లో ప్రజ్ఞానంద గ్రాండ్ మాస్టర్ లెవాన్ అరోనియన్‌తో తలపడనున్నాడు. ఉత్కంఠభరితమైన టైబ్రేక్ పోరు తర్వాత మరో సెమీఫైనల్లో అరోనియన్ 12–14 తేడాతో ఓడిపోయాడు.




## వరల్డ్ కప్ ఎయిర్ రైఫిల్‌లో..
# భారత్‌కు స్వర్ణం, రజతం, కాంస్యం

**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ 2025లో భారత్ ఆధిపత్యం కొనసాగుతోంది, ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్‌లో భారత్ ఖాతాలో స్వర్ణంతో సహా మూడు పతకాలు జమయ్యాయి. దీంతో ఇప్పుడు 23 పతకాలతో (7 స్వర్ణాలు, 9 రజతాలు మరియు 7 కాంస్యాలు) అగ్రస్థానంలో ఉంది. డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన ప్రపంచ కప్ రైఫిల్/పిస్టల్/షాట్‌గన్‌లో భారత్ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్‌లో స్వర్ణం, రజతం మరియు పురుషుల ట్రాప్‌లో కాంస్యం సాధించింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌లో ఉత్కంఠభరితంగా జరిగిన అఖిల భారత పోటీలో, ఇషా అనిల్ తక్సాలే మరియు హిమాన్షు అసాధారణ పునరాగమనం చేసి, స్వదేశీయులైన శాంభవి ఎస్. క్షీర్‌సాగర్ మరియు నరెయిన్ ప్రణవ్‌లను 17–15తో ఓడించి స్వర్ణం గెలుచుకున్నారు. 15–9తో వెనుకబడిన ఈ జంట, వరుసగా నాలుగు సిరీస్‌లను గెలుచుకోవడం ద్వారా పుంజుకుంది, బహుళ పరిపూర్ణ 10.9 షాట్‌లతో అద్భుతమైన ఖచ్చితత్వాన్ని ప్రదర్శించింది. వ్యక్తిగత తటస్థ అథ్లెట్లు వర్వారా కర్దకోవా మరియు కమిల్ నురియాఖ్మెటోవ్‌లకు కాంస్యం లభించింది, వారు మరియా క్రుగ్లోవా, టిమోఫీ అలీనికోవ్‌లను 17–9తో ఓడించారు. ఇక ట్రాప్ ఈవెంట్లలో, పురుషుల జూనియర్ ఫైనల్లో వినయ్ ప్రతాప్ సింగ్ చంద్రవత్ 34 హిట్స్‌తో కాంస్యం సాధించింది.

# రాయల్ ఛాలెంజర్స్ ఫర్ సేల్

## ఫ్రాంచైజీ అమ్మకానికి డిసైడ్.. ఐపిఎల్ సాధించినా కష్టాల్లో యాజమాన్యం



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టుకు 2025 సంవత్సరం ఆనందాన్ని నింపినప్పటికీ, అదే స్థాయిలో విషాదాన్ని కలిగించింది. ఈ సంవత్సరం ఐపీఎల్‌లో ఆర్సీబీ జట్టు అదరగొట్టింది. ఐపీఎల్ ప్రారంభ సీజన్ నుంచి ఆర్సీబీ ట్రోఫీని గెలవలేదు. ఆ జట్టు తొలిసారి ఈ ఏడాది ఐపీఎల్ 2025 ట్రోఫీని కైవసం చేసుకుంది. అదే సమయంలో ఆ జట్టు ఓ అత్యంత విషాద ఘటనను ఎదుర్కొంది. ఆర్సీబీ జట్టు ఐపీఎల్ విజేతగా నిలిచిన తరువాత బెంగళూరులో నిర్వహించిన ర్యాలీలో తొక్కిసలాట చోటు చేసుకొని 11 మంది మరణించారు. అనేక మంది గాయపడ్డారు. ఈ ఘటన తరువాత ఆ జట్టు యాజమాన్యం అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఆర్సీబీ ఫ్రాంచైజీని విక్రయించేందుకు యాజమాన్యం సిద్ధమైందని తెలుస్తోంది. ఆర్సీబీ యాజమాన్యం తమ బ్యాలెన్స్ షీట్ నుంచి ఫ్రాంచైజీని తొలగించడంపై తుది నిర్ణయం తీసుకుందని మాజీ ఐపీఎల్ చైర్మన్ లలిత్ మోదీ సోషల్ మీడియా వేదికగా సంచలన పోస్టు చేశారు. దీనికి సంబంధించి డాక్యుమెంట్స్ పూర్తయ్యాయని, కొనేవారు ఉంటే కచ్చితంగా ఆ ఫ్రాంచైజీ ఓనర్లు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన పోస్టు పెట్టారు. లలిత్ మోదీ పేర్కొన్న వివరాల ప్రకారం ఆర్సీబీ ఫ్రాంచైజీ అమ్మకం గురించి గతంలో అనేకసార్లు పుకార్లు వచ్చాయి. వాటిని యాజమాన్యం ఖండించింది.





# చరిత్ర సృష్టించిన నేపాల్
## వెస్టిండీస్‌పై సిరీస్ విజయం

**న్యూఢిల్లీ:** పసికూన నేపాల్ జట్టు చరిత్ర సృష్టించింది. రెండు సార్లు టీ20 ఛాంపియన్లు అయిన వెస్టిండీస్ పై తొలిసారి సిరీస్ విజయాన్ని నమోదు చేసింది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే కైవసం చేసుకుంది. ఐసీసీ టెస్టు ఆడుతున్న దేశాలపై ఓ ద్వైపాక్షిక సిరీస్‌ను గెలుచుకోవడం నేపాల్‌కు ఇదే తొలిసారి కావడం గమనార్హం. షార్జా వేదికగా జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో నేపాల్ తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు సాధించింది. నేపాల్ బ్యాటర్లలో ఆసిఫ్ షేక్ (68; 47 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లు), సందీప్ జోరా (63; 39 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపు హాఫ్ సెంచరీలు సాధించారు. విండీస్ బౌలర్లలో అకేల్ హోసేన్, కైల్ మేయర్స్ లు చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 174 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ 17.1 ఓవర్లలో 83 పరుగులకే ఆలౌటైంది. దీంతో విండీస్ 90 పరుగుల తేడాతో నేపాల్ విజయాన్ని అందుకుంది. విండీస్ బ్యాటర్లలో జేసన్ హోల్డర్ (17), అమీర్ జాంగో (16), అకీమ్ అగస్టే (17)లు రెండు అంకెల స్కోరు సాధించారు. మిగిలిన వారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యారు.

## ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో
# రోహిత్‌కు రజతం, శ్రీహరికి ఐదవ కాంస్యం



**న్యూఢిల్లీ:** 2025 ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో రోహిత్ బెనెడిక్టన్ రజతం గెలుచుకోగా, కాంస్యంతో శ్రీహరి నటరాజ్ ఐదవ పతకాన్ని సాధించాడు. వీర్ సావర్కర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న 2025 ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్‌ల మూడవ రోజు బుధవారం శ్రీహరి నటరాజ్ మరోసారి భారతదేశం తరపున పతకంతో నిలిచాడు. పురుషుల 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో కాంస్యం సాధించి, తన పతకాల సంఖ్యను ఐదుకు పెంచుకున్నాడు. అలాగే పురుషుల 50 మీటర్ల బటర్‌ఫ్లైలో రోహిత్ బెనెడిక్టన్ 23.89 సెకన్లలో ఉత్తమ భారతీయ సమయంతో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఐదవ లేన్‌లో డ్రా అయిన శ్రీహరి తన రేసును తెలివిగా ముందుకు తీసుకెళ్లాడు. చైనాకు చెందిన హావోయు వాంగ్ (49.19) మరియు ఖతార్‌కు చెందిన అలీ టామర్ హసన్ (49.46) ముందు ఉండగా, అతను 50 మీటర్ల మార్కు వద్ద మూడవ స్థానంలో నిలిచాడు. ఆకాష్ మణి (50.45) నాల్గవ స్థానంలో నిలిచాడు. చివరి 50 మీటర్ల స్ప్రింట్‌లో, శ్రీహరి తన లయను కొనసాగిస్తూ, చేజింగ్ ప్యాక్‌ను నిలబెట్టుకుని 49.96 సెకన్లలో కాంస్యం సాధించాడు.

# 'మటన్ సూప్' టీజర్ లాంచ్

**క్రేజీ టైటిల్,** డిఫరెంట్ స్టోరీతో రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు బ్యానర్లపై రమణ్, వర్షా విశ్వనాథ్ హీరో హీరోయిన్లుగా రామచంద్ర వట్టికూటి తెరకెక్కించిన చిత్రం 'మటన్ సూప్'. 'విట్‌నెస్ ది రియల్ క్రైమ్' ట్యాగ్ లైన్. మల్లిఖార్జున ఎలికా (గోపాల్), రామకృష్ణ సనపల, అరుణ్ చంద్ర వట్టికూటి నిర్మాతలుగా రానున్న ఈ నూతన చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్, మోషన్ పోస్టర్, పాటలు ఇప్పటికే సోషల్ మీడియాలో అందరినీ ఆకట్టుకున్నాయి. దసరా సందర్భంగా 'మటన్ సూప్' టీజర్‌ను సెన్సేషనల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. ఈ టీజర్‌ను లాంఛ్ చేసిన అనంతరం అనిల్ రావిపూడి మాట్లాడుతూ..'మటన్ సూప్' టైటిల్ చాలా బాగుంది. టీజర్ బాగుంది. టీం కూడా చాలా కొత్తగా ఉంది. దర్శకుడు రామచంద్రకు, హీరో రమణ్‌కు, సినిమా టీంకు ఆల్ ది బెస్ట్. అక్టోబర్ 10న చిత్రం రాబోతోంది. అందరూ చూసి పెద్ద సక్సెస్ చేయాలి' అని అన్నారు.



నిర్మాత మల్లిఖార్జున ఎలికా (గోపాల్) మాట్లాడుతూ.. 'గ్రేట్ డైరెక్టర్ అనిల్ రావిపూడి గారు మా టీజర్‌ను లాంఛ్ చేయడం ఆనందంగా ఉంది. మంచి స్క్రీన్ ప్లేతో మా చిత్రం రాబోతోంది. అందరూ వీక్షించి సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను' అని అన్నారు. దర్శకుడు రామచంద్ర వట్టికూటి మాట్లాడుతూ.. ' సెన్సేషనల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి గారు మా టీజర్‌ను లాంఛ్ చేయడం మా అదృష్టం. మా నిర్మాతలు నాకు ఎంతో అండగా నిలిచారు. రమణ్ గారు ఎంతో గొప్పగా నటించారు. మా అందరినీ ముందుండి నడిపిస్తున్న పర్వతనేని రాంబాబు గారికి థాంక్స్. గొప్పగా నటించిన గోవింద్, జెమినీ సురేష్ గార్లకు థాంక్స్. నాకు అండగా నిలిచిన సునీత అక్కకి థాంక్స్. మా సినిమాకు అందరూ చూసి సపోర్ట్ చేయాలని, పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. నిర్మాతలు రామకృష్ణ సనపల, అరుణ్ చంద్ర వట్టికూటి మాట్లాడుతూ..'మా మటన్ సూప్ టీజర్‌ను విడుదల చేసిన అనీల్ రావిపూడి గారికి థాంక్స్. ట్రెండ్‌కు తగ్గ కథ. అన్నీ వర్గాల ప్రేక్షకులను మెప్పించే సినిమా అవుతుంది. దర్శకుడు రామచంద్ర సినిమాను చక్కగా తెరకెక్కించారు. హీరో రమణ్, వర్షా విశ్వనాథ్, జెమినీ సురేష్ సహా అందరి పెర్ఫామెన్స్ మెప్పిస్తుంది. సినిమాను అక్టోబర్ 10న రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నాం' అన్నారు.

హీరో రమణ్ మాట్లాడుతూ.. 'మటన్ సూప్' టీజర్‌ను లాంచ్ చేసిన గ్రేట్ డైరెక్టర్ అనిల్ రావిపూడి గారికి థాంక్స్. మా దర్శక, నిర్మాతలు ఎంతో కష్టపడి ఈ మూవీని రూపొందించారు. టీజర్ చాలా బాగుందని అందరూ మెచ్చుకుంటున్నారు. అక్టోబర్ 10న రాబోతోన్న మా మూవీని అందరూ చూసి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

# 'మన శంకరవరప్రసాద్ గారు' నుంచి నయనతార ఫస్ట్ లుక్ రిలీజ్



**మెగాస్టార్ చిరంజీవి,** హిట్ మెషిన్ అనిల్ రావిపూడి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకరవరప్రసాద్ గారు'లో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. శశిరేఖగా ది మాగ్నిఫిసెంట్ నయనతారను పరిచయం చేస్తూ, మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పసుపు రంగు చీరలో మెరిసిపోతూ కనిపించిన ఆమె లుక్ అదిరిపోయింది. ముత్యాల హారం, సంప్రదాయ గాజులతో, చేతిలో నలుపు రంగు హ్యాండిల్‌తో ఉన్న గొడుగును పట్టుకొని, ఫెస్టివల్ వైబ్ కనిపించిన ఈ లుక్ శశిరేఖ పాత్రకు గొప్ప సొగసుని తీసుకొచ్చింది. నయనతార పాత్ర కథలో చాలా కీలకంగా ఉండబోతోంది. ఆసక్తికరమైన విషయం ఏంటంటే, సాధారణంగా సినిమా ప్రమోషన్లకు దూరంగా ఉండే నయన్, ఈ చిత్ర ప్రచార కార్యక్రమాల్లో మొదటి నుంచే చురుకుగా పాల్గొంటున్నారు. విజయదశమి శుభ సందర్భంగా ఒక ప్రత్యేక సర్‌ప్రైజ్‌ను అనౌన్స్ చేస్తున్నట్లు మేకర్స్ తెలియజేశారు. ఇంతకుముందు చిరంజీవి ఫస్ట్ లుక్‌ను విడుదల చేస్తూ, ఆయనను స్టైలిష్ అవాతర్‌లో చూపించడం అందరినీ ఆకట్టుకుంది. టాప్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా సమీర్ రెడ్డి, ఎడిటర్‌గా తమ్మిరాజు, ఆర్ట్ డైరెక్టర్‌గా ఏఎస్ ప్రకాష్ పనిచేస్తున్నారు. ఎస్. కృష్ణ, జి. ఆది నారాయణ సహ రచయితలు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా పనిచేస్తున్నారు. 'మన శంకరవరప్రసాద్ గారు' 2026 సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.





# 'బా బా బ్లాక్ షీప్'
## మోషన్ పోస్టర్ విడుదల

**గన్స్, గోల్డ్** చుట్టూ జరిగే వేట.. ముగ్గురి తెలివి తేటలు.. ఒక రోజులో జరిగే ఘటనలు.. ఓ ఆరుగురి ప్రయాణంతో న్యూ ఏజ్ క్రైమ్ కామెడీగా 'బాబా బ్లాక్ షీప్' అనే చిత్రం రాబోతోంది. దోణెపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోణెపూడి నిర్మి స్తున్న ఈ మూవీకి గుణి మంచికంటి దర్శకత్వం వహిస్తున్నారు. టిను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్ లగుసాని, విష్ణు, కార్తికేయ, విస్మయశ్రీ, మాళవి తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. దసరా సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన కథ, కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ మేకర్స్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ చేతుల మీదుగా 'బా బా బ్లాక్ షీప్' మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేయించారు. ఈమోషన్ పోస్టర్‌నుచూస్తుంటే.. గన్స్, గోల్డ్ చుట్టూ జరిగే ఓ న్యూఏజ్ క్రైమ్ కామెడీఅని అర్థంఅవుతోంది. ఓ ముగ్గురు చుట్టూ తిరిగే కథ అంతా కూడా ఒకే రోజులో జరుగుతుందని తెలుస్తోంది. ఈ ప్రయాణంలో వారికి ఎదురైన పరిస్థితులు, ఆ పరిస్థితుల్లోంచి పుట్టే కామెడీ, ఈ జర్నీలో జరిగే క్రైమ్ ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌కి కొత్త అనుభూతిని ఇచ్చేలా కనిపిస్తోంది.

# 'మాస్ జాతర' అక్టోబర్ 31న విడుదల

**మాస్ మహారాజా** రవితేజ అభిమానులతో పాటు, తెలుగు సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మాస్ జతర' చిత్రం అక్టోబర్ 31న విడుదల కానుంది. ఈ మేరకు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. వింటేజ్ వైబ్స్, పక్కా కమర్షియల్ అంశాలతో ఈ చిత్రం థియేటర్లలో అసలుసిసలైన మాస్ పండుగను తీసుకురాబోతుంది. ఇప్పటివరకు ఈ సినిమా నుండి విడుదలైన ప్రతి కంటెంట్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకొని, వినోదాల విందుకి హామీ ఇచ్చింది. కొత్త విడుదల తేదీ ప్రకటన సందర్భంగా రవితేజ, హైపర్ ఆదిలపై చిత్రీకరించిన ఒక సరదా వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది. ఆ వీడియోలో హైపర్ ఆది 2025 సంక్రాంతి, వేసవి సెలవులు, వినాయక చవితి అంటూ పలుసార్లు సినిమా వాయిదా పడటాన్ని సరదాగా ఎగతాళి చేయగా.. ఆలస్యానికి గల కారణాలపై రవితేజ అంతే చమత్కారంగా స్పందించారు. మాస్ మహారాజా రవితేజ అంటేనే సందడి. ఒకప్పటి మాస్ మహారాజాను గుర్తుచేస్తూ.. సినిమా యొక్క ఆహ్లాదకరమైన మరియు వినోదాత్మక శైలిని చూపిస్తూ ఈ వీడియో ఎంతో ఉత్సాహభరితంగా సాగింది. ఇప్పటికే విడుదలైన 'మాస్ జతర' టీజర్‌కి అన్ని వర్గాల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ముఖ్యంగా మాస్ రాజా అభిమానులను, మాస్ ప్రేక్షకులను కట్టిపడేసింది. అలాగే, రెండు పాటలు విడుదలై శ్రోతల నుంచి భారీ ప్రశంసలు అందుకున్నాయి. అందరూ కాలు కదిపేలా ఎంతో ఉత్సాహభరితంగా స్వరపరిచిన ఈ పాటలు సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారాయి. ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ, శ్రీలీల జోడి అంటే, ప్రేక్షకులలో ప్రత్యేకమైన అంచనాలు ఉంటాయి. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఈ జోడి మరోసారి బాక్సాఫీస్ వద్ద మెరుపులు మెరిపించడానికి సిద్ధమవుతోంది. సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే రెండు పాటలతో అందరినీ మెప్పించిన ఆయన, మరోసారి మాస్ ప్రేక్షకులను తనదైన స్వరాలతో అలరించబోతున్నారు. దర్శకుడు భాను భోగవరపు మాస్ ప్రేక్షకులతో పాటు కుటుంబ ప్రేక్షకులు కూడా మెచ్చే విధంగా వాణిజ్య అంశాలతో అసలైన పండుగ సినిమాలా 'మాస్ జాతర'ను మలుస్తున్నారు. ఉత్సాహభరితమైన అవతారంలో రవితేజను చూడటానికి అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తి చూపిస్తారు. అందుకు తగ్గట్టుగానే అందరూ మెచ్చేలా మాస్ రాజాను చూపిస్తున్నారు దర్శకుడు భాను భోగవరపు. ఛాయాగ్రాహకుడు విధు అయ్యన్న అద్భుతమైన కెమెరా పనితనం, ప్రతి ఫ్రేమ్‌ను గొప్పగా తీర్చిదిద్దే నవీన్ నూలి ఎడిటింగ్ ప్రతిభ తోడై.. అసలైన పండుగ చిత్రంగా 'మాస్ జతర' రూపుదిద్దుకుంటోంది. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ పతాకాలపై 'మాస్ జాతర' చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రముఖ నిర్మాతలు సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఎక్కడా రాజీ పడకుండా భారీస్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మాస్ మహారాజా అభిమానుల దాహాన్ని తీర్చడానికి, థియేటర్లలో వినోదాల విందుని అందించడానికి అక్టోబర్ 31న 'మాస్ జాతర' సినిమా భారీస్థాయిలో విడుదలవుతోంది.






# 'ఈటీవీ విన్ అండ్ 90స్ కిడ్స్ ఎంటర్‌టైన్‌మెంట్' తొలి ప్రాజెక్టు లాంచ్

**నైన్‌టీస్ కిడ్స్** ఎంటర్‌టైన్‌మెంట్, ఈటీవీ విన్‌తో కలిసి, హైదరాబాద్‌లో జరిగిన పూజా వేడుకతో తమ తొలి ప్రొడక్షన్ ని లాంచ్ చేసింది. ఈ కార్యక్రమంలో తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు హాజరై టీంకి శుభాకాంక్షలు తెలిపారు. నిర్మాత రవిశంకర్ (మైత్రి మూవీ మేకర్స్) కెమెరా స్విచ్ ఆన్ చేశారు, దర్శకుడు హరీష్ శంకర్ ఫస్ట్ క్లాప్ కొట్టారు, నిర్మాత శీరివి ముహుర్తపు సన్నివేశానికి దర్శకత్వం వహించారు. బన్నీ వాస్, వినోద్ గాలి దర్శకత్వంలో 90స్ కిడ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై శరత్ చంద్ర నాయుడు నిర్మించిన ఈ ప్రాజెక్ట్, బలమైన భావోద్వేగాలతో కూడిన బడ్డీ కామెడీ, ఫ్యామిలీ ఎంటర్టైనర్. ఇది అన్ని వయసుల ప్రేక్షకులను అలరించేలా వుంటుంది.
తారాగణం: విరాజ్ అశ్విన్, ప్రియ దర్శిని రామ్, బాబు మోహన్, యశశ్రీ రావు, పవన్ సిద్ధు, టేస్టీ తేజ, సూర్య గోపీనాథ్, శివన్నారాయణ.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.